దేశద్రోహ చట్టాన్ని రద్దు చేయాలి

- సిపిఎం డిమాండ్

8

www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 17 No విజయవాడ, శుక్రవారం 18 జనవరి 2019 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

సాయ్ కేంద్రంపై సిబిఐ దాడులు

- డైరెక్టర్ సహా ఆరుగురి అరెస్ట్

12



బొగ్గు గనిలో ఒకరి మృత దేహం లభ్యం

న్యూఢిల్లీ : మేఘాలయలోని తూర్పు జయంతియా హిల్స్‌లో బొగ్గు గనుల్లో చిక్కుకుపోయిన 15 మంది కార్మికుల్లో ఎట్టకేలకు ఒకరి మృతదేహం గురువారం లభ్యమైంది. ఉపరితలానికి 60–210 అడుగుల లోతులో నావీ గజ ఈతగాళ్లు విస్తృతంగా గాలించి అతి కష్టం మీద ఒక కార్మికుని మృతదేహం కనుగొన్నారు. మిగతా వాటికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నీటితో నిండిన గని బావిలో గంధకపు ధాతువులు మిగతా 9లో

వేడి రాజుకుంది!

- బాబు దావోస్ పర్యటన రద్దు
- అదే బాటలో జగన్ లండన్ టూర్
- జనసేన పార్లమెంటరీ కసరత్తు పూర్తి
- ఎన్నికల వ్యూహాల్లో నేతలు బిజీ బిజీ



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది. శరవేగంగా మారతున్న రాజకీయ పరిణామాలు ఎటువంటి మలుపు తిరుగుతాయోనన్న ఆందోళన అగ్రనేతల్లో నెలకొంది. దీంతో ముందుగా ఖరారు చేసుకున్న కార్యక్రమాలను సైతం రద్దు చేసుకుని ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమవుతున్నారు. ఈ దిశలో గురువారం చోటు చేసుకున్న రెండు కీలక సంఘటనలు చోటుచేసుకున్నాయి. దావోస్ పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేసుకోగా, వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి కూడా లండన్ పర్యటన విషయంలో అదే విధమైన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం ఈ నెల 22వ తేది చంద్రబాబు నేతృత్వంలోని బృందం దావోస్‌కు వెళ్ళి, ఐదు రోజుల పాటు అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిఉంది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. అయితే, మంత్రులతో గురువారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ పర్యటనను రద్దు చేసుకోవడమే మేలన్న అభిప్రాయం వ్యక్తమైంది. టిఆర్ఎస్ నేతలు జగన్‌తో భేటీ కావడం, దగ్గుబాటి కుటుంబం వైసిపిలో చేరనుందన్న వస్తున్న వార్తలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారినిక అకస్మికంగా మార్చడం కూడా ప్రస్తావనకు వచ్చింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున రెండు పార్టీల్లోనూ వలసలు చోటుచేసుకునే అవకాశం ఉందని, ఈ కీలకమైన సమయంలో చంద్రబాబు అన్ని రోజుల పాటు రాష్ట్రానికి దూరంగా ఉండటం మంచిది కాదన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైనట్లు తెలిసింది. దీంతో, చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు చేసుకున్నారు. అయితే, లోకేష్‌తో పాటు ఇతర మంత్రుల బృందం దావోస్‌కు వెళ్లనుంది. శుక్రవారం నాటి బాబు కోల్‌కత్తా పర్యటనలో ఎటువంటి మార్పు లేదని టిడిపి వర్గాలు తెలిపాయి. ఇటీవల సుదీర్ఘ పాదయాత్రను ముగించిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి లండన్‌లో చదువుకుంటున్న తన కుమార్తె వద్దకు శుక్రవారం వెళ్లనున్నారని, అక్కడే కొద్దిరోజులు ఆయన గడపనున్నారని వార్తలు వచ్చాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు సమాచారం వచ్చిన కాసేపటికే, జగన్ టూర్‌కూడా రద్దు అయింది. అయితే, జగన్ లండన్ వెళ్లనున్నట్లు తాము అధికారికంగా ప్రకటించనే లేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

మొత్తం మీద ఈ ఇరువురు నేతలు రానున్న రోజుల్లో రాజకీయ కార్యకలాపాలనే పూర్తిగా దృష్టి సారించనున్నారు. మరోవైపు జనసేన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల కసరత్తును దాదాపుగా పూర్తిచేసింది. గురువారం సాయంత్రానికి ఈ ప్రక్రియ పూర్తయినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకటి, రెండు రోజుల్లోనూ పార్లమెంటరీ స్థాయి కమిటీలను పవన్‌కళ్యాణ్ ప్రకటిస్తారని, ఆ వెంటనే శాసనసభ నియోజకవర్గాలపై దృష్టి సారించనున్నారని సమాచారం.

దాడుల నుండి రక్షణ కల్పించండి



- శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళల విజ్ఞప్తి
- నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : ఇటీవల శబరిమల ఆలయంలోకి వెళ్లి చరిత్ర సృష్టించిన ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందులు తమకు రక్షణ కల్పించాలంటూ సుప్రీంకోర్టును గురువారం ఆశ్రయించారు. తక్షణ విచారణ చేపట్టాలంటూ దాఖలైన ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గగోయ్, జస్టిస్ ఎల్ఎన్‌రావు, ఎస్‌కె కౌల్‌తో కూడిన ధర్మాసనం అంగీకరించింది. దాడుల నుండి భద్రత కల్పించాలని, వారిని సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఉంచాలని వారి తరపున వాదిస్తున్న మిగతా 9లో

రైతులు, వ్యవసాయ కార్మికుల సభ



గురువారం నాడు పశ్చిమ బెంగాల్‌లోని ప్లాసీలో రైతులు, వ్యవసాయ కార్మికుల భారీ ర్యాలీనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎఐకెఎస్ నేత విజూ కృష్ణన్ 8

రాష్ట్ర సిఇఓగా జికె ద్వివేది

- సిసోడియా ఆకస్మిక బదిలీ
- కేంద్ర జోక్యంపై అనుమానాలు
- గతంలో పురందేశ్వరి పిఎస్‌గా గోపాలకృష్ణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ –సిఇఓ) ఆర్‌పి సిసోడియా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన సిఇఓగా ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న గోపాల కృష్ణ ద్వివేది నియమితులైనారు. గురువారం అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామం కలకలం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం ఉలికిపడింది. సిఇఓ బదిలీకి సంబంధించి ఎటువంటి ముందస్తు కసరత్తు జరగకపోవడంతో ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయంపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూతన సిఇఓగా నియమితులైన గోపాలకృష్ణ ద్వివేది గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన పురందేశ్వరి వద్ద ప్రైవేటు సెక్రటరీగా పనిచేశారు. 2010 సెప్టెంబర్ నుండి 2014 సెప్టెంబర్ వరకు ఆయన ఈ బాధ్యతలు నిర్వహించారు. తొలుత మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న పురందేశ్వరి ఆ తరువాత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా మారినప్పటికీ ఆమె ప్రైవేటు సెక్రటరీగా ద్వివేది కొనసాగారు. ప్రస్తుతం పురందేశ్వరి బిజెపిలో ఉన్న విషయం తెలిసిందే. ఆమెకు, చంద్రబాబుకు మధ్య ఉన్న రాజకీయ వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా ఆమె వైసిపిలో చేరే అవకాశం ఉందన్నట్టూ వార్తలు వస్తున్నాయి. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డికి, నరేంద్రమోడీకి మధ్య సత్సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలూ తెలిసిన విషయమే! ఈ నేపథ్యమే గోపాలకృష్ణ ద్వివేది నియమాకాన్ని సందేహాస్పదం చేసింది. మరోవైపు సిఇఓ బదిలీకి సంబంధించి ఎటువంటి ముందస్తు కసరత్తు జరగకపోవడం కూడా రాష్ట్ర ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సిఇఓని మార్చాలంటే ముందుగా ఎన్నికల కమిషన్‌కు ముగ్గురు అధికారులతో ప్యానెల్ పంపించాల్సి ఉంటుంది. ఆ తరువాత వారిలో ఒకరిని సిఇఓగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఖరారు చేస్తుంది. ఈ ప్రక్రియ జరగడానికి కనీసం పదిహేను రోజులైనా పడుతుంది. అటువంటి కసరత్తేమి జరగలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. తనను మార్చబోతున్నారన్న సంకేతాలు కూడా సిసోడియాకు లేవని సమాచారం.

భర్త కిరాతకం

- నిప్పంటించిన ఘటనలో భార్య, కుమార్తె, కుమారుడు మృతి

ప్రజాశక్తి–బనగానపల్లె

కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు. పిల్లల ఆలనపాలన చూడాల్సిన కన్న తండ్రి కనికరం లేకుండా భార్య, పిల్లలపై డీజిల్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. ఈ సంఘటన కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం పండ్లాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన పుట్టా శివరామయ్య, వెంకటలక్ష్మమ్మ(35) భార్యభర్తలు. వీరికి పవన్ కుమార్ (12), పావని (9) పిల్లలు ఉన్నారు.

బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య వివాదం జరగడంతో భార్య వెంకటలక్ష్మమ్మ, పిల్లలు పవన్‌కుమార్, పావనిలను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు డీజిల్ పోసి నిప్పంటించినట్లు మృతురాలి తండ్రి గోవిందరాజులు, సోదరుడు వెంకటాద్రిలు తెలిపారు. సమాచారం అందిన వెంటనే నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణ, పాణ్యం ఇన్‌ఛార్జి సిఐ రవికృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి హత్యకు గల కారణాలపై విచారణ చేశారు. మృతురాలి తండ్రి, సోదరుడు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త, అత్తలపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.




విశ్వాసపరీక్షలో గట్టెక్కిన థెరిసా...!

- 29న బ్రెగ్జిట్ ప్లాన్ బి పై పూర్తి స్థాయి చర్చ, ఓటింగ్
- ప్రతిష్టంభన తొలగించేందుకు పార్టీల నేతలతో, ఎంపీలతో చర్చలు
- బ్రెగ్జిట్ ప్లాన్‌బికి సహకరించండి: ప్రధాని
- భారీ మార్పులు అవసరమన్న ప్రతిపక్షాలు

9

ఎలక్షన్ మాఫీ!





- రైతులను ఆకర్షించే ఎత్తు
- సరిగ్గా ఎన్నికల ముందు పంపిణీ
- 36 లక్షల మందికి లబ్ధి
- చివరి రెండు కిస్తీల జమకు కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి– అమరావతి

నిధుల కొరత పేరుతో ఇంతకాలం నానబెట్టిన రుణ మాఫీ నాలుగు, ఐదు కిస్తుల చెల్లింపులను సరిగ్గా ఎన్నికలకు ముందర చేసి రైతులను కొంత మేరకైనా ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోంది. చివరి రెండు వాయిదాలను ఒకేసారి ఇస్తే గరిష్టంగా ఒక్కొక్కరికి రూ.60 వేల వంతున ప్రయోజనం కలుగుతుందని అంచనా వేసింది. దాదాపు 36 లక్షల మందికి లబ్ధి చేకూరుతున్నందున రైతుల్లో సానుకూలత పొందవచ్చని లెక్కలేసింది. తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల్లో నెలకొన్న వ్యతిరేకతను పోగొట్టేందుకు ఎన్నికల ఏడాదిలో ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి అందించిందని, ఇక్కడ కూడా అదే తరహాలో ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న రుణ మాఫీ కిస్తులను చెల్లిస్తే అన్నదాతల్లో అసంతృప్తిని కొంతలో కొంతైనా తగ్గించొచ్చని ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ఈ పాటికే పూర్తవ్వాలి

పలు వడపోతల తర్వాత రైతులకు ఐదేళ్లల్లో ఐదు దఫాలుగా ఏడాదికి 20 శాతం చొప్పున మాఫీ సొమ్ము చెల్లిస్తామంది ప్రభుత్వం. చెల్లింపునకు జాప్యం చేసినందున పది శాతం వడ్డీ కూడా కలిపి బ్యాంక్ ఖాతాల్లో వేస్తామంది. ఒక్కో రైతుకు గరిష్ట మాఫీ రూ.లక్షన్నర అని పరిమితి విధించగా, ఏడాదికి రూ.30 వేలు ఇవ్వాలి. కాగా ఆచరణలో ఆ మేరకు సైతం ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ పదవీ కాలం మరో ఆర్నెల్లలో ముగుస్తున్నప్పటికీ ఇంకా నాలుగు, ఐదు దఫాల మాఫీ సొమ్ము చెల్లించలేదు. బడ్జెట్‌లో నాల్గవ విడతకు రూ.4,100 కోట్లు ప్రతిపాదించగా ఇప్పటి వరకు నయాపైసా కూడా విడుదల చేయలేదు. ఐదవ విడత కూడా ఇప్పుడే ఇవ్వాలంటే మరో రూ.4 వేల కోట్లు కావాలి. రెండు కిస్తులూ కలిపి రూ.8 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ మేరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రైతు సాధికార సంస్థ ద్వారా రుణాలు తీసుకొనేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

ప్రతిపక్షాలకు అస్త్రం కాకూడదనే...

ఈ ప్రయత్నాలు సఫలమైతే ఫిబ్రవరి మధ్య నుంచి రెండు కిస్తుల సొమ్మునూ రైతుల ఖాతాల్లో జమ చేయడం మొదలవుతుంది. ఐదేళ్లకు కూడా మాఫీ కిస్తులు చెల్లించకపోతే ఎన్నికల్లో ఈ అంశం ప్రతిపక్షాలకు పెద్ద ప్రచారాస్త్రం అవుతుందన్న ఆందోళనలో టిడిపి సర్కారు ఉంది. అందుకే వీలైన మేరకు ఎన్నికల్లోపు మాఫీ సొమ్ము చెల్లింపులు ప్రారంభించాలని యోచిస్తోంది.

ఐఏఎస్‌ల బదిలీలు

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐదు మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేట గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్న ఆర్పీ సిసోడియాను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉన్న కె భాస్కర్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా, విశాఖ జిల్లా కలెక్టర్‌గా ఉన్న ప్రవీణ్ కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రభుత్వ కార్యదర్శి (రాజకీయ) గా ఉన్న ఎన్ శ్రీకాంత్‌కు సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్)గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ కమిషనర్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న కె దమయంతికి పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులకు హక్కుల వేదిక వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణకు వికలాంగుల హక్కుల వేదిక నాయకులు కోరారు. ౧విజయవాడలోని దాసరి భవన్, శ్రీశ్రీ భవన్‌లో గురువారం వారిని కలిసి తమ సమస్యల పరిష్కారానికి తోడ్పానందించాలని కోరారు. అనంతరం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, జాతీయ కార్యదర్శి పోసి కుమార్, రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ వికలాంగుల సమస్యలపై ఈ నెల 31న విజయవాడ ధర్నా చౌక్ వద్ద 24 గంటల మహా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ౦తకు ముందు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక క్యాలెండర్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చోడంపూడి మాణిక్యాల రావు, నాయకులు తీగల ఆంజనేయులు, తిరుపతిరావు, యేసు, వెంకటేశ్వర్లు, ఎన్ శివశంకర్, మైనర్‌బాబు, బలరాంకృష్ణ పాల్గొన్నారు.



కొనసాగుతున్న పొగమంచు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో పగలు, రాత్రి పొగమంచు కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణం కేంద్రం అధికారులు గురువారం రాత్రి వెల్లడించారు. పగటిపూట, రాత్రి వేళల్లో కొద్దిరోజుల పాటు మంచు వాతావరణం ఉంటుందని, ఆకాశం నిర్మలంగా ఉంటుందని తెలిపారు. మరి కొద్దిరోజుల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రవేత్త రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.


ప్రజ్ఞ

1. వెనుజులా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయింది?
2. ఒక రంజీ ట్రోఫీ సీజన్‌లో అత్యధిక వికెట్ల తీసి రికార్డు నెలకొల్పింది?
3. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకుని వచ్చిన తొలి రాష్ట్రం?
4. ఒక కుటుంబం, ఒక ఉద్యోగం పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
5. మధ్యప్రదేశ్ ప్రభుత్వం నూతన ఏర్పాటు చేసిన అవార్డు?

సమాధానాలు 7లో

అసూయపరులు కుట్ర చేస్తున్నారు

- పేదల సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- టిడిపిపై షర్మిల ఫిర్యాదు దురదృష్టకరం
- తలసాని వ్యాఖ్యలపై ఆగ్రహం
- టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పింఛన్ల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతిని మించి సంబరాలు నిర్వహించుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. పార్టీ బాధ్యులు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో ఎలక్షన్ మిషన్-2019 పేరుతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు ఐదేళ్ల కాలంలో పది రెట్లు పెంచడం ఓ చరిత్ర అన్నారు. ప్రజల్లో టిడిపి పట్ల పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసిపి, టిఆర్ఎస్, బిజెపి రాష్ట్రంపై కుట్రలు చేస్తున్నాయన్నారు. ఎపి అంటే నరేంద్రమోడీకి అసూయ అని, గుజరాత్ కంటే మించిపోతుందనే భయం ఉందన్నారు. ఏపీ అభివృద్ధి చెందకూడదని కెసిఆర్ పంతమని, అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వస్తుందని జగన్‌కు భయమన్నారు. అసూయపరులంతా ఏకమై కుట్రలు పన్నుతున్నారన్నారు. తెలంగాణలో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టారని, ఏపీలో కులాల చిచ్చు రగిలిస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రాంతాల మధ్య చిచ్చు రగిలించాలని కు ట్రలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు స్పందన లేదని అందుకే హడావుడిగా జగన్‌తో బుధవారం కెటిఆర్ భేటీ అయ్యారన్నారు. ఇద్దరి భేటీతో ముసుగు తొలిగిందన్నారు. ఎపికి హోదా ఇస్తే మాకూ ఇవ్వాలని కెసిఆర్ అన్నారని, షెడ్యూలు9,10 సంస్థల విభజనకు అడ్డంకులు పెట్టారన్నారు. చివరికి సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయనివ్వడం లేదన్నారు. బిజెపి ఎజెండా అమలు చేసేందుకే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నారని, దేశ ప్రజలను గందరగోళ పరచడమే వీరి లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. టిడిపిపై వైయస్ షర్మిళ ఫిర్యాదు చేయడం దురదృష్టకరమన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగపరిచింది వైసిపినే అనిఅన్నారు. సిబిఐ జెడి లక్ష్మీనారాయణపై తొలుత దుష్ప్రచారం చేసింది వైసిపీనే నన్నారు. జగన్‌పై విచారణ చేయకుండా కుట్రలు చేశారన్నారు.. చివరికి న్యాయమూర్తులకు కూడా ఇబ్బందులు కల్పించారని చంద్రబాబు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పెళ్లిళ్ల పై కూడా అసభ్యంగా మాట్లాడారని అన్నారు. నాకుటుంబ సభ్యులపై దుష్ప్రచారం చేశారని వైసిపి వ్యవహారశైలిని చంద్రబాబు తప్పుపట్టారు. సోషల్ మీడియాను ఎవరు దుర్వినియోగం చేసినా చర్యలు తీసుకుంటామని, హద్దులు దాటితే కఠినంగా వ్యవరిస్తామన్నారు.

ఆలయాల దర్శనానికి వచ్చిన తెలంగాణ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాజకీయ వ్యాఖ్యలు చేయడం పట్ల సిఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై టిఆర్ఎస్ నేతలు ఏపీ పర్యటనకు వచ్చినపుడు టిడిపి నేతలు ఎవరూ పాల్గొనరాదని, ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు పార్టీ నేతలను హెచ్చరించారు. బంధుత్వాలు, స్నేహాలు వ్యక్తిగతంగా చేసుకోవాలని, స్నేహాల పేరుతో పార్టీని పణంగా పెట్టరాదన్నారు. తెలంగాణలో 26 కులాలను బిసి జాబితానుంచి తొలగించారని, కళింగ, తూర్పు కాపు, గవర, శెట్టిబలిజ తదితర కులాలను తొలగించి బిసిలకు అన్యాయం చేసి, ఏపీలోకి వచ్చి అదే బిసిలపై టిఆర్ఎస్ నేతలు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. బిసిలకు అన్యాయం చేసిన వారితో జగన్ అంటకాగుతున్నారని, రాబోవు ఎన్నికల్లో బిసి కులాలే తగిన బుద్ధి చెబుతారని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

రాకేశ్ అస్థానా బదిలీ



న్యూఢిల్లీ : సిబిఐలో గురువారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాతో పాటు మరో ముగ్గురు అధికారులను సంస్థ నుంచి బదిలీ చేస్తు కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది. అస్థానాతో పాటు జాయింట్ డైరెక్టర్ అరుణ్ కుమార్‌శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీశ్‌కుమార్ సిన్హా, సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ జయంత్ జె. నైక్నవరే సిబిఐ నుంచి బదిలీ చేస్తూ కాబినేట్ నియామకాల కమిటీ గురువారం నిర్ణయం తీసుకుంది. సిబిఐ డైరెక్టర్‌గా ఆలోక్ వర్మకు ఉద్వాసన పలికిన వారం రోజుల వ్యవధిలోనే ఈ అస్థానా విషయంలో ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. అలాగే సిబిఐకి నూతన డైరక్టర్‌ను నియమించే ముందు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24న ప్రధాని మోడీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిబిఐ కొత్త చీఫ్‌పై నిర్ణయం తీసుకోనుంది. కాగా, అస్థానా, కుమార్ శర్మలు గుజరాత్ క్యాడర్‌కు చెందిన అధికారులు కాగా, సిన్హా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన, నైక్నవరే మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన అధికారులు. వీరు మళ్లీ తమ సొంత క్యాడర్‌లకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఆలోక్ వర్మ, రాకేశ్ అస్థానాలు ఒకరిపైమరొకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వీరిద్దరినీ బలవంతపు సెలవుపై కేంద్రం పంపింది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ ఆలోక్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆలోక్‌కు తిరిగి పగ్గాలు అప్పగించాల్సిందిగా తీర్పు ఇచ్చింది. అయితే ప్రధాని మోడీ సారథ్యంలోని కమిటీ ఆలోక్ వర్మను పదవీ నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

రాజధాని గ్యాలరీ వాక్‌కు కోటి!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొద్ది రోజుల క్రితం నిర్వహించిన అమరావతి రాజధాని గ్యాలరీ వాక్‌కు చేసిన ఖర్చు అక్షరాలా కోటి రూపాయలు. ఇంత పెద్ద మొత్తాన్ని ఒక కార్యక్రమం కోసం ఖర్చు చేయడంపై వివిధ శాఖల ఉన్నతాధికారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన రాజధానిలో వెల్‌కమ్ గ్యాలరీ వాక్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన బాధ్యతలను నేరుగా ప్రభుత్వమే చేపట్టకుండా ఒక ప్రయివేటు సంస్థకు అప్పగించారు. నిర్మాణానికి సహకరించిన వారి వివరాలు ప్రదర్శించడం, ఆహూతులకు కావాల్సిన సౌకర్యాలు, 54 మంది అత్యున్నత ప్రముఖులు కూర్చొనేందుకు కావాల్సిన సీటింగ్, హై టీ ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలను ఈ సంస్థ ఏర్పాటు చేసింది. ఈ మొత్తం కార్యక్రమ నిర్వహణకు కోటి రూపాయలు ఖర్చు అయినట్టు ఆ సంస్థ లెక్కలు సమర్పించింది. ఇది కాకుండా మరికొన్ని శాఖలు కూడా నిధులు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఇంత భారీ మొత్తంలో ఒక కార్యక్రమానికి నిధులు చెల్లించడానికి ఆర్థికశాఖ తొలుత అభ్యంతరం చెప్పినప్పటికీ పై స్థాయి నుండి వచ్చిన ఒత్తిడితో అంగీకరించినట్లు సమాచారం. గతంలో పోలవరం గ్యాలరీ వాక్‌కూ భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేయడంపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.



(ఫైల్)

హెచ్‌సీయూలో ఉద్రిక్తం

- వర్సిటీ గేటు వద్ద ప్రజాసంఘాల నేతల అడ్డగింత
- రోహిత్ తల్లి రాధికనూ అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో మరోసారి ఉద్రిక్తత నెలకొన్నది. పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మూడో వర్ధంతి సభకు హాజరయ్యేందుకు రోహిత్ తల్లి రాధిక వేములతో పాటు వివిధ దళిత, ప్రజాసంఘాల నేతలు వర్సిటీకి వచ్చారు. దీంతో వారిని పోలీసులు వర్సిటీ గేటు వద్ద అడ్డుకున్నారు. వర్సిటీలోకి బయటి వ్యక్తులకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు.

దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వివాదం నెలకొన్నది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటు వరకూ భారీర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున్న వీసీ అప్పారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విద్యార్థినేతలతో చర్చలు జరిపి, ముఖ్యనేతలను వర్సిటీలోకి పంపించేందుకు అనుమతించారు. దీంతో రాధిక వేములతో పాటు పలువురు దళిత నేతలు వెలివాడ వరకూ ర్యాలీగా వెళ్లారు. రోహిత్ వేముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాధిక వేముల మాట్లాడుతూ...తనకొడుకు రోహిత్ చావుకు వీసీ అప్పారావే కారణమని అన్నారు. అతన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుతున్నాయని విమర్శించారు. రోహిత్ మ తికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మూడేండ్ల నుంచి పోరాటం నిర్వహిస్తున్నారనీ, చర్యలు తీసుకునే వరకూ పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వర్ధంతి సభలో ఫాతిమా నఫీజ్ (జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ తల్లి), మ్యాదరి రాజు(మ్యాదరి వెంకటేశ్ సోదరుడు), అడ్వకేట్ జై భీంరావ్, పుల్యాల రవి(పుల్యాల రాజు సోదరుడు), పెరుమల్ల బాలస్వామి(ప్రణయ్ తండ్రి), అనూప్ కుమార్, డాక్టర్ కేవీ రత్నం, జేబీరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

క్వింటాలు రూ.1,550

తడిసిన ధాన్యాన్ని కొననున్న సర్కారు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పెథాయి తుపాను వలన తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1,550కి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తడిసిన ధాన్యం రైతుల వద్ద మూడు లక్షల టన్నులుంటుందని అంచనా వేసిన సర్కారు ఆ మొత్తాన్నీ ఎలాంటి నిబంధనలూ లేకుండా కొంటుంది. అందుకోసం రూ.465 కోట్లు వెచ్చిస్తోంది. తడిసిన ధాన్యం కొనుగోలుపై చర్చించేందుకు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రి నక్కా ఆనందబాబు కూడా పాల్గొన్నారు. కేంద్రం ఎలాంటి సాయమూ చేయకపోయినా రాష్ట్రం తన స్వంత నిధులతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని సోమిరెడ్డి పేర్కొన్నారు. కాగా కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)పై తడిసిన వడ్లను కొనాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై కేశవరావు, కార్యదర్శి పి పెద్దిరెడ్డి మంత్రులను కోరారు. తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు అస్సలు కొనట్లేదని, ఒక వేళ కొన్నా రూ.900 నుంచి 1,100 లోపేనని చెప్పారు. అందుకే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పి కంటే రూ.200 తగ్గించి రూ.1,550కి రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొంటుందని మంత్రులు హామీ ఇచ్చారు. తుపాను వలన పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సుమారు నాలుగు లక్షల టన్నుల ధాన్యం తడిసిందని, అందులో లక్ష టన్నులను ఇప్పటికే రైతులు అమ్ముకున్నారని, తతిమ్మా మూడు లక్షల టన్నులను సర్కారు కొంటుందని వివరించారు. సమావేశానికి తెలుగు రైతు సంఘం నాయకులు ఆంజనేయులు హాజరయ్యారు.

జగన్ ఎంతకైనా దిగజారతాడు

షర్మిల వివాదంపై మంత్రి సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం పదవి కోసం ప్రతిపక్ష నేత జగన్ ఎంతకైనా దిగజారతారని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు సోషల్ మీడియాలో షర్మిలపై వస్తున్న అసభ్య ప్రచారమే నిదర్శనమన్నారు. షర్మిళపై వస్తున్న ఆరోపణలను 2014లోనే ప్రబాస్ ఖండించారని, ఐదేళ్ల తరువాత మరలా ఆ విషయాన్ని కావాలనే తెరమీదకు తెచ్చారన్నారు. షర్మిళపై అసభ్య ప్రచారం బాధాకరమని, సోషల్ మీడియాకు ప్రస్తుతం అందరూ బాధితులేనని సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. వైసిపి ప్రత్యేకంగా సోషల్ మీడియా విభాగం ఏర్పాటు చేసుకుని టిడిపి మహిళా నేతలపై అసభ్యంగా ప్రచారం చేస్తోంది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇటువంటి పోకడలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తేవాలని కోరారు. జనసేన అధినేత పవన్‌పై జగన్ ఎలాంటి వ్యాఖ్యలు చేశారో అందరికీ తెలుసన్నారు. షర్మిలా వ్యవహారంలో సిఎం చంద్రబాబు పాత్ర ఉందని చెప్పడం సబబు కాదన్నారు. ఎపి పోలీసులపై నమ్మకం లేదని వైసిపి నేతలు తెలంగాణాలో కేసులు పెడుతున్నారు.

చర్మకారులకు పింఛన్ ఘనత మాదే

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చర్మకారులకు పింఛన్‌ను అమ లు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, డప్పుకళాకారులకు సైతం పింఛన్‌ను అమలు చేసి చరిత్ర సృష్టించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్‌లో మంత్రి జవహర్ నేతృత్వంలో కళాకారుల బృందం సిఎంను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల పాలనలో లోటు బడ్జెట్ ఉన్నా దళితులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు.. లిడ్ క్యాప్ ద్వారా దళితుల్లోని మాల, మాదిగ వర్గాలకు సమాన ప్రాతినిథ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. డప్పు కళాకారులు గ్రామగ్రామాన తిరిగి టిడిపి పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని చంద్రబాబు కళాకారులను కోరారు.

చంద్రబాబుతో డిజిపి అత్యవసర భేటీ

- పోలీసు కస్టడీకి కిడారి హత్య కేసు నిందితులు
- నేడు విచారణకు రానున్న జగన్‌పై దాడి కేసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర డిజిపి ఆర్‌పి ఠాగూర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో గురువారం రాత్రి ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కీలక కేసులు ఎన్‌ఐఎ కోర్టులో విచారణ కొనసాగుతుండటం, జగన్‌పై దాడి కేసుకు సంబందించి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో ఎన్‌ఐఎ దర్యాప్తుపై పిటీషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో వీరి భేటీ అత్యంత కీలకంగా మారింది. ప్రతిపక్షనేత, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసును సంబంధించి చర్చించారు. జగన్‌పై దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఎ)కు అప్పగించడంపై హైకోర్టులో పిటీషన్ వేసే అంశం గురించి చర్చించినట్లు తెలుస్తోంది. విశాఖ జిల్లా దుంబ్రిగుంట మండలం లివిటిపుట్టు గ్రామంలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల హత్య కేసులో ఇద్దరు నిందితులను మరో ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎడ్డల సుబ్బారావు, ఈశ్వరి , జమ్మిల శోభన్, కొర్రా కమల, డి. ధర్మయ్యలను ఎన్‌ఐఎ సిబ్బంది గురువారం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల్లో ఇద్దరిని ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు అధికారులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఐదు రోజులపాటు కస్టడీకి ఇస్తున్నట్లు న్యాయమూర్తి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి పార్థసారది ఆదేశాలు ఇచ్చారు. ఈశ్వరి, కొర్రా కమలకు ఈనెల 31 వరకు రిమాండ్ విధించగా, ధర్మయ్యకు ఈనెల 24వరకు రిమాండ్ విధించారు. మరో నిందితుడు పంగి నరసయ్య తనకు అనారోగ్యం ఉన్నందున కోర్టుకు హాజరుకాలేనని కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నట్లు తెలిసింది. నిందితుల తరపున వాదిస్తున్న న్యాయవాధులు అందుబాటులో లేకపోవడంతో సుబ్బారావు, శోభన్, ఈశ్వరిలకు విజయ వాడకు చెందిన సి.మల్లికార్జున శర్మను సహాయకుడిగా నియమించారు. కొర్రా కమల, ధర్మయ్య, ఆర్, యువరాజ్‌ను న్యాయ సహాయకునిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

జగన్‌పై దాడి కేసు విచారణ నేటికి వాయిదా:

విశాఖ ఎయిర్‌పోర్టులోని విఐపి లాంజ్‌లో ప్రతిపక్షనేత జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసు విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. .ఈ కేసులో సిట్ పోలీసులు రికార్డులు ఇవ్వడం లేదని , దర్యాప్తుకు సహకరించడం లేదని ఎన్‌ఐఎ దాఖలు చేసిన పిటీషన్‌పై వాద ప్రతివాదాలు గురువారం జరిగాయి. శుక్రవారం నిందితుడు శ్రీనివాసరావును కోర్టులో హాజరుపరిచే వకాశమున్నట్లు సమాచారం. ఇది ఇలా ఉంటే పోలీస్ ఉన్నతాధికారులు ఎన్‌ఐఎ వాదనను తప్పుపట్టారు.

టిడిపిలో చేరిన మాజీ మంత్రి అహ్మదుల్లా

కడప ఇన్‌ఛార్జీగా అర్షద్ నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కడప జిల్లాకు చెందిన మాజీ మంత్రి అహ్మదుల్లా , ఆయన కుమారుడు అర్షబ్, చిత్తూరు జిలా ్ల సత్యవేడు నుంచి జెడి రాజశేఖర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గురువారం రాత్రి ఉండవల్లిలో టిడిపిలో చేరారు. ఈసందర్భంగా అహమ్మదుల్లా మాట్లాడుతూ పేదలకు చంద్రబాబు చేస్తున్న మంచి పనులను చూసి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. నిధుల కొరత ఉన్నా పది రెట్లు పెన్షన్లు పెంచడం సాహసోపేతమన్నారు. పులివెందులకు నీళ్లిచ్చారని, కడపలో హజ్ హౌస్ నిర్మిస్తున్నారని అహ్మదుల్లా తెలిపారు.. అహ్మదుల్లాతో పాటు కడప జిల్లాకు చెందిన మైనార్టీ నేతలు, టిడిపిలో చేరారు. ఈ సమావేశంలో కడప ఇన్‌ఛార్జి మ ంత్రి సోమిరెడ్డి చ ంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప ఇన్‌ఛార్జీగా అర్షద్

కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీగా అర్షద్‌ను సిఎం చంద్రబాబు గురువారం రాత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తానని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేస్తామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోడీ : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేరళలో ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రసంగం ప్రజాస్వామ్యాన్ని కించపరిచే రీతిలో ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మోడీ బీజేపీ నాయకుడు కనుక ఆయన స్థాయిలో రాజకీయాలు మాట్లాడడంలో తప్పులేదన్నారు. అయితే కేరళలో రాష్ట్రంలో వామపక్షాలు అవలంభిస్తున్న వైఖరి ముఖ్యంగా శబరిమల విషయంలో ప్రభుత్వమే సొంతంగా నిర్ణయాలు చేసి అమలు చేసినట్లుగా మోడీ ప్రచారం చేయడం దారుణమన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉంది కనుక వారు సుప్రీం తీర్పును అమలు చేస్తున్నారన్నారు. ఒకవేళ తీర్పు నచ్చకపోతే దానిపై మళ్లీ రివ్యూ పిటీషన్ వేసి దానిపై కోర్టు మళ్లీ ఏదైనా చెబితే ఆవిధంగా నడచుకోవాల్సి ఉందన్నారు. ప్రధాని మోడీకి న్యాయవ్యవస్థపై గౌరవం ఉందా? లేదా? అనేది ఆయనే తేల్చుకోవాలన్నారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టు తీర్పును అమలుచేసిన రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని గండికొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. మోడీ మాట్లాడే తీరును చూస్తుంటే కమ్యూనిస్టు వ్యతిరేకత ఆయన నరనరాల్లో పూర్తిగా జీర్ణించుకపోయినట్లు కనిపిస్తోందన్నారు. ఏ మతస్థులైనా వివిధ వర్గాలు, ప్రజల మనోభావాలను గౌరవించే సంస్కృతి కమ్యూనిస్టులకు ఉందన్నారు. ప్రధాని మోడీ హుందాగా వ్యవహరించి తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రామకృష్ణ డిమాండు చేశారు.

అతిగా స్పందించిన చంద్రబాబు

జగన్‌పై దాడి కేసును కేంద్రం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ)కు అప్పగించడంపై సీఎం చంద్రబాబు కాస్త అతిగా స్పందించారని రామకృష్ణ అన్నారు. దాడి జరిగిన చాలా సేపటి తర్వాత మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇదంతా డ్రామా అటూ నీరుగార్చే ప్రయత్నాలు చేశారన్నారు. విమానాశ్రయంలో జరగిన దాడి కనుక ఇది రాష్ట్ర పరిధిలోకి రాదని, కేంద్రానికి సంబంధించిందని స్వయంగా చంద్రబాబే చెప్పారన్నారు.

సంక్రాంతికి సెలవు ఇవ్వలేదని..
విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



సంక్రాంతి పండగకు సెలవు ఇవ్వలేదని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఉదంతం కర్నూలు నగరంలో గురువారం జరిగింది. 2వ పట్టణ సిఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలులోని కొత్తపేటకు చెందిన టికె హరిక్రిష్ణ (26) నాగలాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సంక్రాతి పండుగకు సెలవు ఇవ్వాలని కోరగా అధికారులు నిరాకరించారు. ప్రస్తుతం హరిక్రిష్ణ తల్లి గతేడాది చనిపోవడం, తండ్రికి ఆరోగ్యం బాగాలేకపోవడం, మరోపక్క పని ఒత్తిడి అధికంగా ఉండడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలిసిన సిఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి అన్న టికె శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పురస్కారం ప్రదానం



విజయనగరంలో చాసో పురస్కారం అందుకుంటున్న వేంపల్లి షరీఫ్

వేంపల్లి షరీఫ్‌కు చాసో పురస్కారం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

చాసో 24వ స్ఫూర్తి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కథా రచయిత వేంపల్లి షరీఫ్ గురువారం అందుకున్నారు. విజయనగరంలోని గురజాడ ప్రాంగణంలోని చాసో భవనంలో ఈ పురస్కారాన్ని చాసో ట్రస్టు అధ్యక్షులు చాగంటి తులసి, ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ప్రముఖ జర్నలిస్టు రెహనా, ప్రముఖ తమిళ రచయిత వి.దివాకర్, అనువాద రచయిత గౌరీకృబానందన్ ఆయనకు జ్ఞాపికతోపాటు రూ.పది వేలు నగదును చాసో ట్రస్టు తరపున అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర సాహితీ పురస్కారం వచ్చినప్పుడు కన్నా, చాసో పురస్కారం ఆనందాన్ని కలిగించిందన్నారు. తాను మరెంతో బాధ్యతగా రాయాల్సిన ఆవశ్యకతను చాసో పురస్కారం పెంచుతోందన్నారు. తులసి మాట్లాడుతూ చాసో కథలు ప్రజల్లో మరింతగా వెళ్లేందుకు నాటక రూపంలోకి తీసుకొస్తున్న నేపథ్యంలో ఈసారి స్ఫూర్తి అవార్డు కార్యక్రమాన్ని మార్చినట్లు తెలిపారు. సభాధ్యక్షులు సాంబశివరావు మాట్లాడుతూ జీవితాన్ని సూటిగా విశ్లేషించే కథా రచయిత చాసో అని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, అరసం జిల్లా అధ్యక్షులు జి.ఎస్.చలం, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు, పలువురు కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

'తమ్ముళ్ల' గ్రూపు రాజకీయాలు

- విజయనగరం జిల్లాలో తీవ్రతరం
- అధికారుల బదిలీలపై నిలదీతలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పలుచోట్ల బహిరంగంగానే ఒకరిపై మరొకరు తీవ్ర పదజాలంతో విమర్శించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల సీట్ల కోసం ఎవరికి వారే ప్రయత్నాలు చేసుకుంటూ గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు నిర్వహించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం మండల కేంద్రంలో జరిగిన సంబరాలకు టిడిపి స్థానిక ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు కుమారుడు తమ్మినాయుడు హాజరయ్యారు. తమ్మినాయుడు తీరుపై స్థానిక ఎంపిపి కర్రోతు బంగార్రాజు విరుచుకుపడ్డారు. 'నాకు తెలియకుండా అధికారులను బదిలీ చేస్తారా? అంతా మీ ఇష్టమేనా?' అంటూ ఆగ్రహించారు. ఇటీవలి ఈ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో ఇష్టానుసారంగా అధికారులను మార్పు చేయడం మండల స్థాయి నాయకులకు మింగుడుపడడం లేదు. ఎమ్మెల్యేతోపాటు ఆయన ముగ్గురు కొడుకులూ ఎవరికి వారే ఇష్టానుసారం సిఫార్సులు చేయడం అధికారులకు తలనొప్పిగా మారిందనే విమర్శలున్నాయి.

ఇటీవల ఓ ప్రభుత్వ ఉద్యోగి బదిలీకి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చినట్లు, బదిలీ అయ్యాక తిరిగి కొడుకు ఆ బదిలీని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో బదిలీ ఆర్డర్ తీసుకున్న ఉద్యోగి కోర్టుకు వెళ్లడంతో సిఫార్సు లేఖలు చర్చనీయాంశమయ్యాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలోని



నాలుగు మండలాల్లో నాలుగు గ్రూపులు కొనసాగుతున్నాయి. భోగాపురం మండలంలో కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల మండలంలో కడగల ఆనంద్‌కుమార్ గ్రూపులు బలంగా ఉన్నాయి.

గజపతినగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కె.ఎ.నాయుడుకు, జెడ్‌పిటిసి శ్రీధర్‌కు మధ్య గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. అవి సద్దుమణిగినట్లు కనిపించినా అప్పుడప్పుడూ బయటపడుతున్నాయి. మరోవైపు టిడిపి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రావి శ్రీధర్‌కు, జెడ్‌పిటిసి సభ్యుడు మక్కువ శ్రీధర్‌కు మధ్య తొలి నుంచీ ఉన్న విభేదాలు ఇటీవల జన్మభూమి కార్యక్రమంలో మరోసారి భగ్గుమన్నాయి. అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నావంటూ జెడ్‌పిటిసి సభ్యునిపై రావి శ్రీధర్ అనుయాయులు తీవ్ర పదజాలంతో దూషిస్తూ కొట్టినంత పనిచేశారు.

సాలూరులో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్‌పి భంజ్‌దేవ్, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి పార్టీ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ సమావేశంలో భంజ్‌దేవ్ నాయకత్వంలో పనిచేయాలంటూ సిఎం చంద్రబాబు సూచించినప్పటికీ సీటు స్వాతీరాణి దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని చర్చ సాగుతోంది.

బొబ్బిలి నుంచి వైసిపి ఎమ్మెల్యేగా గెలిచి టిడిపిలోకి జంప్ చేసి మంత్రి పదవి పొందిన సుజయ్‌కృష్ణ రంగారావుకు ఇంటిపోరు కొనసాగుతోంది. ఆయనకు వచ్చే ఎన్నికల్లో టిడిపి టికెట్ ఇచ్చే ఆలోచనలో అధిష్టానం ఉన్నప్పటికీ, పార్టీ కేడర్ మాత్రం ఆయన సోదరుడు బేబి నాయనవైపే మొగ్గుచూపుతోంది. మరోవైపు ఇదే నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు తూముల భాస్కరరావు రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడంతో ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. దీనిపై అధిష్టానం నుంచి స్పష్టమైన హామీ లేకపోతే జనసేన వైపు వెళ్లే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి స్థానిక ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు లేదా ఆయన కుమార్తె అతిథి రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే ఖాయమైతే ప్రస్తుత ఎమ్మెల్యే మీసాల గీత వైసిపిలో చేరే అయ్యే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సంప్రదింపులు జరిగినట్టు స్థానికంగా చర్చ సాగుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు ద్వారా టిడిపి టికెట్టు దక్కించుకునే ప్రయత్నాల్లో గీత, స్వాతీరాణి ఉన్నట్లు సమాచారం.. చీపురుపల్లిలో స్థానిక ఎమ్మెల్యే కిమిడి మృణాళిని ఇప్పటికే ఒంటరయ్యారు. ఆమె ఏకపక్షంగా పనిచేస్తూ తమను పట్టించుకోవడం లేదంటూ ఇప్పటికే నియోజకవర్గంలో సీనియర్ నాయకులంతా సిఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ టిడిపిలో గ్రూపులు మరింత బయటపడతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఎయు విసి నాగేశ్వరరావుకు కల్నల్ హోదా

గెజిట్ విడుదల చేసిన భారత ప్రభుత్వం

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ



ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు కల్నల్ హోదాను పొందారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విభాగంలో గౌరవ హోదాలో ఆయనను కల్నల్‌గా నియమించారు. ఇటీవల భారత ప్రభుత్వం ఈ మేరకు గెజిట్ ఉత్తర్వులను విడుదల చేసింది. ఎపి, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆచార్య జి.నాగేశ్వరరావు ఒక్కరికే ఈ గౌరవం దక్కింది. ఇక నుంచి విశ్వవిద్యాలయానికి కల్నల్ కమాండెంట్‌గా వ్యవహరిస్తారు.

10.80 లక్షల నకిలీ నోట్ల చెలామణి

- 2016-18 మధ్య జోరు
- మొదటి రెండు స్థానాల్లో ఢిల్లీ, యుపి
- నోట్ల రద్దు తర్వాత బ్యాంకుల్లో పెరిగిన మోసాలు
- పార్లమెంటరీ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ పరిశీలన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో నోట్ల రద్దుతో విమర్శలను మూటగట్టుకున్న కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం నకిలీ నోట్ల రంగ ప్రవేశాన్నీ అడ్డుకోలేకపోయింది. 2016-2018 వరకూ దేశంలోని 30 రాష్ట్రాల పరిధిలో 10లక్షల 80వేల 690 ఫేక్ కరెన్సీ (నకిలీ నోట్ల)ను ప్రభుత్వమే వివిధ బ్యాంకుల ద్వారా గుర్తించింది. దీనిలో అగ్రస్థానం న్యూఢిల్లీదే. న్యూఢిల్లీలో రూ.10 నోట్లు 290, రూ. 20 నోట్లు 217, రూ.50 నోట్లు 3618, రూ.100 నోట్లు 59,831, రూ.200నోట్లు 252, రూ.500 నోట్లు 926, రూ.2వేల నోట్లు 4609 మొత్తంగా లక్షా 83వేల నోట్లు ఈ కాలంలో బయటపడ్డాయి. తర్వాత స్థానం బిజెపి పాలిత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ లక్షా 80వేల ఫేక్ కరెన్సీ నోట్లు బయటపడ్డాయి. తర్వాత స్థానం మహారాష్ట్రలో లక్షా 52వేల ఫేక్ కరెన్సీ, ఆ తర్వాత గుజరాత్ 87600 ఫేక్ నోట్లు బయటపడ్డాయి.

బ్యాంకుల్లో మోసాలు

రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాల్లో బృందం పర్యటన చేపట్టింది. విశాఖలో ఈనెల 16న 25 మంది బ్యాంకు ఉన్నతాధికారులను కలిసి నకిలీ కరెన్సీపై నివేదిక తీసుకుంది. 17న హైదరాబాద్, 18న జమ్మూ అండ్ కాశ్మీర్ ఇలా పలు రాష్ట్రాల్లో పర్యటనలను ఈ బృందం చేపట్టింది. బ్యాంకుల్లో మోసాలు మరింత పెరిగిన విషయాన్ని ఈ కమిటీ గుర్తించింది. నోట్ల రద్దు తర్వాత నకిలీ నోట్ల చెలామణి విపరీతమైందన్న విషయాన్ని బృందం దగ్గర గల పలు నివేదికలు వెల్లడిచేస్తున్నాయి.

పార్లమెంటరీ స్థాయి కమిటీ ధ్రువీకరణ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంఘ విద్రోహ శక్తుల ఆటలకు నోట్ల రద్దుతో కళ్లెం వేస్తామని, టెర్రరిస్టు కార్యకలాపాలకు నోట్ల రద్దు సరైన జవాబు అంటూ జబ్బలు చరచుకున్న విషయం తెలిసిందే. డబ్బును వారికందకుండా చేస్తామని చెప్పి నోట్ల రద్దు చేపట్టిన మోడీ దేశంలోని సామాన్యులకు నేటికీ డబ్బును అందకుండా అవస్థలు పాల్జేశారన్న విమర్శలు, చర్చ జరుగుతున్న నేటి సందర్భంలో నకిలీ నోట్ల చెలామణి గుప్పుమంది.

సాక్షాత్తూ పార్లమెంటరీ కమిటీయే దీన్ని ధ్రువీకరించింది. నరేంద్రమోడీ అధికారం చేపట్టాక తీసుకున్న జిఎస్టీ, నోట్ల రద్దు లాంటి నిర్ణయాలు , సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను నట్టేట ముంచాయన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. ఎటిఎంల్లో డబ్బు డిపాజిట్ చేసే సమయంలో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా నోట్లను చెలామణి చేస్తున్నారు. అలాగే కొందరు నకిలీ కరెన్సీని పెద్దఎత్తున చెలామణి చేస్తున్నా వారిని కఠినంగా శిక్షించినట్లు ఎక్కడా కన్పించదు. ఈ కారణాల వల్ల నకిలీ కరెన్సీ జోరుగా కొనసాగుతోంది.

రాయలసీమ అభివృద్ధి కావడం బాబుకు ఇష్టం లేదు : కన్నా

ప్రజాశక్తి-వేంపల్లి

రాయలసీమ అభివద్ధి కావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇష్టం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం కడప జిల్లా వేంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజుపట్నం పోర్టు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని పేర్కొన్నారు. కడపలో శుక్రవారం నిర్వహించే బహిరంగ సభకు జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అనారోగ్య కారణాలతో హాజరు కావడం లేదన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ కార్యదర్శి రాంమాధవ్ వస్తున్నట్లు పేర్కొన్నారు.

30 ఎకరాల్లో చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి- దత్తిరాజేరు(విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస పరిధిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో 30 ఎకరాల్లో చెరకు పంట దగ్ధమైంది. బాధితుల్లో రెడ్డి ఆదినారాయణ, చప్ప సింహాచలం, రెడ్డి పార్వతి, అల్లు కృష్ణ, పెంట గౌరునాయుడు, రెడ్డి సత్యం, రెడ్డి అప్పలస్వామి, రెడ్డి సింహాచలం, వంగపండు అప్పలనాయుడు, రెడ్డి నారాయణలతో పాటు పలువురు ఉన్నారు. మాజీ సర్పంచ్ మరడ రాము సమాచారం మేరకు సంఘటనా స్థలానికి ఫైరింజన్ చేరుకుంది. ఆ వాహనం పొలం వరకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది కొంతవరకే మంటలను అదుపు చేయగలిగారు. కాలిపోయిన చెరకు తోటలను గ్రామ రెవెన్యూ కార్యదర్శులు అప్పారావు, చిట్టిబాబు పరిశీలించారు. సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.

బ'క్కోడు' విలవిల..!



- విచ్చలవిడిగా కోడిపందేలు, కోత ఆట, గుండాట
- బరుల వద్ద మద్యం జోరు
- చేతులు మారిన రూ.200 కోట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

-'నిడమర్రు మండలానికి చెందిన వెంకటేశ్వరరావు.. అదే మండలంలోని పత్తేపురంలో పందేల దగ్గరకు చూద్దామని వెళ్లాడు. పండగ ఖర్చుల నిమిత్తం దాచిన రూ.5 వేలు జేబులో ఉన్నాయి. పందేలకు ఆకర్షితుడై బెట్టింగ్ కాశాడు. మొత్తం పోయింది. ఉసూరుమంటూ వెనుదిరిగాడు. దీంతో ఆ కుటుంబమంతా పండుగ ఆనందానికి దూరమైంది'.

-'గ్రామంలో వేస్తున్న కోడి పందేల బరుల వద్ద గుండాట, కోతాట చూసి ఆకర్షితుడైన యువకుడు సత్యం ఇంట్లో తండ్రి ఎరువుల కోసం దాచిన డబ్బు తీసుకెళ్లి ఆడాడు. పట్టుకెళ్లిన రూ.7 వేలు పోవడంతో తండ్రికి తెలిస్తే ఏం చేస్తాడోననే భయంతో ఇంటికి రావడం మానేశాడు. తల్లిదండ్రులు వెతికి గురువారం ఇంటికి తీసుకొచ్చి లబదిబోమన్నారు'.

పైన పేర్కొన్న వెంకటేశ్వరరావు, సత్యం కుటుంబాలే కాదు.. జిల్లాలో అనేక కుటుంబాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా సాగిన కోడి పందేలు తీవ్ర ఆవేదనను మిగిల్చాయి. కోర్టు తీర్పును సైతం పక్కనపెట్టి ప్రభుత్వ అండతో సంక్రాంతి పండుగ మూడురోజులు సాగిన కోడిపందేలు సామాన్యులను ఇక్కట్లకు గురిచేశాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి పందేల జోరు సాగింది. జిల్లాలో 900కుపైగా గ్రామ పంచాయతీలు ఉండగా, 600కుపైగా గ్రామాల్లో పందేలు సాగినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లో రూ.200 కోట్లకుపైగా బెట్టింగులు సాగినట్లు పందేల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. భీమవరం, పత్తేపురం వంటి పెద్ద బరుల వద్ద రూ.పది లక్షలకుపైగా పందేలు సాగాయి. మూడు రోజుల పందేల్లో వేలాది మూగజీవాలు ప్రాణాలొదిలాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. వీరవాసరం, జీలుగుమిల్లి వంటి చోట్ల ఘర్షణలు సైతం జరిగాయి. రాత్రీపగలు తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు సాగాయి. అంతా బరుల వద్దకు క్యూ కట్టడంతో పట్టణాలన్నీ బోసిపోయాయి. బరుల వద్ద వాహనాల పార్కింగ్ చూసి అంతా విస్తుపోయే పరిస్థితి నెలకొంది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవహరించడం గమనార్హం.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి జూద క్రీడలు సాగాయి. కోడి పందేల బరుల వద్ద వీటి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. గతంలో గుండాటలో రూ.10 నుంచి బెట్టింగ్ ఉండేది. ఈ సారి కనీసం రూ.వంద కాయాలనే నిబంధన విధించారు. కోత ఆటలో కనీసం రూ.వెయ్యి బెట్టింగ్ కాయాలని పెట్టారు. అదేమంటే పోలీసులకు ఈ సారి పెద్దఎత్తున మామూళ్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. చాలాచోట్ల కోడి పందేల నిర్వాహకుల నుంచి గ్రామంలోని అధికార పార్టీ నాయకులు మామూళ్లు వసూలు చేశారు. వ్యవసాయ సాగు పెట్టుబడుల కోసం, అల్లుళ్లకు బట్టలు పెట్టుకోవడానికి, పిల్లల చదువుల కోసం, ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇలా అప్పు తెచ్చుకుని ఇంట్లో పెట్టుకున్న డబ్బంతా పందేలు, కోత ఆట, గుండాటలో ఆవిరైపోయింది. పందేలు ముగిసిన తర్వాత ఒప్పందం ప్రకారం ప్రతి బరి నుంచి కొంత మందిని కేసులు పెట్టుకునేందుకు పోలీసులకు అప్పగించాలనే ఒప్పందాలు సైతం జరిగినట్లు సమాచారం. మామూళ్లు అధికంగా తీసుకున్నారంటూ పోలీసులపై పందెం రాయుళ్లు తిరగబడిన పరిస్థితి నెలకొంది. నిర్వాహకులను పోలీసులు బతిమలాడుకోవాల్సిన దుస్థితి దాపురించింది. తెలంగాణ నుంచి పందేల కోసం ఎక్కువమంది తరలొచ్చినట్లు తెలుస్తోంది. ఈ బాధ నుంచి సామాన్య కుటుంబాలు ఎప్పటికి తేరుకుంటాయో చెప్పలేని దుస్థితి నెలకొంది.

సంపాదకీయం

రాజద్రోహ నేరం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎగసిన నిరసన గళాలను అణచివేయడం అనాదిగా రాజ్యం సాగిస్తున్న అమానుష ప్రక్రియ. జెఎన్‌యు విద్యార్థి సంఘ అధ్యక్షుడు కన్నయ్య కుమార్, విద్యార్థి నాయకులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్యలపై ఢిల్లీ పోలీసులు రాజద్రోహ నేరం మోపి మూడేళ్ల తరువాత ఛార్జిషీట్ నమోదు చేయడం మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ అనాగరిక ధోరణికి తాజా తార్కాణం. భీమా కోరెగావ్ కేసు సాకుతో పౌరహక్కుల నేతలను అర్బన్ నక్సల్స్ పేరిట వేధించడమూ ఈ కోవకు చెందినదే. స్వతంత్ర దేశంగా ఆవిర్భవించి అరవై రెండేళ్లవుతున్నా వలస పాలకులు రూపొందించిన రాజద్రోహ నేరాన్ని మోపడం, దాని ఆధారంగా శిక్షలను విధించడానికి పూనుకోవడం ప్రజాతంత్ర ప్రభుత్వానికి తగని పని. సర్వసత్తాక గణతంత్ర రాజ్యంలో అసలు రాజెక్కడ? రాజద్రోహం ఎలా? కాబట్టి రాజద్రోహ నేరం అనేదాన్ని భారత శిక్షాస్మృతి నుండి పూర్తిగా తొలగించాలని ప్రజాతంత్ర వాదులు, పౌర హక్కుల సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. ఈ విషయంలో పాలకవర్గ పార్టీలన్నింటి వైఖరి ఒక్కటే కావడం గమనార్హం. ప్రజల పక్షాన గళం విప్పే శక్తులు జనాన్ని విస్తృతంగా సమీకరించి ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాల్సిందే!

అఫ్జల్‌గురు ఉరి శిక్షను వ్యతిరేకిస్తూ 2016 ఫిబ్రవరి 9న ఈ విద్యార్థి నాయకులు దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్నది వారిపై ప్రధాన అభియోగం. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనపై ఇప్పుడు- అంటే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఛార్జిషీట్ దాఖలు చేయడం కేవలం కమలం పార్టీకి రాజకీయ లబ్ధి చేకూర్చడానికేనని, ఈ విషయాన్ని మరోసారి దేశమంతటా చర్చనీయాంశం చేసి, చిచ్చు రాజేయాలన్న హిందుత్వ శక్తుల కుట్రలో భాగమన్నది బహిరంగ రహస్యం. ఈ ఛార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్న ఆధారాలు కొత్తవి కాదనీ, అంతా పాత చింతకాయ పచ్చడేనని ఇప్పటికే వార్తలొచ్చాయి. కన్నయ్య కేసులో పోలీసులు గతంలో నకిలీ వీడియోల ఆధారంగా అభియోగాలు మోపిన విషయం అందరికీ తెలుసు. ఇప్పటికీ వారికి అలాంటి ఆధారాలే తప్ప ఇంకేమీ వుండే పరిస్థితే లేదు. ఎందుకంటే ఆ గొడవ జరిగినప్పుడు తాను లేనని, దాన్ని సద్దుమణగ జేయడానికి అక్కడకు వెళ్లానని కన్నయ్య చెబుతూనే వున్నాడు. రాజద్రోహ నేరాన్ని మోపాలంటే ఆ కేసులో వుండాల్సిన ప్రధాన అభియోగాలపై గతంలోనే సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. భారత శిక్షాస్మృతి 124ఎ సెక్షన్ ముఖ్యాంశమైన 'హింసకు ప్రేరేపించడం, అల్లర్లు సృష్టించడం...' వంటి అభియోగాలకు ఈ కేసులో ఆస్కారమే లేదు. నిజానికి 2016లో విద్యార్థి నాయకులు పోలీసు కస్టడీలో వుండగానూ, ఢిల్లీ ట్రయల్ కోర్టు సమక్షంలోనూ వారిపై కాషాయ మూకలు దాడి చేసిన విషయం గుర్తుండే వుంటుంది. అంటే హింసను ప్రేరేపించిందీ, అల్లర్లు సృష్టించిందీ ఆరోపణలు చేస్తున్న వారే తప్ప నిందితులు కాదన్నది స్పష్టం. కాబట్టి ఈ కేసు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచేది కాదు... అసలు విచారణకే అర్హమైనది కాదు. కానీ పాలక పార్టీ రాజకీయ ప్రయోజనాలకు మాత్రం తప్పక ఉపయోగపడుతుంది. అదే వారి లక్ష్యం.

గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ తెల్తుంబేపై పూనే పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం కూడా ఇలాంటిదే. బీమా-కొరెగావ్ సంఘటనలో దళితులే బాధితులు కాగా, ఆ సంఘటన సాకుతో మేధావులైన వరదరాజన్, ఆనంద్ తెల్తుంబే వంటి వ్యక్తులపై కేసులు బనాయించడం దుర్మార్గం. బిజెపి ప్రభుత్వ ఒత్తిడితోనే పూనే పోలీసులు ఈ కేసు బనాయించారని, అదే సమయంలో అమాయకులైన దళితులపై దాడులకు పాల్పడిన అసలు నేరస్తులను విడిచి పెట్టారన్న విమర్శ అక్షర సత్యం. తనతో సహా తొమ్మిది మందిపై మోపిన అభియోగాలు నిరాధారమైనవనీ, తాను న్యాయపోరాటం సాగిస్తానని చెప్పిన తెల్తుంబే... పౌర సమాజం కూడా స్పందించి వివిధ రూపాల్లో తమకు సంఘీభావం తెలపమని కోరడం గమనార్హం. ప్రజాతంత్ర హక్కులను, నిరసన తెలిపే హక్కును అణచివేసే ప్రభుత్వ చర్యను ఖండించిన డిఎస్ఎంఎం తప్పుడు కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టాలని తమ శాఖలకు పిలుపునిచ్చింది. అర్బన్ నక్సల్స్ పేరిట పోలీసులు సాగిస్తున్న వేధింపులను ప్రజాతంత్ర శక్తులు, ప్రగతి కాముకులూ వ్యతిరేకిస్తున్నారు. పౌర హక్కుల సమర్ధకులు, దళితుల రక్షణ కోరుకునే శక్తులూ అనేక రూపాల్లో ఉద్యమిస్తున్నారు... నిరసనలు తెలుపుతున్నారు. వక్రీకరణలు, అవాస్తవాలతో తప్పుడు కేసులు బనాయించి తమను విమర్శించిన వారంతా దేశ ద్రోహానికి పాల్పడుతున్నారంటూ బూటకపు ప్రచారాన్ని చేపట్టి రాజకీయ లబ్ధి పొందాలని యత్నిస్తున్న హిందుత్వ శక్తుల కుట్రలను సామాన్య ప్రజల ఐక్య ఉద్యమాలతోనే వమ్ము చెయ్యాలి.

ఇదీ విషయం



విప్లవోజ్వల తరళ
వీరగీతికను-
విశ్వకార్మికుల ప్రా
ణోచ్ఛ్వాస మేను...

ప్రాణితతి విప్లవ
ప్రభలు రేకెత్తించి,
అండనై, చండగతి,
ముందడుగు వేశాను...

- తెన్నేటి సూరి


విశ్లేషణ

10% రిజర్వేషన్లతో లబ్ధి ఎవరికి?

అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం పది శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాజ్యాంగ సవరణ బిల్లును మోడీ ప్రభుత్వం తెచ్చింది. పార్లమెంటు ఆమోదించింది.

ఎన్నికల ఎత్తుగడ

రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర మంత్రివర్గ ఆమోదించినది మొదలు పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందే వరకు మొత్తం ఈ తతంగమంతా కేవలం మూడు రోజుల్లో ముగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే పాలక పార్టీ ఈ బిల్లును ఇంత హడావిడిగా చట్టం చేసిందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. ఇటీవలి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ ఓటమిని చవిచూసిన బిజెపి తాను కోల్పోయిన పట్టును తిరిగి ఎలాగైనా పొందాలని వేసిన ఎత్తుగడ ఇది. నానాటికీ తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగిత వంటి అంశాలతో రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్న సామాజిక తరగతుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతు లకు 10 శాతం రిజర్వేషన్ తాయిలం చూపుతూ ఈ డిమాండ్లను జోకొట్టవచ్చని మోడీ ప్రభుత్వం ఆశిస్తోంది.



ప్రకాశ్ కరత్

జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగావకాశాలలో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఈ నాటిది కాదు. ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ 1990లలోమండల్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని విపి సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం నిర్ణయించిన పుడే ఈ అంశం తెరపైకి వచ్చింది. ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించాలన్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అగ్రవర్ణాలకు చెందిన వారు ఆందోళనలకు దిగారు. ముఖ్యంగా ఉత్తర భారతంలో హింసాత్మక ఆందోళనలు చెలరేగాయి. సామాజికంగా, విద్యాపరంగా వివక్షకు గురైన ఒబిసి తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయాన్ని సిపిఎం సమర్థించింది. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే ఒబిసిలకు కూడా రిజర్వేషన్లు కల్పించటం సముచితమైన చర్యేనని స్పష్టం చేసింది. అయితే 'మండల్ కమిషన్' సిఫార్సులకు భిన్నంగా సిపిఎం ఓబిసి రిజర్వేషన్లలో ఆర్థికపరమైన పరిమితి విధించాలని సూచించింది. ఒబిసిలలో కొన్ని తరగతుల ప్రజలు భూకమతాలు, ఇతర వనరుల ద్వారా మెరుగైన స్థితిలో ఉన్నందున సిపిఎం ఈ సూచన చేసింది. ఒబిసిలలో వాస్తవంగా అవసరమున్న వారికి ఈ రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం కల్పించాలంటే వారిలోని సంపన్నులకు ఈ ప్రయోజనాల నుండి మినహాయించేందుకు వీలుగా ఆర్థిక పరమైన పరిమితులు విధించాలని సూచించింది. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ తరగతులకు చెందిన వారు కొన్ని శతాబ్దాలుగా కుల వ్యవస్థలో సామాజిక వివక్షకు గురైనందున వారికి ఆర్థిక పరిమితులతో నిమిత్తం లేకుండా రిజర్వేషన్లు కొనసాగించాలని సిపిఎం స్పష్టం చేసింది.

కర్పూరీ ఠాకూర్ ఫార్ములా

ఈ వైఖరి సిపిఎం కొత్తగా తీసుకున్నదేమీ కాదు. అంతకు ముందు కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కూడా రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలించేందుకు నెట్టూర్ దామోదరన్ నేతృత్వంలో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఒబిసి రిజర్వేషన్లలో ఆర్థికపరమైన పరిమితులు పాటించాలన్న సిఫార్సులతో ఈ కమిషన్ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. అప్పట్లో సభలో జరిగిన చర్చలో ఈ నివేదికను సిపిఎం గట్టిగా సమర్థించింది. 1978లో బీహార్‌లో కర్పూరీఠాకూర్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్లు ప్రకటించిన తరువాత అక్కడ ఉధృత స్థాయిలో రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం జరిగింది. ఆ సమయంలో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా వున్న ఇఎంఎస్ నంబూద్రిపాద్, కర్పూరీ ఠాకూర్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలలో రిజర్వేషన్ల విషయంలో వచ్చిన అంగీకారాన్నే 'కర్పూరీ ఠాకూర్ ఫార్ములా' అని పిలుస్తున్నాం. ఈ ఫార్ములా ప్రకారం వెనుకబడిన తరగతులను రెండు జాబితాలుగా చేసి ఒక జాబితాలోని అత్యంత వెనుకబడిన తరగతి (ఎంబిసి) వారికి ఎటువంటి ఆర్థిక పరిమితులూ లేకుండా 12 శాతం రిజర్వేషన్లు, మరో అనుబంధ జాబితాలోని ఇతర వెనుకబడిన తరగతుల వారికి ఆర్థిక పరిమితులతో 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. దీనితో పాటు అగ్రకులాలకు చెందిన పేదలకు, మూడు శాతం, మహిళలకు మరో మూడు శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించారు. కేంద్రంలోని విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్లు ప్రకటించే వరకూ దాదాపు దశాబ్దకాలానికి పైగా ఈ విధానం బీహార్‌లో అమలయింది.

సిపిఎం వైఖరి

1990 లో ఒబిసి రిజర్వేషన్లపై సిపిఎం తన వైఖరిని ఈవిధంగా విశదీకరించింది. ఎ) ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇందులో సంపన్నులకు మినహాయింపునిస్తూ ఆర్థిక పరిమితులు విధించాలి. పేద వర్గాల వారితో ఖాళీలు భర్తీ కానపుడు వాటిని ఒబిసి కేటగిరిలోనే ఉంచాలి. బి) జనరల్ కేటగిరిలోని పేద వర్గాల వారికి కొంత మేర (5 నుండి పది శాతం) రిజర్వేషన్లు అమలు చేయాలి. సి) రిజర్వేషన్లు కేవలం కొద్దిపాటి సాంత్వన మాత్రమే కల్పిస్తాయి తప్ప వెనుకబాటుతనం, నిరుద్యోగిత వంటి ప్రాథమిక సమస్యలకు పరిష్కారం కాదు. భూ సంస్కరణలను అమలు చేసి ఒకే చోట కేంద్రీకృతమైన సంపదను వికేంద్రీకరించటంతో పాటు ఆర్థికాభివృద్ధిలో సమతుల్యత సాధించటం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం వుంది. (డి) దీనితో పాటు కులవివక్ష, అవకాశాలు నిరాకరించబడడం వంటి సమస్యలకు రిజర్వేషన్ ఒక సానుకూల జోక్యం అని సిపిఎం భావిస్తోంది. అయితే ఈ రిజర్వేషన్లను కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు, కుల రాజకీయాలకు పావులా ఉపయోగించుకునేందుకు కొన్ని బూర్జువా రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అణగారిన కులాలకు చెందిన కొన్ని సంఘాలు తమకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తే సామాజిక న్యాయం కల్పించినట్టేనన్న సంకుచిత భావనకు పరిమితమవుతున్నాయి.

సిపిఎంకు సంబంధించినంత వరకూ శ్రామిక వర్గ ప్రజలు, అన్ని కులాలు, వర్గాలకు చెందిన పేదలను ఐక్యం చేసి వారిని ఏకతాటిపైకి తీసుకురావటమే ముఖ్యోద్దేశం. ఈ వైఖరి ద్వారా అన్ని కులాల్లోని పేదలను ఐక్యం చేయటంతోపాటు రిజర్వేషన్ల విషయంలో కొనసాగుతున్న విభేదాలను అధిగమించేందుకు జనరల్ కేటగిరిలోని పేద వర్గాల వారికి కొంత మొత్తంలో రిజర్వేషన్లు కేటాయించాలని సిపిఎం వాదిస్తోంది.

గత ప్రయత్నాలు

మండల్ కమిషన్ నివేదిక అమలు తరువాతి పరిణామాల నేపథ్యంలో అగ్రకులాల్లోని పేదలకు సైతం రిజర్వేషన్లు కల్పించి వారికి సాంత్వన చేకూర్చాలన్న విషయాన్ని అనేక రాజకీయ పార్టీలు అంగీకరించాయి. వాస్తవానికి మాజీ ప్రధాని విపిసింగ్ ఒబిసి రిజర్వేషన్ల అమలు ప్రకటన సమయంలో ఇటువంటి చర్యనే ప్రతిపాదించారు. 1991లో అప్పటి పివి నరసింహారావు ప్రభుత్వం ఒబిసిలకు ఆర్థిక పరిమితులతో కూడిన 27 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆదేశాలు జారీ చేసింది. దీనితో జనరల్ కేటగిరిలోని ఆర్థికంగా బలహీనవర్గాల వారికి 10 శాతం అదనంగా కేటాయించారు. ఈ విధానం సిపిఎం వైఖరిని విస్తృత స్థాయిలో సమర్థించిందని చెప్పవచ్చు. అయితే 1992లో జనరల్ కేటగిరి రిజర్వేషన్లను కొట్టి పారేసిన సుప్రీంకోర్టు క్రీమీ లేయర్ విధానంతో కూడిన 27 శాతం ఒబిసి రిజర్వేషన్లను సమర్థించింది. క్రీమీలేయర్‌ను మినహాయించి ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును సిపిఎం కూడా స్వాగతించింది. దీనితో పాటు పేదలకు, రిజర్వేషన్లు వర్తించని నిరుపేద వర్గాలకు కొంత సాంత్వన చేకూరేలా ఒక విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వానికి సూచించింది. జనరల్ కేటగిరి వర్గానికి వర్తింప చేసే ఈ సాంత్వనతో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లు నిర్వీర్యం కారాదని కూడా సిపిఎం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ప్రస్తుతం మోడీ సర్కారు అమలులోకి తెచ్చిన ఇబిసి రిజర్వేషన్ల విషయంలో సిపిఎం వైఖరిని అర్థం చేసుకునేందుకు పై నేపథ్యాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం వుంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీని అమలు చేయటంలోనూ, వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కోవ టంలోనూ ఘోరంగా విఫలమైన మోడీ సర్కారు రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకునే ఆర్థిక వెనుకబాటు పేరుతో ఈ తాయిలాన్ని బయటకు తీసింది.

27 శాతం రిజర్వేషన్లతో పోలిస్తే ఒబిసిలకు 21.7 శాతం మాత్రమే భర్తీ చేసినట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో సైతం గ్రూప్ ఎ, బి సర్వీసుల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. అందుకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకత వస్తోంది.

తప్పుడు కొలబద్దలు

కేవలం 2018 ఒక్క సంవత్సరంలోనే దాదాపు 1.1 కోట్ల ఉద్యోగాలు గల్లంతయిన నేపథ్యంలో ఈ సమస్య పైనుండి ప్రజల దృష్టిని మళ్లించాల్సిన అత్యవసర పరిస్థితి బిజెపి ప్రభుత్వానికి ఎదురైంది. ఈ దిశలో 'ఆర్థికంగా బలహీన వర్గాల'కు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన విధానం అత్యంత మోసపూరితమైనది. ఈ విధానంలో ఆర్థిక వెనుకబాటును నిర్ణయించే ప్రక్రియ వాస్తవంగా అవసరమైన వారికి, పేదలకు ఏ మాత్రం ఉపయోగపడదు. ప్రభుత్వం కొత్త విధానంలో ప్రకటించిన ఆర్థిక పరిమితులను పరిశీలిస్తే రు.8 లక్షల వార్షికాదాయం, లేదా ఐదెకరాల వ్యవసాయభూమి లేదా వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ ఫ్లాట్ లేదా నోటిఫైడ్ మున్సిపాల్టీలలో 100 చదరపు గజాలకు తక్కువగా నివాస స్థలం, నాన్ నోటిఫైడ్ మున్సిపాల్టీలలో 200 గజాల లోపు నివాస స్థలం వున్న వారు మాత్రమే ఈ రిజర్వేషన్లకు అర్హులు. అంటే ప్రస్తుతం జనరల్ కేటగిరిలో వున్న దాదాపు 95 శాతం మంది ఈ రిజర్వేషన్ల పరిధిలోకి వస్తారు. రిజర్వేషన్ల ద్వారా పేద వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పించాలన్న మౌలిక భావనకు ఇది తీవ్ర విఘాతం కలిగిస్తుంది. అందువల్లే ఈ విధమైన అర్హతలతో జనరల్ కేటగిరి వర్గానికి రిజర్వేషన్లను విస్తరించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇక్కడ మరో విషయం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం వుంది. అదే రాజ్యాంగ సవరణ. పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లు ప్రకారం జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి 10 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి అని పేర్కొన్నారే తప్ప పైన చెప్పిన కొలబద్దలలో ఏ ఒక్కదానినీ ప్రస్తావించలేదు. రిజర్వేషన్లకు సూత్ర ప్రాయంగా అనుకూలిస్తున్నందునే సిపిఎం ఎంపిలు పార్లమెంట్‌లో ఈ రాజ్యాంగ సవరణకు అనుకూలంగా ఓటు వేశారు. అయితే పై కొలబద్దలతో రిజర్వేషన్లు కల్పిస్తూ ఎటువంటి చట్టం తెచ్చినా, నోటిఫికేషన్ జారీ చేసినా సిపిఎం దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

కోటాల నిష్ప్రయోజన చరిత్ర


ప్రభుత్వంలో ఖాళీగా వున్న ఎస్సీ, ఎస్టీ, ఒబిసిల రిజర్వేషన్ల పరిధిలోని ఉద్యోగాలను ఉన్నత విద్యా సంస్థలలో సీట్లను ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నది వాస్తవం. 27 శాతం రిజర్వేషన్లతో పోలిస్తే ఒబిసిలకు 21.7 శాతం మాత్రమే భర్తీ చేసినట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో సైతం గ్రూప్ ఎ, బి సర్వీసుల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. అందుకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకత వస్తోంది.

ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్ల విషయంలోనూ ఎస్సీ, ఎస్టీ, ఒబిసి వర్గాల వారు వెనుకబడే వున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న 2006 నాటి రాజ్యాంగ సవరణ చట్టం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇందుకు సమర్థవంతమైన చట్టం లేకపోవటమే ప్రధాన కారణం. ప్రభుత్వ రంగంలోనూ, ఉన్నత విద్యారంగంలోనూ ఎస్సీ,ఎస్టీ, ఒబిసి కోటాలలో ఖాళీగా వున్న ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం మొదటి నుండి డిమాండ్ చేస్తూనే వుంది. ఈ విషయంలో ఘోరంగా విఫలమైన మోడీ ప్రభుత్వ రికార్డును దృష్టిలో వుంచుకుంటే, తాజాగా జనరల్ కేటగిరీలో పది శాతం రిజర్వేషన్లు కల్పించటం ద్వారా బలహీన వర్గాల రిజర్వేషన్లకు గండి కొట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోందన్న అనుమానం తలెత్తుతోంది. కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్న ఆరెస్సెస్ ఈ అనుమానాలకు మరింత ఆజ్యం పోస్తోంది.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు

మోడీ సర్కారు ఉద్దేశపూర్వకంగా పక్కనబెడుతున్న మరో కీలక అంశం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు. నయా సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలులోకి వచ్చి దాదాపు మూడు దశాబ్దాలు గడుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలో అవకాశాలు కేవలం పరిమిత స్థాయిలోనే కన్పిస్తున్నాయి. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయకపోతే అణగారిన వర్గాలకు మేలు చేయాలన్న రిజర్వేషన్ల మౌలిక ఉద్దేశం నీరుకారిపోతుంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి కోటాల ఖాళీలు ఇప్పటి వరకూ భర్తీ కాకుండా వుండటం, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలులో వైఫల్యం వంటి వాస్తవాలు మోడీ సర్కారు రెండు నాల్కల ధోరణిని బట్టబయలు చేస్తున్నాయి. 1992లో ఇందిర సహానే కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం అన్ని కేటగిరీల రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అమలులో వుంది. తొందరపాటుతో ఈ రాజ్యాంగ సవరణ చట్టాన్ని తెచ్చిన తీరు మోడీ సర్కారు ఎన్నికల ప్రయోజనాలపై కన్నేసిన వైనాన్ని మన కళ్లకు కడుతోంది. న్యాయపరమైన సవాలు ఎదురయ్యే అవకాశం వున్న ఈ బిల్లును సరైన ఆలోచనతో తేలేదన్నది సుస్పష్టం. ఇది మరో ఎన్నికల మోసమే తప్ప మరొకటికాదు.



ఒబిసిలలో వాస్తవంగా అవసరమున్న వారికి ఈ రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం కల్పించాలంటే వారిలోని సంపన్నులకు ఈ ప్రయోజనాల నుండి మినహాయించేందుకు వీలుగా ఆర్థిక పరమైన పరిమితులు విధించాలని సిపిఎం సూచించింది. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు కొన్ని శతాబ్దాలుగా కుల వ్యవస్థలో సామాజిక వివక్షకు గురైనందున వారికి ఆర్థిక పరిమితులతో నిమిత్తం లేకుండా రిజర్వేషన్లు కొనసాగించాలని స్పష్టం చేసింది.

అభిప్రాయం

పై పూత చికిత్సలే



రైతు ఈతి బాధలకు పంట రుణమాఫీలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల రాయితీలు ఏ మాత్రం సరిపోని పై పూత చికిత్సలే. శరీరమే రోగాలతో కుళ్లు బారిన తర్వాత పైపై చికిత్సలు ఏమాత్రం కొరగావు. మన ప్రభుత్వాలు పరిశ్రమలకు అందించే అపూర్వ చేయూత వ్యవసాయ రంగానికి ఇచ్చివుంటే దేశ వ్యాప్తంగా రైతుల మూకుమ్మడి ఆత్మహత్యలకు ఆస్కారముండేదే కాదు. ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ సేద్య రంగం ఫలవంతంగా సస్యశ్యామలంగా మారిందే లేదు. పరిశ్రమలకున్న వెసులుబాటు పంటకు లేదు. వారు తయారు చేసిన వస్తువులకు ధరను ప్రకటించుకొనే హక్కు పారిశ్రామికవేత్తలకు వుంది. కానీ రైతు పరిస్థితి వేరు. పండించిన పంటకు ధర నిర్ణయించేది వేరెవరో! దీంతో రైతుకు కనీస ధర కూడా రాదు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అన్ని ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై కసరత్తులు చేస్తూనే వున్నాయి. కమిటీలపై కమిటీలు వేసి నివేదికలనూ రాబట్టాయి. కమిటీల సూచనలను ప్రణాళికాబద్దంగా అమలు చేసి వుంటే రైతాంగం ఈ దుస్థితికి వచ్చి వుండేది కాదు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై బాధ్యత వహించాలి. రైతు ఆత్మహత్యల నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. క్షేత్ర స్థాయిలో నిబద్ధతతో అమలు పరిచే విధానాలు పట్టాలెక్కాల్సి వుంది.

దాసరి కృష్ణారెడ్డి,
సెల్ : 9885326493

ఒత్తిడిని దూరం చేయాలి



శారీరక ఆరోగ్యం కన్నా మేధో సంబంధమైన ఆరోగ్యం మనిషిని రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేటట్లు చేస్తుంది. కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, వికాసం, పెరుగుదల ఇవన్నీ మానసిక ఆలోచనలతో ముడిపడి ఉంటాయి. అందుకుగాను శారీరక వ్యాయామంతో శరీరంలోని అవయవాలు ఎలా అయితే దారిలో ఉంటాయో, అదే విధంగా ఒత్తిడి తీవ్రతను జయించాలంటే నవ్వు ఒక్కటే సరైన మార్గం. అందుకే 'నవ్వించేవాడు యోగి, నవ్వేవాడు భోగి, నవ్వలేని వారు రోగి' అన్నారు పెద్దలు. కల్మషం లేని నవ్వులు కనబడేవి పిల్లల ముఖంలోనే. కానీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో వారిని చదువుల పేరుతో ఒత్తిడికి గురిచేసి, ఇతర వ్యాపకాలు లేకుండా చేస్తున్నాం. దీంతో చిన్నపాటి చిరునవ్వును కూడా వారి నుండి దూరం చేస్తున్నాం. ఎప్పుడూ చిన్నారులు చిరునవ్వులు చిందించేలా చూడడం మనందరి బాధ్యత. అటువంటి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలంటే వారిని ఒత్తిడి నుండి దూరం చేయాలి. ఆటలవైపు వారిని ప్రోత్సహించాలి. ఈ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపైనే ఉందనడంలో సందేహం లేదు.

ఎస్ శేష సాయి కుమార్,
తిరుపతి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

చర్చ

డస్సాల్ట్‌కు ఏ మాత్రం తీసిపోని హాల్

భారత్‌కు చెందిన అగ్రశ్రేణి రక్షణ రంగ ఉత్పత్తుల సంస్థ 'హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)', ఫ్రాన్స్ యుద్ధ విమానాల తయారీ సంస్థ డస్సాల్ట్‌కు ఏమాత్రం తీసిపోదని ఇటీవల అమెరికన్ పత్రిక డిఫెన్స్ న్యూస్ నిర్వహించిన స్వతంత్ర సర్వే కుండబద్దలు కొట్టింది. ఈ సర్వే ప్రకారం ప్రపంచంలోని అగ్రశ్రేణి 100 రక్షణ ఉత్పత్తుల సంస్థలలో 'హాల్' 38వ స్థానంలో వుంటే, డస్సాల్ట్ ఏవియేషన్ 44వ స్థానానికే పరిమితమైంది. అయితే భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని హాల్ ప్రస్తుతం ఆర్థిక సమస్యల్లో వుంది. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలే ఇందుకు కారణమని పలువురు నిపుణులు, హాల్ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. గతేడాది సర్వేలో 35వ స్థానంలో వున్న హాల్ ఈ ఏడాది సర్వేలో 38కి పడిపోయింది. 51వ స్థానంలో వున్న డస్సాల్ట్ సంస్థ ఏడు స్థానాలు మెరుగుపర్చుకుని 44వ స్థానానికి చేరుకుంది. ఫ్రెంచ్ కంపెనీ తలరాత మారటానికి భారత్‌తో కుదుర్చుకున్న వివాదాస్పద రాఫెల్ ఒప్పందమే కీలక పాత్ర పోషించిందన్నది సుస్పష్టం. సర్వేలో ర్యాంకింగ్‌ల కోసం 'డిఫెన్స్ రెవిన్యూ, సైనిక, ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, అంతర్గత భద్రతలో పోషిస్తున్న పాత్ర' వంటి అంశాలను డిఫెన్స్ న్యూస్ సంస్థ ప్రామాణికంగా తీసుకుంది. 2017లో 'హాల్' రక్షణ రెవిన్యూ 27.02 కోట్ల డాలర్లు కాగా ఇది 2016 నాటికన్నా 8 శాతం తక్కువ. ఈ సంస్థ మొత్తం రెవిన్యూ 2017లో 28.30 కోట్ల డాలర్లు. ఇందులో 96 శాతం మేర రక్షణ రంగం నుండే లభించింది. ఇక ప్రైవేటు యాజమాన్యంలోని 'పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ' డస్సాల్ట్ ఏవియేషన్‌కు 2017లో మొత్తం రెవిన్యూ 543.477 కోట్ల డాలర్లు. ఇందులో రక్షణ రంగ వాటా కేవలం 39 శాతం మాత్రమే. అదే సంవత్సరం రక్షణ రెవిన్యూ 212.419 కోట్ల డాలర్లు వుంది. ఇది అంతకు ముందు ఏడాది కన్నా 57 శాతం ఎక్కువ. ఈ సందర్భంలో 2016లో తాము కుదుర్చుకున్న రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం తమను ఆర్థికంగా ఆదుకుంటోందని డస్సాల్ట్ కంపెనీ తన వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. ఈ సంస్థ సైనికపరమైన వినియోగానికి మాత్రమే కాక, పౌర వినియోగానికి కూడా విమానాలను విక్రయిస్తుంది. ఎక్కువగా పౌర వినియోగ విమానాలనే తయారు చేస్తుంది. అయితే సంస్థ ఉత్పత్తి చేస్తున్న ఇతర రకాల విమానాల విక్రయాలు తగ్గినప్పటికీ భారత్, ఈజిప్ట్, కతార్ తదితర దేశాల నుండి రాఫెల్ యుద్ధ విమానాల కోసం అందిన ఆర్డర్లతో విక్రయాలలో సమతుల్యత ఏర్పడింది. 2016లో భారత్‌లోని మోడీ ప్రభుత్వం 36 ట్విన్ ఇంజన్డ్ జెట్ విమానాల కోసం రూ.58 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే డస్సాల్ట్ సంస్థకు దాదాపు రూ.20 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం మూడు వాయిదాల్లో చెల్లించినట్లు రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు చెబుతున్నాయి. కాగా 2016 నుండి ప్రభుత్వం ఈ సంస్థకు ఎంత చెల్లించిందీ అధికారికంగా తెలియనప్పటికీ అంటే రాఫెల్ ఒప్పందంతో ఈ సంస్థ రక్షణ రెవిన్యూ గణనీయంగా పెరగటంతో పాటు రక్షణ ఉత్పత్తుల ర్యాంకింగ్ కూడా మెరుగుపడి, ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కింది. పైగా తన ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్‌ను రక్షణ రంగంలోకి కొత్తగా ప్రవేశించిన అనిల్ అంబానీ సంస్థ రిలయన్స్ డిఫెన్స్‌కు కేటాయించింది. దీంతో ప్రభుత్వ రంగంలోని అత్యంత విశ్వసనీయమైన సంస్థ హాల్‌కు ఈ కాంట్రాక్ట్ దక్కలేదు. రాఫెల్ కుంభకోణం దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిన తరువాత ఈ కాంట్రాక్ట్‌ను రిలయన్స్ సంస్థకు కట్టబెట్టిన విషయాన్ని సమర్థించుకునేందుకు మోడీ సర్కారు ఆపసోపాలు పడుతోంది. గత యుపిఎ ప్రభుత్వం 2012లో కుదుర్చుకున్న ఒప్పందం కన్నా ఎక్కువ ధరతో బిజెపి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదని, టెక్నాలజీ బదిలీ క్లాజ్‌ను విస్మరించిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇదిలావుంటే బిజెపి ప్రభుత్వ హయాంలో హాల్ ఆర్థిక పరిస్థితి నానాటికీ క్షీణిస్తోంది. ప్రస్తుతం ఉద్యోగుల వేతనాలు చెల్లించటానికి సరిపడే నగదు కూడా ఈ సంస్థ చేతుల్లో లేదు. ప్రభుత్వం ఖరారు చేసిన ఆర్డర్లకు ఏమైనా సొమ్ము చెల్లించటంతోపాటు ఇప్పటికే అందచేసిన విమానాలకు రూ.14 వేల కోట్లు బకాయిలను ప్రభుత్వం అందచేస్తే తప్ప ఈ పరిస్థితి నుండి గట్టెక్కే పరిస్థితి లేదు.



గతేడాది సర్వేలో 35వ స్థానంలో వున్న హాల్ ఈ ఏడాది సర్వేలో 38కి పడిపోయింది. 51వ స్థానంలో వున్న డస్సాల్ట్ సంస్థ ఏడు స్థానాలు మెరుగుపర్చుకుని 44వ స్థానానికి చేరుకుంది. ఫ్రెంచ్ కంపెనీ తలరాత మారటానికి భారత్‌తో కుదుర్చుకున్న వివాదాస్పద రాఫెల్ ఒప్పందమే కీలక పాత్ర పోషించిందన్నది సుస్పష్టం.



మీకోసం

అల్లం వేసిన టీ తాగితే గొంతు సమస్యలకు ఉపశమనం లభిస్తుంది.

జీవన సౌరభం

గర్వం కలవారి వద్ద గౌరవాన్ని ఆశించకు. గౌరవించాల్సిన వారి వద్ద గర్వంగా నడుచుకోకు.

ఇండియన్ ఐస్ హాకీ ఉమెన్ టీమ్

ఐస్ హాకీ ! ప్రస్తుతం ఈ ఆటను భారతీయ మహిళా టీమ్ ఆడి చూపిస్తుంది. ఈ ఆటకు మనదేశంలో పెద్దగా సదుపాయాలు లేకపోయినప్పటికీ, అతి తక్కువ సమయంలో ప్రపంచంలోని పెద్ద పెద్ద టీమ్‌లను మట్టికరిపించి విజయ పతాకాలను ఎగురవేసింది ఈ మహిళా బృందం. భారతీయ మహిళల ఐస్ హాకీ టీమ్ ప్రత్యేకత ఏంటంటే.. టీమ్ సభ్యులంతా లడఖ్ చెందినవారే. అయితే ఇలా ఎందుకు జరిగింది? అనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. లడక్‌లో ప్రతిఏటా నవంబర్ నుంచి జనవరి వరకూ వీపరితంగా మంచు కురుస్తుంది. ఎముకలు కొరికే చలిలో అక్కడి పిల్లలు గడ్డకట్టే నీటి చెరువులపైన ఐస్ హాకీ ప్రాక్టీస్ చేస్తుంటారు. సరదాగా మొదలైన ఆట నేడు భారతదేశం తరపున 'మహిళా ఐస్ హాకీ టీమ్' రూపుదిద్దుకునే స్థాయికి ఎదిగింది. అయితే, ఇంత పెద్ద దేశంలో ఐస్ హాకీ ఆడే క్రీడాకారులు మరెక్కడా లేకపోవడం విచారించాల్సిన విషయం.



'లడఖ్‌లో మంచు కురవడం వల్ల భారతీయ హాకీ టీమ్ క్రీడాకారులకు 2 నెలలు అక్కడ మంచుతో నిండిన నీటిచెరువులపై మాత్రమే ప్రాక్టీస్ చేసే అవకాశం ఉంటుంది. లడఖ్‌లో ఏటా 10,000–12,000 మంది యువకులు ఐస్ హాకీ కోసం శిక్షణ పొందుతారు. జనవరిలో నిర్వహించే 'నేషనల్ ఐస్ హాకీ ఛాంపియన్‌షిప్' లేదా ఐహెచ్ఎఐ (ఐస్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) వంటి ప్రముఖ టోర్నమెంట్స్‌లో ఆడతారు" అని లడఖ్ వింటర్ స్పోర్ట్స్ క్లబ్ వారు చెబుతున్నారు.

ధైర్యంగా ముందడుగు!

సాధనచేసే బృందంలో అమ్మాయిలు చురుకుగా ఉండేవారు. అయితే, లడఖ్‌లో చాలా ఏళ్లపాటు మహిళలకు ఈ ఆట ఆడేందుకు అనుమతి లేదు. వారి ఉత్సాహం చూసి, 2008లో వారికి ఆడే అవకాశమిచ్చారు. అప్పటి నుంచి స్థానిక అమ్మాయిలు వెనుదిరిగి చూడలేదు. 2013లో 'లడఖ్ వింటర్ స్పోర్ట్స్ క్లబ్' ఆధ్వర్యంలో మొదటిసారి మహిళా ఐస్ హాకీ 'నేషనల్ ఛాంపియన్‌షిప్' నిర్వహించారు. ప్రస్తుతం ఇక్కడి మహిళలు కేవలం లడఖ్ పేరునే కాదు యావత్ దేశం పేరునే ఈ ఆటతో ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. 2017లో 'ఏషియా కప్' సమయంలో భారతీయ మహిళా హాకీ టీమ్ తన రెండో మ్యాచ్‌లో ఫిలిఫ్పిన్స్ వంటి బలమైన టీమ్‌తో 4–3 అంచు వరకూ రావడంతో, అక్కడి కోచింగ్ సిబ్బంది ఆనందానికి అవధుల్లేవు. ఎందుకంటే, అతి తక్కువ సమయంలో భారతీయ టీమ్ అలాంటి గొప్ప ఘనత సాధించింది మరి. దాని తర్వాత మలేషియా వంటి బలమైన టీమ్‌కు గట్టి పోటీనిచ్చి 5–4 తో ఓడించింది. 'మాకు శిక్షణ కోసం ఐస్ రింక్ లేకపోవడం వల్ల తొమ్మిది నెలలు ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. కిర్గిస్తాన్, మలేషియా, యుఎఇ వంటి దేశాల్లో శిక్షణ పొందితే మరిన్ని విజయాలు సాధించగలం. గడిచిన కొన్నేళ్ల నుంచి మా ఫెడరేషన్, ప్రభుత్వాన్ని సాయం అడుగుతోంది. కానీ, మన దేశంలో హామీ తప్ప ఎలాంటి సాయం లభించదని మాకు అర్థమైంది. అయినా మా ప్రయత్నాన్ని వదులుకోం' అంటూ ధైర్యంగా చెబుతున్నారు. గడ్డకట్టే చలిలో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతోన్న ఈ అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!





వీళ్లంతా.. హరిత సైనికులు

" ప్రతి విత్తనం మొక్కై మొలకెత్తాలి.. జీవావరణానికి అదే ప్రాణవాయువు.. మనకూ మన తరాలకూ మంచి ఫలాలందించడమే కాదు... మనలాగే పక్షులకూ..ఇతర జీవులకూ ఆహారాన్ని..ఆహ్లాదాన్ని మిగిల్చే పర్యావరణ రక్షణా జరగాలి.. భూగోళం ఒక్క మానవాళికే సొంతం కాదు.. 15 మిలియన్లకు పైగా ఉన్న సమస్త జీవరాశి సొంతం.." అనే నినాదంతో విశాఖలో వాడవాడనా 'పర్యావరణ మార్గదర్శి 'వైశాఖి' ఆధ్వర్యాన ప్రకృతిసిద్ధమైన నినాదం మార్మోగుతోంది. దేశీయ విత్తన సంపత్తిని కాపాడుకుంటూ వంటింటి వ్యర్థాలకూ అర్థం చెబుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే 240 విద్యాసంస్థల్లో వేలాదిమంది 'వైశాఖి' పర్యావరణ హరిత సైనికుల కార్యకలాపాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఇలా.. ఓ యజ్ఞంలా పచ్చదన సందేశం కోసం ఉద్యమిస్తున్న ఆ 'హరిత' సైనికుల్ని పలకరిద్దాం పదండి!

విశాఖపట్నం కేంద్రంగా పర్యావరణ–జీవావరణ పరిరక్షణే ధ్యేయంగా పర్యావరణ మార్గదర్శి వైశాఖి సంస్థ గత ఎనిమిదేళ్ళుగా ఏళుగా పలు రూపాల్లో కృషి చేస్తోంది. ముఖ్యంగా విద్యాసంస్థల్లోని విద్యార్థుల్ని ఆసరా చేసుకుని పర్యావరణ సంరక్షణ కోసం ఈ సంస్థ ఉద్యమిస్తుంది.

ఆట.. పాటల కలబోతగా

పండగ, పబ్బం అనే తేడా లేకుండా సంవత్సరం పొడవునా జనాన్ని పోగు చేసి నాలుగు విషయాలను తమ నృత్యాల ద్వారా..కృత్యాల ద్వారా వారికి తెలియజేసి చైతన్యం చేసేందుకు ముందుకు సాగుతున్నారు ఈ సంస్థ ప్రతినిధులు. తమకు అందుబాటులోఉన్న ప్రతి విద్యాసంస్థను కలుపుకుంటూ పర్యావరణ హితంగా జీవించేందుకు గల అవకాశాలు, మార్గాలపై హితబోధ చేస్తున్నారు. కేవలం విశాఖకే వీరి కార్యకలాపాలు పరిమితం కాకుండా ఆంధ్రా, తెలంగాణ తెలుగు రాష్ట్రాల్లోనూ విభిన్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తరించారు. ఏపి, తెలంగాణలోనూ 'పర్యావరణ మార్గదర్శి వైశాఖి" అనే పేరుతో పర్యావరణ సేవలు అందిస్తున్నారు.

విద్యాలయాల్లో.. హరిత జీవనం

సుమారు 240 విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ఈ పర్యావరణ హిత జీవన విధాన సంస్థ ఎంచుకుంది. బావితరాల కోసం పలకా..పలపం పట్టిన నాటి నుంచే పాటుపడాలన్నదే ఈ సంస్థ ఉద్దేశ్యం.. చిన్న తరగతుల నుంచి కంప్యూటర్ విద్యనందుకుంటున్న వారిలోనూ పర్యావరణ చైతన్యానికి కృషి జరుగుతోంది.. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పర్యావరణ–కాలుష్య పరిస్థితులను గురించిన అంచనా...అధ్యయనంతో కూడిన విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వాటిని సమాజంలో వివిధ తరగతుల్లోకి పంపడంపై ఈ సంస్థ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 51 పర్యావరణ హిత జీవన విధానాలను రూపొందించి విద్యార్థుల్లోకి చర్చకు పెట్టారు.

దీనితోపాటు విశాఖ సిటీ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల్లో మొక్కలు నాటడం..మొక్కల అభివృద్ధికి కృషి...విత్తనాలు సేకరించడపై ఆయా సంస్థల విద్యార్థుల్లోకి ప్రచారం జరిగింది. రంగు రంగుల ఆహారం తినడంవల్ల కలిగే నష్టాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులతో చర్చించే ఏర్పాట్లూ జరుగుతున్నాయి. శరీరానికి నీరు, గాలి ఎంత శాతం ఉండాలి, తగ్గితే వచ్చే పరిణామాలపై విద్యార్థులకు ఆట పాటల ద్వారా చెప్పడం విశేషం. ప్రకృతి–పర్యావరణం–పరిరక్షణ అంశాలపై పిల్లలకు చిత్రలేఖన పోటీలు.. ఆటలు,పాటల పోటీలను నిర్వహించడంలో ప్రత్యేక కృషిని "పర్యావరణ మార్గదర్శి వైశాఖి" చేపడుతోంది. వినాయక ఉత్సవాల సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాలను వినియోగించవద్దంటూ ఈ సంస్థ చేస్తోన్న కృషి గత రెండేళ్లలో చాలావరకు ఫలితాలనిచ్చింది. ఈ విగ్రహాల తయారీకి వాడే రంగుల్లో పాదరసం, లెడ్, కేడ్మియం, కార్బన్ వంటివి మనుషుల కిడ్నీలను, నాడీ వ్యవస్థను నాశనం చేసి బుద్ధిమాంద్యం (పుట్టేపిల్లలోనూ) వస్తుందన్న విషయాన్ని హరిత కార్యకర్తల శిక్షణలో జోడించడం విశేషం. వినాయక ఉత్సవాల సందర్భంలో మొక్కలూ, చెట్ల విత్తనాలను సేకరించి వినాయక బొమ్మలను తయారు చేసి విశాఖలోనూ, అనేక ప్రాంతాల్లో పంపిణీ చేస్తోంది.

ఇంటి చెత్త నుంచీ ఆదాయం



ఇంటిలోని వంట గది నుంచి వచ్చే తడిచెత్తను ఎరువుగా తయారు చేయడం ద్వారా అయిదుగురున్న ఒక కుటుంబానికి నెలకి రూ.450లు ఆదాయం వచ్చేలా ఈ సంస్థ కార్యకర్తలు సరికొత్త తరహాలో ప్రణాళిక వేశారు. అనేక చోట్ల అమలు చేయడం, మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతోంది. ప్రధానంగా కూరగాయల వ్యర్థాలను మూడు కుండల విధానంలో ఎరువు తయారు చేసుకునేలా చేశారు. దీని ద్వారా వచ్చే ఎరువు కిలో రూ.15లకు అమ్ముడవుతోంది. కాగా వంటింటి వ్యర్థాలను రోజూ ఒక 'గోలెం' (టబ్బు)లో వేసి దానిపై పొడి మట్టి వేయడం ద్వారా 15రోజులకు ఒక గోలెం వంతున నింపి వాటిలో మొక్కలు పెంచే విధానాన్ని సైతం ప్రోత్సహించారు. ఈ విధానంతో విశాఖ వంటి మహానగరాల్లో చెత్త ఆదాయంగా మారుతుందంటూ కొన్ని కాలనీలు దీన్ని పాటిస్తున్నారు.

కూరగాయల తోట

మన కూర గాయల తోట కార్యక్రమాన్ని విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన పట్టణాల్లోనూ పర్యావరణ కార్యకర్తలు ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువులు, రసాయన క్రిమిసంహారకాలు, కలుపుతీత మందులతో పండిన హైబ్రీడ్, సీడ్‌లెస్ పంటలతో మొహం మొత్తేసిన వారికోసం దేశీయ సంప్రదాయ కూరగాయ విత్తనాలతో పండించే పంటలను 'వైశాఖి' ఏటా కార్యక్రమాలను నిర్వహించడంతో అత్యధిక మందిలో ఈ విత్తనాలపై ప్రచారం జరిగింది.







ఏదోలా.. రోజు గడిచిపోతుంది. సాగిపోతుందిలే.. అనుకుంటే.. మనకు తెలియని నష్టాలు చాలానే ఉండొచ్చు. వాటి ప్రభావం వర్తమానంలో కనిపించకపోయినా భవిష్యత్తులో అవి మనల్ని కాటేసే ప్రమాదం ఉంది. అలాంటివే పర్యావరణ, జీవావరణ సమస్యలు. అందుకే.. 'మానవాళి పచ్చగా ఉండాలి. పచ్చదనం కోసం ఆలోచించాలి. నలుగురికి పచ్చదనం పంచిపెట్టాలి.. చెట్టు, పుట్ట, పిట్టతో కలిసి సహజీవనం చేయాలి'.. అంటూ విద్యార్థులనే వారధిగా చేసుకుని పలు చైతన్య కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న 'పర్యావరణ మార్గదర్శి వైశాఖి' సంస్థ కృషి అభినందనీయం.

-ఎన్.మధుసూదనరావు

ఆస్తిలో మాకూ.. వాటా ఉంటుందా?

న్యాయ నేత్రి

మా నాన్నగారి స్వార్జితంగా 3 ఇళ్ల స్థలాలు, ఒక ఇల్లు ఉన్నాయి. మేము ముగ్గురు అక్కాచెల్లెళ్లం ఒక అన్నయ్య. మా అమ్మ గారు ఇటీవలనే పోయారు. ఆవిడ ఉన్నప్పుడే స్థలాలు మా అక్క చెల్లెళ్లు ముగ్గురికి, ఇల్లు మా అన్నయ్యకి అని చెప్పారు. మా అన్నయ్య దస్తావేజులన్నీ తన దగ్గర పెట్టుకుని ఎవరికీ ఏమీ ఇవ్వను మీ ఇష్టం వచ్చింది చేసుకోమంటున్నాడు. నాన్నగారు మాకు స్థలాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, మా అన్నయ్య సహకరించడం లేదు. మాకు ఆస్థిలో హక్కు ఉందా? కోర్టు ద్వారా అడగొచ్చా?

- భువనేశ్వరి, తణుకు.

మీ నాన్నగారిది స్వార్జితం ఆస్థి గనుక ఆయన ఇష్టపూర్వకంగా ఇస్తేనే మీకు వస్తుంది. దస్తావేజులు దాచినంతలో ఏమీ కంగారు పడనవసరం లేదు. వివరాలు తెలిపితే, తగిన రుసుము చెల్లించి నకలు కాపీ రిజిస్ట్రారు ఆఫీసులో తీసుకోవచ్చు. లేదంటే, పోలీసు స్టేషనులో మీ నాన్నగారు మీ అన్నయ్య దస్తావేజులు పెట్టుకుని ఇవ్వడం లేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలి. స్టేషనుకి పిలిచి, మందలించి ఇప్పిస్తారు. వెంటనే, స్థలాలు మీ ముగ్గురి పేరు మీద రిజిష్టరు చేయించుకోండి. ఒకసారి మీ పేరుమీద రిజిష్టరు చేశాక మీ ఆస్థికి ఎలాంటి డోకా ఉండదు. మీకు సర్వహక్కులు వస్తాయి. మీ అన్నయ్య కోర్టు కేసు వేసినా చెల్లదు. మీరు కూడా కోర్టుద్వారా అడిగే అవకాశం లేదు.





కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది,
విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com
గమనిక : సాయంత్రం 5 తర్వాత ఫోన్ చేయగలరు.

కొబ్బరి పాలతో లాభాలు

కొబ్బరికాయను ఏదో ఒక రూపంలో ఆహారంలో భాగం చేసుకోవటం మనందరికీ తెలిసిన విషయమే. కొబ్బరి నుంచి తయారయ్యే కొబ్బరి పాలతోనూ మనకు అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది బరువు తగ్గించే దివ్యౌషధంగా ఉపయోగపడుతుంది. కొద్ది మొత్తంలో కొబ్బరి పాలను తీసుకుంటే కడుపు నిండిన ఫీలింగ్ కలుగుతుంది. అంతేకాదు ఎక్కువ సేపు ఆహారం తీసుకోకుండా ఉన్నా ఆకలి ఉండదు. దీంతో ఇవి బరువు తగ్గేందుకు బాగా ఉపయోగపడతాయి. యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ గుణాలు కొబ్బరి పాలలో సమృద్ధిగా ఉన్నాయి. ఇవి శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి.



పాస్పరస్, క్యాల్షియం వంటి పోషకాలు ఎక్కువగా ఉండడంతో ఎముకలకు ధృఢత్వం లభిస్తుంది. కొబ్బరి పాలలో ఉండే గ్లూకోజ్ మధుమేహ వ్యాధిగ్రస్తులకు దోహదపడుతుంది. రక్తంలో చక్కెర నిల్వలు తక్కువగా ఉన్నవారికి కొబ్బరిపాలు ఎంతగానో ఉపకరిస్తాయి. కీళ్ల నొప్పులకు కొబ్బరి పాలు టానిక్‌లా పనిచేస్తాయి. క్యాన్సర్ బారి నుంచి రక్షించే గుణాలు కొబ్బరి పాలలో సమృద్ధిగా ఉన్నాయి. ★

నడిస్తే..ఆరోగ్యం



సాధారణంగా అందరం ఉదయాన్నే లేవగానే ఉరుకులు పరుగుల జీవితాన్ని గడుపుతుంటాం. ఇది సహజమే అయినప్పటికీ దీని ప్రభావం మనకు తెలియకుండానే మన ఆరోగ్యంపై పడుతుంది. దీనివల్ల రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే 30 నిమిషాల నడక మన జీవనగతిని చాలా మార్చుతుంది. ముఖ్యంగా దీనివల్ల డయాబెటిస్, ఒబేసిటీ, గుండె రుగ్మతల తీవ్రత తగ్గుతుంది. కండరాలకు, గుండెకు చాలా మంచిది. ఉదయపు చలిగాలులు నరాలకు మంచిది. 30 నిమిషాల నడక 2 గంటల జిమ్‌తో సమానం. ఉదయం నడిస్తేనే మంచిది ఎందుకంటే... ఉదయాన్నే గాలిలో కలుషితపు ఛాయలు తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా తాజా గాలిలో ప్రాణవాయువు పుష్కలంగా ఉంటుంది. ఆ సమయంలో శరీరంలోని కణాలకు ప్రాణవాయువు బాగా అందుతుంది. తద్వారా అన్ని పనులు సునాయాసంగా జరిగిపోతాయి. శరీరం బాగా పనిచేసినప్పుడు ఎలాంటి రోగాలు అంత తొందరగా దగ్గరకు రావు. శరీరంలో కొవ్వును కరిగించడంలో ఇది సహకరిస్తుంది. బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల గుండె వ్యాధులు తగ్గుతాయి.

ప్రతి రోజు ఉదయాన్నే 30 నిమిషాలు నడక ఆరోగ్యానికి చాలా మంచిది. దీని వల్ల బీపీ అదుపులో ఉంటుంది. చాలా రకాల ఆరోగ్య సమస్యలకు ఒబేసిటీ కారణం. రోజులో ఎక్కువ సమయం కదలకుండా కూర్చోవడం వల్ల ఒబేసిటీ వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది చాలా మేలు చేస్తుంది. దీంతో పాటు బరువు తగ్గించడంలోనూ సహకరిస్తుంది. అర్థరైటిస్‌ను నివారిస్తుంది. అంతగా కదలిక లేని జీవితాన్ని గడపే వారికి మోకాలి కండరాలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా మహిళల్లో ఎముకల దృఢత్వం తగ్గుతుంది. నిదానంగా నడవడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గి ఎముకలు దృఢంగా తయారవుతాయి. శరీరం ఆరోగ్యంగా ఉండేందుకు కొంచెం కొలస్ట్రాల్ అవసరమవుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ నిల్వలు తగ్గితే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మెదడు చురుగ్గా పనిచేస్తుంది. శరీరం పునరుత్తేజితమవుతుంది. నడిచినప్పుడు ఆక్సిజన్ బాగా అంది రక్తప్రసరణ మెరుగవుతుంది. ఇవన్నీ ఉదయం నడవటం వల్ల మాత్రమే సాధ్యమవుతాయి. అందుకే ప్రతి ఒక్కరూ ఉదయపు పూట ఆరుబయట నడకను అలవాటు చేసుకుంటే మంచిది. ★

వర్తమానాంశాలు: అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

రక్షణ వ్యవస్థ కోసం ఉక్కు గోడను నిర్మిస్తున్న దేశం?



ఇవీ
ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

రైల్వే ప్రయాణికులను హెచ్చరించేందుకు నీలం లైట్



కదులుతున్న రైల్లో ఎక్కి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ప్రయాణికులను హెచ్చరించడానికి రైల్వేశాఖ కొత్త ప్రయోగం చేస్తోంది. కోచ్ ముందుభాగంలో నీలం రంగు లైట్ వెలిగేలా ఏర్పాటు చేసింది. ఇది వెలిగితే రైలు కదలడానికి సిద్దంగా ఉందని అర్థం. ఎదురుగా వస్తున్న రైలు వల్ల ప్రమాదం జరగవచ్చు. కాబట్టి, దూరంగా జరగండి అని హెచ్చరించడానికి కూడా ఇది ఉపయోగపడనుంది. ముంబయిలోని లోకల్ రైల్లో కోచ్ గేట్ వద్ద ప్రస్తుతానికి దీన్ని ఏర్పాటు చేశారు. ఇది విజయవంతమైతే అన్ని కోచ్ల వద్ద రైల్వేశాఖ ఏర్పాటు చేయనుందని మధ్య రైల్వే ప్రధాన ప్రజాసంబంధాల అధికారి సునీల్ ఉదాసి తెలిపారు. "మెట్రో రైళ్లు, ఏసీ ఈఎంయూల్లో డోర్లు వాటికవే తెరుచుకోవడం, మూసుకుపోవడానికి ఏర్పాట్లు ఉన్నాయి. నాన్ ఏసీ ఈఎంయూ కోచ్లకు ఇలాంటి ఏర్పాటు వీలు కాదు. కాబట్టి నీలంరంగు లైట్ ఏర్పాటు చేస్తున్నారు" అని ఉదాసి వివరించారు.

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అరుదైన ఘనత



ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఈ గెలుపుతో అరుదైన ఘనతను అందుకుంది. అంతర్జాతీయ క్రికెట్లో 1000వ విజయాన్ని నమోదుచేసిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్ తో వన్డేల్లో 558వ విజయాన్ని అందుకున్న ఆసీస్.. టెస్టుల్లో 384, టీ20ల్లో 58 మ్యాచ్లను గెలిచింది. దీంతో మూడు ఫార్మాట్లలో కలిపి ఆసీస్కు ఇది వెయ్యో విజయం. ఆస్ట్రేలియా తర్వాత ఇంగ్లండ్ 774 అంతర్జాతీయ విజయాలతో రెండోస్థానంలో ఉండగా.. 711 విజయాలతో భారత్ మూడోస్థానంలో కొనసాగుతోంది. కాగా 2017 జూన్ తర్వాత 20 వన్డేలాడిన ఆస్ట్రేలియాకు ఇది కేవలం నాలుగో విజయం.

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో తులసి గ్యాబర్డ్



అమెరికా తదుపరి అధ్యక్ష ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు డెమోక్రటిక్ నేత, కాంగ్రెస్ లోని హిందూ సభ్యురాలు తులసి గ్యాబర్డ్ వెల్లడించారు. వారంలోగా ఈ విషయం పై అధికారిక ప్రకటన చేస్తానని ఆమె వివరించారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. తాను మరోసారి బరిలోకి దిగుతానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. ఆయన్ను ఢీకొట్టేందుకు డెమోక్రటిక్ నేతలు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఆ పార్టీ - ప్రాతినిధ్యం కోసం 12 మంది దాకా నేతలు పోటీలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జాబితాలో భారత సంతతి సెనేటర్ కమలా హ్యారిస్ పేరు కూడా ఉంది. హవాయి నుంచి ఇప్పటివరకూ తులసి నాలుగు సార్లు అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. 2012లో కాంగ్రెస్కు ఎన్నికైన తొలి హిందువుగా ఆమె ఘనత సాధించారు. అమెరికా సైన్యంలో పనిచేసిన అనుభవమూ తులసికి ఉంది. ఇరాక్ యుద్ధంలో ఆమె పాల్గొన్నారు. అమెరికాలోనే పుట్టి పెరిగిన తులసి యుక్త వయసులో ఉండగా హిందూ మతాన్ని స్వీకరించారు.

10% కోటాకు రాష్ట్రపతి ఆమోదం




జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు ఆమోదించిన బిల్లు చట్టరూపం సంతరించుకుంది. దీనిపై రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ సంతకం చేయడంతో చట్టంగా మారింది. 124వ రాజ్యాంగసవరణ బిల్లుగా పార్లమెంటు ఆమోదం పొందిన ఈ అంశం రాష్ట్రపతి ఆమోదముద్రతో 103వ రాజ్యాంగ సవరణ చట్టంగా రూపాంతరం సంతరించుకొంది. రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలను సవరించాల్సి వచ్చింది. ఇది ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్న దానిపై కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేయాల్సి ఉంటుంది. చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేస్తూ, ఆ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి ఇది కార్యరూపంలోకి వస్తుంది. రూ. 8లక్షల వరకూ వార్షికాదాయం, ఐదు ఎకరాల్లోపు భూమి, వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఇల్లు, నోటిఫై చేసిన ప్రాంతాల్లో 100 చదరపు గజాల్లోపు, నోటిఫై చేయని ప్రాంతాల్లో 200 గజాల్లోపు స్థలం ఉన్న కుటుంబాలు మాత్రమే ఈ కోటా ఉపయోగించుకోవడానికి అర్హత పొందాయి. ఆ విధివిధానాలను అధికారికంగా ధ్రువీకరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది.

ఆయుష్మాన్ భారత్కు డబ్ల్యుఐపీవో కితాబు

భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకానికి 'ప్రపంచ మేధో సంపద సంస్థ' (డబ్ల్యుఐపీవో) డైరెక్టరు జనరల్ ఫ్రాన్సిస్ గర్రీ ప్రశంసలు లభించాయి. ఆయన ఈ పథకాన్ని బహుదా శ్లాఘించారు. 'డబ్ల్యుఐపీవో డైరెక్టరు జనరల్ ఫ్రాన్సిస్ ఇక్కడి ఆయుష్మాన్ భారత్ సీఈవోను కలుసుకున్నారు. వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలను అందించే ఈ పథకం ఎంతో ప్రశంసనీయమైనదని ఆయన పేర్కొన్నారు' అంటూ డబ్ల్యుఐపీవో ట్వీట్ చేసింది.

బీపీ టాబ్లెట్లతో.. మానసిక జబ్బులకు చెక్!



రక్తపోటు (బీపీ), మధుమేహం వంటి సాధారణ జబ్బులకు వినియోగించే టాబ్లెట్లతో తీవ్ర మానసిక జబ్బులకు చెక్ పెట్టవచ్చని ఓ అధ్యయనం వెల్లడించింది. స్కిజోఫ్రెనియా, బైపోలార్ వంటి మానసిక జబ్బులను తగ్గించేందుకు సాధారణ మందులు పనిచేస్తాయని తెలిపింది. స్వీడన్లోని 1,42,691 మంది మానసిక రోగులకు కొలెస్టరాల్ను తగ్గించే హైడ్రాక్సీ మిథైల్ గ్లుటరిల్ కోఎంజైమ్ను, అధిక రక్తపోటు నియంత్రణకు వాడే " ఎల్-టైప్ క్యాల్షియమ్ చానెల్ అంటాగొనిస్ట్ (ఎల్టీసీ సీ)ను, మధుమేహానికి వినియోగించే మెట్ఫార్మిన్ వంటి మందులను వాడి ఫలితాన్ని అంచనా వేశారు. బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రెనియా లక్షణాలైన వ్యక్తి గత హానిని తలపెట్టుకునే పరిస్థితి రోగుల్లో తగ్గుముఖం పట్టినట్టు గుర్తించారు. ఈ అధ్యయనం తాలూకు వివరాలను 'జమ' సైకియాట్రీ పుస్తకంలో ప్రచురించారు. స్వీడన్కు చెందిన కరోలికా ఇనిస్టిట్యూట్, బ్రిటన్కు చెందిన యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు.

ప్రధాని మోదీకి తొలి 'ఫిలిప్ కాట్లర్' పురస్కారం

మొట్టమొదటి 'ఫిలిప్ కాట్లర్ పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్నారు. 'ప్రజలు (పీపుల్), ప్రయోజనం (ప్రాఫిట్), ప్రపంచం (ప్లానెట్)' కోసం చేసిన కృషి ఆధారంగా.. దేశాధి నేతల్లో ఒకరికి ఏటా ఈ పురస్కారాన్ని అందజేస్తారు. భారత్ ఆర్థిక, సామాజిక, సాంకేతిక ప్రగతి కోసం మోదీ చేసిన నిస్వార్థ సేవకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. మోదీ దార్శనిక నాయకత్వంలో భారత్ నవకల్పనకు కేంద్రంగా మారిందని.. దేశంలో డిజిటల్ విప్లవం' కూడా వచ్చిందని అవార్డు కమిటీ పేర్కొన్నట్లు వివరించింది. ప్రముఖ ఆర్థికవేత్త, మార్కెటింగ్ నిపుణుడు, అమెరికన్ ప్రొఫెసర్ ఫిలిప్ కాట్లర్ పేరిట ఈ అవార్డు ఏర్పాటైంది. ఎమోరీ వర్సిటీ (జార్జియా) ప్రొఫెసర్ జగదీశ్ సేథ్ మోదీకి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానికి కేంద్ర మంత్రులు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావడేకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

యెస్ బ్యాంక్ చైర్మన్గా బ్రహ్మ దత్



ప్రైవేట్ రంగంలోని యెస్ బ్యాంక్.. బ్రహ్మ దత్ను నాన్ ఎగ్జిక్యూటివ్ పార్ట్ టైమ్ చైర్మన్గా నియమించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 మార్గదర్శకాలకు అనుగుణంగా బ్రహ్మ దత్ను బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ పార్ట్ టైమ్ చైర్మన్గా నియమించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) అనుమతినిచ్చిందని యెస్ బ్యాంక్ తెలిపింది. బ్రహ్మ దత్కు 70 ఏళ్ల వయసు వచ్చేంత వరకు అంటే 2020, జులై 4 వరకూ యెస్ బ్యాంక్ బోర్డులో పార్ట్ టైమ్ చైర్మన్ గా ఉంటారని పేర్కొంది. 2013 జులై నుంచి బోర్డులో దత్ ఇండిపెండెంట్ డైరెక్టర్గా వ్యవహరిస్తున్నారని తెలిపింది.

రొమ్ము కేన్సర్కు 'నిశ్చరిన్' థెరపీ

చాప కింద నీరులా విజంభిస్తోన్న మహమ్మారి కేన్సర్. దీనికి ఫిజియోథెరపీ, కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి చికిత్సలు ఉన్నప్పటికీ ఈ వ్యాధిని పూర్తిగా నిరోధించడం లేదు. అయితే, కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధించే సరికొత్త ప్రోటీన్ను తాజాగా పరిశోధకులు కనుగొన్నారు. రొమ్ము కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధించడంతో పాటు కణతిని తగ్గించడంలో 'నిశ్చరిన్' అనే ప్రోటీన్లో ఉండే ఎకోసమ్స్ దోహదం చేస్తాయని ఎల్ఎస్యూ హెల్త్ న్యూ ఓర్లీన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ లోని బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యుల్ బయాలజీ ప్రొఫెసర్ సురేశ్ అలహరి వెల్లడించారు. ★

చైనాలో మరో గ్రేట్ వాల్



చైనా మరో గ్రేట్ వాల్ను నిర్మించింది. తన భూభాగాలపై బయట నుంచీ దాడులు జరపకుండా నిరోధించడానికి చుట్టూ ప్రాకారం నిర్మించుకొన్న ఈ దేశం.. తన న్యూక్లియర్ క్షిపణి వ్యవస్థను కాపాడుకోడానికీ అదే తరహాలో చర్యలు తీసుకుంది. అతి మందపాటి ఉక్కు గోడను నిర్మించింది. న్యూక్లియర్ స్థావరాలకు కవచంలా భూగర్భంలో ఈ గోడను కట్టారు. హైపర్సోనిక్ క్షిపణులు, బంకర్ విధ్వంసక ఆయుధాలు సైతం ఈ ఉక్కు కవచాన్ని చీల్చలేవని కురువృద్ధ శాస్త్రవేత్త కియాన్ హు(82) ధీమా వ్యక్తంచేశారు. అయితే, ఉనికిలో ఉన్న ఇలాంటి విధ్వంసక క్షిపణి వ్యవస్థలనే కాదు, కొత్తగా రూపుదిద్దుకొంటున్న ఆధునిక ఆయుధ శక్తినీ తట్టుకొని నిలబడాల్సిన పరిస్థితి ఉన్నదన్నారు. న్యూక్లియర్ స్థావరాలకు మరింత రక్షణ కోసం తన ప్రయత్నాల్లో గోడ నిర్మాణం ఒకటని ప్రకటించారు. న్యూక్లియర్ క్షిపణి కేంద్ర రక్షణ వ్యవస్థలో ఇది చివరి వరుస నిర్మాణం అవుతుందన్నారు. ఈ కేంద్రానికి భూగర్భంలోని మందపాటి కొండ గుహ తొలి రక్షణ వరుస అని, ఆ తరువాత వరుసల్లో వ్యూహాత్మక క్షిపణి నిరోధక, విధ్వంసక వ్యవస్థలు, వైమానిక రక్షణ వ్యవస్థలు ఉంటాయనీ, ఇవన్నీ విఫలం అయిన తరువాతే ఈ ఉక్కుగోడ మీద రక్షణ భారం పడుతుందని తెలిపారు. ఎప్పుడు ఎలాంటి ఆయుధాలు, ఏ రూపంలో ఎటునుంచి దాడి చేస్తాయో తెలియని అనిశ్చిత వాతావరణంలో వీలైనన్ని ఎక్కువ రక్షణ వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం అవసరమని హు అభిప్రాయపడ్డారు.

క్విటోవాకు సిడ్నీ ట్రోఫీ

చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రో క్విటోవా సీజన్ తొలి గ్రాండ్ స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆరంభానికి ముందు ఆదరగొట్టింది. ఈ ముద్దుగుమ్మ సిడ్నీ ఇంటర్నేషనల్ ఓపెన్లో సింగిల్స్ చాంపియన్గా నిలిచింది. హోరాహోరీ ఫైనల్లో ఐదోసీడ్ క్విటోవా 1-6, 7-5, 7-6 (7/3)తో స్థానిక క్రీడాకారిణి ఆష్లే బార్టీని ఓడించి ట్రోఫీ అందుకుంది. క్విటోవాకు ఇది రెండో సిడ్నీ టైటిల్, అంతకుముందు 2015లో ఇక్కడ విజేతగా నిలిచింది.

రిలయన్స్కు భారీ లాభాలు

- క్యూ3లో రూ.10,251 కోట్లు..
- రెవెన్యూలో 56% వృద్ధి
- రూ.2.74 లక్షల కోట్లకు అప్పులు

న్యూఢిల్లీ : చమురు నుంచి టెలికం వరకు బహుళ వ్యాపారాలు కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) భారీ లాభాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 8.8 శాతం వృద్ధితో రూ.10,251 కోట్ల నికర లాభాలు సాధించింది. పెట్రోకెమికల్స్, రిటైల్, టెలికం వ్యాపారాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయని రిల్ పేర్కొంది. దీంతో భారత ప్రయివేటు రంగంలో ఒకే త్రైమాసికంలో రూ.10,000 కోట్ల లాభాలు సాధించిన ఘనత రిల్కు దక్కింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.9,420 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ ఏకంగా 55.9 శాతం పెరిగి రూ.1.71 లక్షల కోట్లుగా నమోదయ్యింది. డిసెంబర్తో ముగిసిన త్రైమాసికంలో రిల్ రూ.1.4 లక్షల కోట్ల రెవెన్యూతో రూ.9,600 కోట్ల లాభాలు ప్రకటించే అవకాశం ఉందని తొలుత పలు మార్కెట్ విశ్లేషణలు వచ్చాయి. ఈ అంచనాలు మించి భారీ రెవెన్యూతో.. రికార్డు లాభాలను సాధించింది. తమ అన్ని విభాగాల రిటైల్, జియో వేదికలు అత్యధిక లాభదాయకతను నమోదు చేశాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ పేర్కొన్నారు. వైర్లెస్ వ్యాపారం భారీ వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2018 డిసెంబర్ ముగింపు నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అప్పులు రూ.2.74 లక్షల కోట్లకు చేరాయి. 2018 మార్చి 31 నాటికి ఈ అప్పులు రూ.2.18 లక్షల కోట్లుగా ఉన్నాయి.

జియోకు రూ.831 కోట్ల లాభాలు..

రిలయన్స్కు చెందిన జియో ఇన్ఫోకామ్ క్రితం డిసెంబర్తో ముగిసిన త్రైమాసికంలో 65 శాతం వృద్ధితో రూ.831 కోట్ల లాభాలు సాధించింది. ఇంతక్రితం త్రైమాసికంలో రూ.681 కోట్ల లాభాలు నమోదు చేయగా, 2017 డిసెంబర్తో ముగిసిన త్రైమాసికంలో రూ.504 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ3లో ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి రూ.130గా నమోదయ్యింది. జియో కుటుంబం 28 కోట్లకు చేరిందని ముఖేష్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డాటా నెట్వర్క్ స్థాయికి ఎదుగుతోందన్నారు. తమ తర్వాత తరం ఫైబర్ టు ద సబ్స్క్రైబర్ జియోగిగాఫైబర్ ద్వారా గృహాలు, సంస్థల కనెక్టివిటీ సొల్యూషన్స్లోకి రానున్నామన్నారు. క్రితం డిసెంబర్తో ముగిసిన త్రైమాసికంలో జియో ఆదాయం 21.2 శాతం పెరిగి రూ.21,317 కోట్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17,580 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. పెట్రో కెమికల్ విభాగం క్రితం క్యూ3లో 37.1 శాతం వృద్ధితో రూ.46,246 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. రిటైల్ బిజినెస్ 89.3 శాతం శాతం వృద్ధితో 18,798 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. గురువారం మార్కెట్లు ముగిసిన తర్వాత రిల్ ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. బీఎస్ఇలో రిల్ సూచీ 0.03 శాతం తగ్గి రూ.1,133.75 వద్ద ముగిసింది.

హెచ్యుఎల్కు రూ.1,444 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ హెచ్యుఎల్ 2018-19 డిసెంబర్తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 9 శాతం వృద్ధితో రూ.1,444 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,326 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో రూ.8,323 కోట్ల అమ్మకాలు చేయగా, క్రితం డిసెంబర్ త్రైమాసికంలో రూ.9,357 కోట్ల అమ్మకాలు నమోదు చేసినట్లు హెచ్యుఎల్ రెగ్యులేటరీ ఫైలింగ్లో తెలిపింది. మరో త్రైమాసికంలోనూ తాము మెరుగైన ప్రగతిని కనబర్చామని హెచ్యుఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహత పేర్కొన్నారు.

ఊగిసలాటలో.. స్వల్ప లాభాలు..

ముంబయి: దేశీయ మార్కెట్లు గురువారం తీవ్ర ఊగిసలాటల మధ్య కదలాడి తుదకు స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ప్రభావంతో ఈ ఉదయం సూచీలు ఉత్సాహంగా ప్రారంభమైనప్పటికీ.. కీలక రంగాల్లో వెల్లువెత్తిన అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్ను దెబ్బతీశాయి. ఫలితంగా ఆద్యంతం తీవ్ర ఒడుదొడుకుల్లో సాగిన సూచీలు చివరకు స్వల్ప లాభాలతో సరి పెట్టుకున్నాయి. గురువారం నాటి సెషన్లో సెన్సెక్స్ 53 పాయింట్లు లాభపడి 36,374 పాయింట్ల వద్ద, నిఫ్టీ 15 పాయింట్ల లాభంతో 10,905 పాయింట్ల వద్ద ముగిశాయి. ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైన ట్రేడ్ అయ్యింది. అయితే ఆ జోరు ఎంతో సేపు నిలువలేదు. ఆసియా మార్కెట్ల మిశ్రమ సంకేతాలతో పాటు ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు కుదేలవడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 100 పాయింట్లు నష్టపోయింది. అయితే చివరి గంటల్లో మళ్లీ కొనుగోళ్లు జరగడంతో సూచీలు తేరుకున్నాయి. డాలర్తో రూపాయి మారకం విలువ 71.11 గా నిలిచింది.

ఫోక్స్వ్యాగన్కు ఎన్జిటి భారీ షాక్

- 24 గంటల్లో రూ.100 కోట్లు చెల్లించాలి
- లేనిచో సంస్థ ఆస్తుల సీజ్

న్యూఢిల్లీ : ప్రముఖ జర్మన్ కార్ల తయారీ సంస్థ ఫోక్స్వ్యాగన్కు న్యూఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జిటి) తీవ్ర షాక్ ఇచ్చింది. ఈ కంపెనీ కార్లు భారత్లో తప్పుడు డీజిల్ మీటర్లతో వినియోగదారులను మోసం చేసిన కేసులో ట్రిబ్యునల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇంకా గడువు ఇచ్చేది లేదని.. 24 గంటల్లోగా రూ. 100కోట్లు జమ చేయాల్సిందేనని జస్టిస్ ఆదర్శ్ కుమార్ నేతత్వంలోని నలుగురు సభ్యులు బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. నగదు జమ చేసి శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. డబ్బు జమ చేయకపోతే ఫోక్స్వ్యాగన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ను అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. అదే విధంగా భారత్లోని కంపెనీ ఆస్తులను సీజ్ చేస్తామని పేర్కొంది.

ఒక్క 2006 ఏడాదిలోనే దాదాపు 3.17లక్షల వాహనాల ద్వారా ఫోక్స్వ్యాగెన్ వాస్తవానికంటే 40రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్ విడుదల చేసిందనేది ప్రధాన ఫిర్యాదు. ప్రపంచ వ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలపై, అనేక కేసులను ఎదుర్కొంటున్న ఫోక్స్ వ్యాగన్ భారతదేశంలో ఉద్గారాలను అనుమతించదగిన పరిమితులను మించి విడుదల చేసింది. కాగా ఈ కేసులో రూ.171 కోట్లు చెల్లించాలని గతేడాది నవంబరు 16న ఆదేశించింది. కాగా ఫోక్స్వ్యాగెన్ దీన్ని విస్మరించింది. దీంతో తాజాగా ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు నగదు 24 గంటల్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

వడ్డీ రేట్లు తగ్గించాలి

- పారిశ్రామిక వర్గాల సూచన
- ఆర్బిఐ గవర్నర్తో భేటీ

ముంబయి : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్తో గురువారం ముంబయిలో పారిశ్రామిక వర్గాలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా కీలక వడ్డీ రేట్లను తగ్గించాలని సంఘాల ప్రతినిధులు గవర్నర్ను కోరారు. వృద్ధికి మద్దతునివ్వడానికి రుణాలపై వడ్డీ రేట్లను మరింత అందుబాటులోకి తేవాలని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీవ (సిఐఐ), ఫిక్కీ అసోసియేషన్ల ప్రతినిధులు కోరారు. అదే విధంగా నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్)లో 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టేలా చర్యలు తీసుకోవాలని సిఐఐ సూచించింది. ఇప్పటికే ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నందున వడ్డీ రేట్ల తగ్గిస్తే బాగుంటుందని తెలిపింది. ఫిబ్రవరి 7న ఆర్బిఐ ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష జరుగనుంది. ప్రస్తుతం సిఆర్ఆర్ 4 శాతంగా, ఆర్బిఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై రెపో రేటు 6.5 శాతంగా ఉంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఇలు విత్త సమస్యలను ఎదుర్కొంటున్నాయని సిఐఐ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లింది. వ్యక్తిగత గ్యారంటీతో ఈ రంగాలకు రుణాలు ఇవ్వాలని కోరింది.

దేశం గర్వించదగ్గ నాయకుడు జ్యోతిబసు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

భారత రాజకీయాల్లో జ్యోతిబసుది ప్రత్యేక అధ్యాయమని, దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో ప్రముఖులని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కొనియాడారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలోని సిపిఎం నగర కార్యాలయంలో పార్టీ ఆ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జ్యోతిబసు తొమ్మిదో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, సమకాలిన రాజకీయ నాయకుల్లో సుదీర్ఘకాలం ప్రజా జీవితం గడిపిన జ్యోతిబసు చరిష్మా వన్నెతగ్గనిదన్నారు. సమైక్యంగా మెలగడం, ముక్కుసూటిగా వ్యవహరించడం, కష్టపడేతత్వం మెండుగాగల పరిపాలనాదక్షులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు జిఎస్.రాజేశ్వరరావు, అప్పారావు, నరేంద్ర, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



సభ
విశాఖలో సభకు హాజరైన కార్మికులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు

జ్యూట్‌మిల్లును తక్షణం తెరిపించాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి- తగరపువలస, విశాఖ

విశాఖ జిల్లా చిట్టివలస జ్యూట్ మిల్లును తక్షణం తెరిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్స్ మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వర్కింగ్ ప్రెసిడెంట్ సాడి సూరిబాబు అధ్యక్షతన గురువారం జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ జ్యూట్ మిల్లులో వివి.గిరి, వై.విజయ్‌కుమార్ లాంటి ఎందరో పోరాట యోధులు ఇక్కడ కార్మికవర్గానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు గానీ, కార్మికవర్గానికి గానీ పోరాటాలేమీ కొత్త కాదన్నారు. గత పోరాటాలను నెమరువేసుకుంటూ అదే స్ఫూర్తితో పోరాటం నిర్వహించడం ద్వారా ఈ జ్యూట్‌మిల్లు తెరిపించుకోవచ్చని స్పష్టం చేశారు. రూ.50 కోట్ల పెట్టుబడి పెడితే మిల్లును నడపొచ్చన్నారు. కడుపు మండితే కార్మికులే కాళ్ల దగ్గరకు వస్తారన్న భ్రమల్లో యాజమాన్యం, ప్రభుత్వముందని, వారి ఆశలు సాగవని హెచ్చరించారు. మూడు నెలల జీతాలు చెల్లించి చేతులు దులుపుకుని, ఆపై జ్యూట్ మిల్లుకు, యాజమాన్యానికి చెందిన విలువైన భూములను అడ్డదారుల్లో లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న దుర్బుద్ధితో స్థానిక మంత్రి గంటా శ్రీనివాసరావు, కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల పో(గో)డు పట్టదా..?

- అడిగితే అక్రమ కేసులు
- రంపచోడవరంలో కందకాలు తవ్వడంతో ఆదివాసీలకు కష్టాలు
- యూకలిప్టస్ పెంపకానికి యత్నాలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి, చింతూరు

ఆదివాసీలు అనాదిగా సాగుచేసుకుంటున్న కొండపోడు భూములకు హక్కుపత్రాలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. అధికారులు ఎన్నిమార్లు అర్జీలు పెట్టుకున్నా, భూములకు సర్వేలు నిర్వహించినా హక్కు పత్రాలివ్వడం లేదు. పైగా వారిని పోడు నుంచి తరిమి కొట్టేందుకు కందకాలు తవ్వేసి, పంటలను ధ్వంసం చేసి, అక్రమ కేసులు పెట్టి అధికారులు వేధిస్తున్న పరిస్థితి నెలకొంది.

రంపచోడవరం డివిజన్‌లో 22,500, చింతూరు డివిజన్‌లో 11,963.8 ఎకరాల విస్తీర్ణంలో పోడు సాగుచేస్తున్నారు. రంపచోడవరం డివిజన్‌లో 25 వేల కుటుంబాలు పోడు వ్యవసాయంపై ఆధారపడ్డారు. చింతూరు డివిజన్‌లో 2,992 మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, 2,295 ఎకరాల్లో రెవెన్యూ, అటవీ అధికారులు సర్వే చేశారు. విభజనకు ముందు చింతూరు మండలం భద్రాచలం ఐటిడిఎ పరిధిలో 1069 మంది పోడు భూముల పట్టాలకు దరఖాస్తు చేసుకోగా, 782 క్లైమ్‌లకు సంబంధించి సర్వే చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం కుటుంబానికి పదెకరాల వరకూ కొండపోడు వ్యవసాయం చేసుకోవచ్చు. 2005కు పూర్వం ఎవరైతే సాగు చేసుకుంటూ వారికి పట్టాలివ్వాల్సి ఉంది. అధికారులు రంపచోడవరం డివిజన్‌లో 850 కుటుంబాలకే హక్కుపత్రాలిచ్చారు. రాజవొమ్మంగి మండలంలో 300 కుటుంబాలు పోడు చేసుకుంటే వంద కుటుంబాలకు మూడు నుంచి ఐదు ఎకరాల చొప్పున ఇచ్చారు. చింతూరు డివిజన్‌లో అదీ లేదు. కొండపోడు ద్వారా పత్తి, జీడిమామిడి, జాఫ్రా, పొగాకు, మినుములు, పెసలు, కందులు, మొక్కజొన్న, చోళ్ల పంటలను సాగుచేస్తున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకుని ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అర్హులందరికీ పట్టాలివ్వాలని సిపిఎం ఆధ్వర్యాన 15 ఏళ్ల నుంచి గిరిజనులు పోరాడుతున్నారు. విలీనం తరువాత చింతూరులో ఐటిడిఎ ముందు యర్రంపేటలో పోడు భూముల సాగుదారులతో భారీ రాస్తారోకో నిర్వహించారు.

రైతులపై అక్రమ కేసులు, బెదిరింపులు

కొండపోడు భూముల్లోకి అటవీ అధికారులు ప్రవేశించి గిరిజనులను బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నారు. అడ్డతీగల మండలంలోని 30 మందిపై, రాజవొమ్మంగిలో 40 మందిపై గంగవరంలో 20 మందిపై, మారేడుమిల్లిలో 15 మందిపై అధికారులు అక్రమ కేసులు పెట్టారు.

కొమరాపురం, ఉర్లాకులపాడు తదితర గ్రామాల్లో గిరిజనులు సాగుచేసిన జీడిమామిడి మొక్కలను ఫ్రాక్లయిన్‌లతో ధ్వంసం చేశారు. ఎదురుతిరిగిన గిరిజనులపై కేసులు బనాయించారు. గిరిజనులకు బాసటగా నిలిచిన గిరిజన సంఘం జిల్లా నాయకులు సింగిరెడ్డి అచ్చారావుపై అధికారులు దాడులు చేయడంతో పాటు గాయపర్చి, నాలుగు కేసులు పెట్టారు. సంఘం జిల్లా నాయకులు తెల్ల అబ్బాయిపై 4 కేసులు, మండల నాయకులు కొండ్ల సూరిబాబుపై 2 కేసులు, లోతా రామారావు, జి.బోడిరెడ్డి, కొపూరి అప్పలరాజుపై ఒక్కొక్క కేసు పెట్టారు. వీటిలో 3 కేసులను తప్పుడు కేసులుగా కోర్టు కొట్టివేసింది. రాజవొమ్మంగి మండలం ఉర్లాకుల పాడుకు చెందిన కొసూరి అప్పలరాజు 2005 నుంచి పోడు సాగు చేసుకుంటున్నాడు. పట్టా ఇవ్వకపోగా, పట్టా అడిగినందుకు అధికారులు అక్రమ కేసులు పెట్టారని చెప్పాడు.

హైకోర్టు స్టే తెచ్చుకున్న గిరిజనులు

అధికారుల వేధింపులు తాళలేక గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. రాజవొమ్మంగి మండలం దుర్గానగరం, మద్దిలబంధం, ఉర్లాకులపాడు, వనకరాయి, కొమరాపురం, వెంకటనగరం, చిలకలపాలెం, చికిలింత, గుర్రంగి, వాతంగి, కొండపల్లి, లోదొడ్డి, డి.మల్లవరం, రాజవొమ్మంగి గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. అయినప్పటికీ, అధికారుల బెదిరింపులకు దిగుతూనే ఉన్నారని గిరిజనులు చెబుతున్నారు.



కొండపోడు భూములను దున్నుతున్న రైతు

కేసులతో భయపెట్టలేరు



సింగిరెడ్డి అచ్చారావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

గిరిజనులు సాగులోని కొండపోడు భూముల రక్షణకు పోరాడుతున్న మాపై కేసులు పెట్టినా భయపడేది లేదు. పోడు భూములకు హక్కు పత్రాలిచ్చే వరకూ పోరాడతాం.

రుణాలు పొందలేకపోతున్నాం



మొట్టం అప్పారావు, తుమ్మిల, చింతూరు

మా అన్నదమ్ములం ముగ్గురమూ కలిపి 15 ఎకరాల పోడు సాగు చేసుకుంటున్నాం. హక్కు పత్రాలివ్వాలన్నారు ఇవ్వడంలేదు. ఎరువులు, పురుగు మందులు పొందాలంటే పట్టాల్లేవు. బ్యాంకు రుణమూ దక్కడం లేదు. వర్షాధారం కావడం వల్ల ఈ ఏడాది తిండి గింజలే కాదు, పశువుల దాణా కూడా లేదు.

వలస పోవాల్సి వస్తోంది

కె.సోమిరెడ్డి, యర్రగొండపాకలు



మేం ఎంతోకాలంగా కొండపోడు చేసుకుంటున్నాం. కొండల మధ్యలో ఉంటూ కొండపై జొన్నలు వేస్తాం, ఇప్పుడు కందకు దిగి వ్యవసాయం చేసుకుంటున్నాం. మా గ్రామానికి కొండపోడు భూమి పట్టాలను ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో, రుణాలు రావడం లేదు. పెట్టుబడి పెట్టలేక చాటలు, బుట్టలు అల్లుకుని సంతల్లో అమ్ముకుని, వచ్చిన వాటితోనే బతుకు వెళ్లదీస్తున్నాం.



అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ నినాదాలు చేస్తున్న దళితులు

వీరవల్లి అగ్రహారంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

నిరసనగా దళిత సంఘాల రాస్తారోకో

పోలీసుల అదుపులో అనుమానితులు

ప్రజాశక్తి-మాడుగుల (విశాఖపట్నం)

విశాఖ జిల్లా వి.మాడుగుల మండలం, వీరవల్లి అగ్రహారం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీనికి నిరసనగా దళితులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేశారు. రెండురోజుల క్రితం స్థానిక దళిత యువకులకు, అగ్రవర్ణానికి చెందిన యువకులకు మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. వెంటనే సర్దుమణిగింది. బుధవారం రాత్రి కనుమ పండగ సందర్భంగా గ్రామంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయానికి అంబేద్కర్ విగ్రహం ముక్కు, చేతులు ధ్వంసమై ఉన్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న మాల మహానాడు, ఇతర దళిత సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వడ్డాది, పాడేరు మార్గంలోని ముకుందపురం వద్ద ఆందోళన రాస్తారోకో చేపట్టారు. దీంతో ఆ మార్గంలో సుమారు గంటన్నర పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న చోడవరం, మాడుగుల పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులను శాంతింపచేశారు. రెండు రోజుల క్రితం ఘర్షణ పడిన యువకులే విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉంటారని దళితులు ఫిర్యాదు చేయడంతో అరుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చింతపండు రైతుల ఆందోళన

ఒత్తిడితో ఈ-నామ్‌లో పాల్గొన్న వ్యాపారులు

ప్రజాశక్తి - హిందూపురం(అనంతపురం)

అనంతపురం జిల్లాలో చింతపండు రైతులు గురువారం ఆందోళనకు దిగారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి... వ్యాపారులు ఈ-నామ్‌లో పాల్గొనకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని గతంలో డిడిఎం లావణ్య హెచ్చరించారు. గురువారం అధికారులు బహిరంగ వేలాన్ని నిషేధించి, ఈ-నామ్ విధానాన్ని అమలు చేశారు. అప్పటికే అప్రమత్తమైన వ్యాపారులు సిండికేట్‌గా మారారు. చింతపండు ధరను గతవారం కంటే 60 నుంచి 70 శాతం తగ్గించారు. వ్యాపారులు ఒక్కసారిగా చింతపండు ధరను తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఈ-నామ్ విధానం అధికారులు అమలు చేయడంతో కర్పూరి చింత పండు రూ.7 వేల నుంచి రూ.10 వేలు, పువ్వు చింత పండు రూ.3 వేల నుంచి రూ.4 వేల ధర పలుకుతోందని రైతులు పేర్కొన్నారు. సిఐటియు మార్కెటింగ్ శాఖ డిడిఎంకు విషయాన్ని వివరించారు. ఆమె వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి ఈ-నామ్ విధానం అమలులో ధరలు ఎందుకు తగ్గిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విధానంలో పాల్గొనకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆగ్రహానికి గురైన వ్యాపారులు కూడా గంట పాటు రోడ్డుపై బైఠాయించారు. కొద్దిసేపు డిడిఎం, మార్కెట్ యార్డు వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు హిందూపురం తహశీల్దార్ చల్లా విశ్వనాథ్‌ను పిలిపించారు. మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ ప్రమీల, టిడిపి నాయకులు నాగరాజు అక్కడికి చేరుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఈ-నామ్ విధానాన్ని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు. బహిరంగ వేలంతో వ్యాపారులు కొనసాగిస్తారని తెలిపారు. రైతులు ఆందోళనను విరమించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని ప్రకాశ నాయకులు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు.

జర్నలిస్టుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-వింజమూరు, నెల్లూరు

నెల్లూరులోని వింజమూరులో మద్యం ఇసుకమాఫియా నాయకులు బుధవారం ఆంధ్రప్రభ రిపోర్టర్ రవీంద్రరెడ్డి, ప్రజాశక్తి రిపోర్టర్ హజరత్‌రెడ్డి ఇళ్లపై దాడులకు దిగారు. వీటిని ఖండిస్తూ గురువారం ఎపియుడబ్ల్యుజె, ఎపిఎంపిఏజే సంఘాల ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా గెస్ట్‌హౌస్ నుంచి పోలీసుస్టేషన్ వరకూ భారీ నిరసన ర్యాలీ చేసి, దాడికి దిగిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలు, ఇసుక మాఫియాల విషయమై రెండ్రోజుల క్రితం ప్రజాశక్తి, ఆంధ్రప్రభలో వచ్చిన వరుస కథనాలతో వాటికి సంబంధించిన మాఫియా నాయకులు ఈ దాడులకు పాల్పడ్డారు.

కెసిఆర్, జగన్ పొత్తు అనైతికం

హోంమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రాన్ని విడగొట్టి, ఏపీ అభివృద్ధిని మోడీతో కలిసి అడ్డుపడుతున్న కెసిఆర్‌తో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి కలవడం అనైతికమని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతి కేసుల్లో ఉన్న జగన్ మోడీతో కలిసి రాష్ట్రానికి అన్యాయం చేయడమే కాకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో కలిసి ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించడం సరికాదన్నారు. మోడీ ఆధ్వర్యాన ఏర్పాటైన తృతీయ ఫ్రంట్‌ను కెసిఆర్ భుజాన వేసుకుని జగన్‌తో కలిసి రాష్ట్రానికి అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. జగన్‌ను ఓటుకు నోటు కేసులో చంద్రబాబు దయ వల్ల గతంలో మంత్రి అయిన తలసాని శ్రీనివాసయాదవ్ చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. కోడి పందేల కేసుల విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా పత్రికల్లో పేర్లు వచ్చిన వారందరిపైనా కేసులు పెడతామని చెప్పారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావు మాట్లాడుతూ బిసీలు ఎన్నికల్లో రాజీనామా చేయించి, కెసిఆర్, మోడీ డైరెక్షన్‌లో ఎన్నికలు లేకుండా జగన్ చేశారని తెలిపారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తోట త్రిమూర్తులు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల మూత

- నిలిచిన సేవలు
- సమ్మెలో నిర్వాహకులు
- లావాదేవీల్లో 50 శాతం చెల్లించాలని డిమాండ్



గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిరసన తెలుపుతున్న మీ సేవా సిబ్బంది

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వ కమీషన్లు సక్రమంగా చెల్లించాలని, అన్ని ఖర్చుల తామే భరిస్తున్నామని, లావాదేవీల్లో 50 శాతం తమకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మీసేవ కేంద్రాల నిర్వాహకులు గురువారం నుండి సమ్మెబాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలు మూతపడటంతో సేవలు స్తంభించిపోయాయి. కడప జిల్లాలోని 363 మీ సేవ కేంద్రాల్లో సిబ్బంది సమ్మెబాట పట్టారు. పశ్చిమగోదావరి జిల్లామొత్తంగా 638 వరకూ మీ సేవా కేంద్రాలుండగా, 550కు పైగా మూతపడ్డాయి. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు కొన్ని కేంద్రాలు తెరిచినట్లు సమాచారం. ఎపి మీ సేవ ఆపరేటర్ల అసోసియేషన్ పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మీ సేవ కేంద్రాలు మూతపడ్డాయి. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ నినదించారు. శ్రీకాకుళం జిల్లాలోని 710 మీ-సేవా కేంద్రాలు మూతపడ్డాయి. విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 518 మీ-సేవా కేంద్రాలు మూతపడ్డాయి. వీటిద్వారా ప్రజలకు అందాల్సిన 440 ప్రభుత్వ సేవలు నిల్చిపోయాయి. సమ్మెలో భాగంగా ఆ జిల్లా కేంద్రంలో ర్యాలీ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. విశాఖ జిల్లావ్యాప్తంగా మీ సేవా కేంద్రాలు మూతపడ్డాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మీ-సేవ కేంద్రాలు మూతపడ్డాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలోని 38 మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు నిరవధిక సమ్మెలో దిగారు. సత్తెనపల్లిలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. మాచర్లలో ర్యాలీ అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈపూరు మండలంలోని 12 మీ-సేవ కేంద్రాలు మూతబడ్డాయి. కృష్ణా జిల్లాలోని కోడూరు, చల్లపల్లి, అవనిగడ్డ మండల కేంద్రాలతో పాటు కంచికచర్ల, నూజివీడు, తిరువూరులోని మీసేవా కేంద్రాలు మూతపడ్డాయి.

విజయవాడలో 50 వరకూ మీ సేవా కేంద్రాలు మూతపడ్డాయి. అర్బన్ పరిధిలో ఫ్రాంచైజీల ద్వారా సబ్ కాంట్రాక్టు తీసుకున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు తమ తమ కేంద్రాలను మూసివేశారు. విశాఖలో, గ్రామీణ ప్రాంతాల్లో 29 మీ సేవా కేంద్రాలు మూతపడ్డాయి. మాడుగుల, గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాల్లో సేవలు నిలిచిపోయాయి. విశాఖపట్నం రూరల్‌లోని నర్సీపట్నంలో ప్లకార్డులను చేతబట్టి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కర్నూలు జిల్లావ్యాప్తంగా మీసేవ కేంద్రాలను మూసివేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో మీసేవ కేంద్ర నిర్వాహకులు తహశీల్దార్ వెన్నెల పద్మావతిని కలిసి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సుబాబుల్ రైతులను ఆదుకోవాలి

ఎకరాకు రు.లక్ష చెల్లించాలని వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి-చీమకుర్తి (ప్రకాశం)

సుబాబుల్ రైతులను ఆదుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఎనికపాడు, గుమ్మనంపాడు, మంగమూరు, ఏలూరివారి పాలెం, చంద్రపాలెం, గోనుగుంటలలో ఎండిన సుబాబులు తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబాబుల్ తోటలు ఎండిపోవడం వల్ల రైతులు రూ.లక్ష నష్టపోయినట్లు తెలిపారు. ఎండిన సుబాబుల్ తోటలను తొలగించడానికి ఎకరాకు రూ.25వేలు నుంచి రూ.30వేలు ఖర్చవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే తక్షణం సాయంగా సుబాబులు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తానని ప్రచారం చేస్తుందని, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేస్తానని చెప్పిందని, ఒప్పందం ప్రకారం కంపెనీలు కొనకపోతే రైతులకు ప్రభుత్వం ఎందుకు అండగా నిలబడడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టు వ్యవసాయం వల్ల రైతులను కంపెనీలు దోపిడీకి వదిలి వేయడమేనా? అని నిలదీశారు. కంపెనీలు సుబాబుల్ కొనకుండా రైతులను దోచుకుంటుండే, రైతుల ఆందోళన వల్లే కంపెనీలు కొనడం లేదని ప్రచారం చేయడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు. రైతుల ఆందోళన వల్లే సుబాబుల్ ఒప్పందాలు గత 20 ఏళ్లుగా అమలు జరుగుతున్నాయన్నారు. రైతులు మరింత పోరాడాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సుబాబుల్ కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. అలా కాకపోతే ప్రభుత్వం రైతులకు ఎకరాకు రు.లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులు కూడా ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయే సూచనలు కనబడుతున్నాయన్నారు. బోర్డు వద్ద ఉన్న రు.500 కోట్లు రైతుల డబ్బుతో పొగాకు రైతులను ఆదుకోవాలని సూచించారు. ప్రకాశం జిల్లాకు 5 టిఎంసిల నీటి కోసం వైఎస్ఆర్ పార్టీ నాయకత్వం కూడా ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వం వెంటనే కాలువ చివరి భూములకు నీరిచ్చి 80వేల ఎకరాల రైతులను ఆదుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పెంట్యాల హనుమంతరావు ఉన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నికోలస్ మదురో
2. అశుతోష్ అమన్ (బీహార్, 68 వికెట్లు)
3. గుజరాత్
4. సిక్కిం
5. సుశీల దేవి లిటరేచర్ అవార్డు

పురిటిలోనే బిడ్డ మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ బాధితుల ఆందోళన

సిబ్బందిపై పోలీసు కేసు నమోదు



నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరులోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో పురిటి (మగ) బిడ్డ మృతి చెందింది. బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు. నెల్లూరులోని శ్రీలంక కాలనీకి చెందిన రవికుమార్, భార్య సోనుని కాన్పు నిమిత్తం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో సోమవారం అడ్మిట్ చేశారు. గురువారం తెల్లవారుజామున కాన్పు కష్టం కావడంతో ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. పుట్టిన బిడ్డకు గుండె బలహీనంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక విభాగం తరలించినట్లు తెలిపారు. గంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించి శిశువును అప్పగించారు. కాన్పులో చనిపోయిందనుకున్న బిడ్డ తలకు గాయమయ్యి రక్తస్రావం అవడం బంధువులు గమనించారు. వెంటనే మృతదేహంతో 5వ నగర పోలీసు స్టేషన్‌కు వెళ్లి వైద్యులపై రవికుమార్ ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి ఆస్పత్రికి చేరుకొని ఈ ఘటనకు చెందిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, బాధిత బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు.

సమాచారం తెలుసుకున్న జనసేన పార్టీ స్థానిక నేతలు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు మద్దతు పలికారు. సమాచారం తెలుసుకున్న వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు హుటాహుటిన ప్రసూతి వైద్యశాల విభాగానికి చేరుకొని బాధితులతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృత శిశువును పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రై రీసోర్స్ సెంటర్‌ను తరలించాలని వంటా వార్పు

ప్రజాశక్తి - గాజువాక, విశాఖ

జివిఎంసి 52వ వార్డు పరిధి శీకువానిపాలెంలో ఏర్పాటుచేసిన డ్రై రీసోర్స్ సెంటర్‌ను తక్షణమే తరలించాలని కోరుతూ వంటావార్పు నిర్వహించారు. గురువారం ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే జనసేన నేత చింతలపూడి వెంకటరామయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 16 రోజులుగా 14 నిర్వాసిత కాలనీల ప్రజలు దీనిని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే కానీ, జివిఎంసి అధికారులు కానీ స్పందించకపోవడం అన్యాయమన్నారు. గంగవరం పోర్టు, రామ్‌చంద్రనగర్ డంపింగ్ యార్డు వల్ల నిర్వాసిత కాలనీ ప్రజలు శ్వాసకోశ, గుండెజబ్బులు, క్యాన్సర్ తదితర వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఈ సెంటర్‌ను గాజువాక ఆటోనగర్‌లో ఖాళీగా ఉన్న ఎపిఐఐసి స్థలంలో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఏలూరులో నిషేధిత గుట్కా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అక్రమంగా నిల్వ ఉంచిన రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఒన్‌టౌన్ పోలీస్ట్టేషన్ పరిధిలోని బడేటి వారి వీధికి చెందిన నోటి వెంకటరెడ్డి నిషేధిత గుట్కా ప్యాకెట్లను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటిపై దాడి చేసి రూ.లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అమెరికా కంపెనీలకు ప్రయోగశాలగా భారత్

హోస్టన్ : 'అమెరికా కంపెనీలకు భారత్ ఒక ప్రయోగ శాలగా మారనుంది' ఈ వ్యాఖ్యలను భారత్‌కు చెందిన ఏ ఆర్థిక వేత్త గానీ, ఏ రాజకీయ గానీ చేయలేదు. అమెరికాకు చెందిన నిపుణుడే ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఇటీవల 3వ ఐసిసిఆర్-హోస్టన్ ఇండియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రపంచబ్యాంక్ సలహాదారుడు, పెన్‌సాల్వనియా యునివర్శిటీ అధ్యాపకులు డిజోర్జజిజా పెట్‌కోసక్ మాట్లాడుతూ అమెరికా కంపెనీలకు భారత్ ఒక ప్రయోగశాలగా మారిందని తెలిపారు. అలాగే అమెరికా కంపెనీలు కేవలం తమ ఉనికిని చాటుకోవడానికి మాత్రమే కాకుండా.. తమ వాణిజ్య ప్రయోజ నాలకు ఒక 'ప్రయోగశాల'గా భారత్‌ను వినియోగించుకుంటు న్నాయని వెల్లడించారు.

నిరసన జ్వాల
పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అసోం రాజధాని గువాహటిలో ఆందోళనకారులు భారీ కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



బిజెపికి రికార్డు స్థాయిలో విరాళాలు

న్యూఢిల్లీ : దేశంలోని జాతీయ పార్టీల మొత్తం విరాళాలకన్నా బిజెపి అందుకున్నవి 12 రెట్లు అధికమని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2017-18)లో బిజెపికి అందిన విరాళాల మొత్తం రూ.437 కోట్ల 4 లక్షలు. కాగా, బిజెపి సహా జాతీయ పార్టీల విరాళాల మొత్తం 469 కోట్ల 89 లక్షలు అని ఏడీఆర్ తెలిపింది. అంటే మిగతా పార్టీలన్నిటికీ అందిన మొత్తం రూ.32.85 కోట్లు మాత్రమే. ఏటా ఎన్నికల కమిషన్‌కు జాతీయ పార్టీలు ఇచ్చే సమాచారం ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలను వెల్లడించింది. ఏడీఆర్ నివేదిక ప్రకారం కాంగ్రెస్‌కు రూ.26.658 కోట్లు, ఎన్‌సీపీకి రూ.2.087 కోట్లు, సిపిఐ(ఎం)కు రూ.2.756 కోట్లు, సిపిఐకి రూ.1.146 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.20 లక్షల విరాళాలు అందాయి. రూ.20 వేలకుపైగా విరాళాలుగా అందిన వివరాలనే ఆయా పార్టీలు ఎన్నికల కమిషన్‌కు అందిస్తాయన్నది గమనార్హం. బీఎస్పీకి రూ.20 వేలకుపైగా విరాళాలు అందినట్టు రికార్డుల్లో లేదు. బిజెపి, కాంగ్రెస్‌కు అధిక మొత్తంలో రూ.164.30 కోట్లమేర విరాళాలు అందించిన సంస్థ ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్. ఇందులో బిజెపికి రూ.154.30 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.10 కోట్లు ఆ సంస్థ అందించింది. బిజెపికి అందిన మొత్తంలో ఈ సంస్థ నుంచి అందింది 35 శాతం కాగా, కాంగ్రెస్‌కు 38 శాతం. ఈ రెండు పార్టీలకు కార్పొరేట్ సంస్థల నుంచే అధిక మొత్తం అందాయి. కార్పొరేట్ల నుంచి బిజెపికి రూ.400.23 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.19.29 కోట్లు అందాయి. బిజెపికి 2977మంది, కాంగ్రెస్‌కు 777మంది, సిపిఐ(ఎం)కు 196మంది, సిపిఐకి 176మంది, ఎన్‌సీపీకి 42మంది, తృణమూల్‌కు 38మంది విరాళాలు ఇచ్చారు. బిజెపికి ఢిల్లీలోనే విరాళాలు అధికంగా (రూ.208.56 కోట్లు) వచ్చాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో రూ.71.93 కోట్లు, గుజరాత్‌లో రూ.44.02 కోట్లు, కర్నాటకలో రూ.43.67 కోట్లు, హర్యానాలో రూ.10.59 కోట్లు వచ్చాయి.

ఉద్యోగాభివృద్ధిపై కేంద్రం వద్ద వాస్తవ సమాచారం లేదు

ఎంఎం జోషీ నేతృత్వంలోని ప్యానెల్

న్యూఢిల్లీ : దేశంలో ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. దేశంలో ఉద్యోగాభివృద్ధిపై కేంద్రంపై ఎలాంటి వాస్తవ సమాచారమూ లేదు. దీనిపై బీజేపీ అగ్రనాయకుడు మురళీ మనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానెల్.. తన నివేదికలో ఈ విషయాన్నే తెలియజేయనున్నది. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కొత్తగా సృష్టించిన ఉద్యోగాలపై మోడీ ప్రభుత్వం వద్ద ఎలాంటి సమాచారం లేదని పేర్కొంటూ తన నివేదికకు తుది రూపు ఇవ్వనున్నది. కాగా,విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ నివేదికను లోక్‌సభ ముందు ప్రవేశపెట్టడానికి జోషి సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉండగా ప్యానెల్‌పై అసంతృప్తిని వెళ్లగక్కుతూ కమిటీలోని ముగ్గురు బీజేపీ నాయకులు రాజీవ్ ప్రతాప్ రూఢీ(ఈయన కమిటీ ఏ సమావేశానికీ హాజరుకాలేదు), నిశికాంత్ దూబే, రమేశ్ బిధురీలు లేఖలు సమర్పించారు. భారత్‌లో ఉపాధిని అంచనా వేసే విశ్వసనీయతగల యంత్రాంగాలు లేవనడాన్ని వారు అంగీకరించలేదు. అంచనాల కమిటీ 'తన పరిధిని అధిగమిస్తోంది' అని వారు అన్నారు. ఈ లేఖలను నివేదికకు అనుబంధంగా లోక్‌సభ ముందుకు ప్రవేశపెట్టాలని జోషీ నిర్ణయానికి వచ్చారు. అయితే జోషి మాత్రం ఉద్యోగ సమాచార సేకరణపై సంప్రదాయక పద్ధతులనే కఠినంగా పాటించారు. ఇందులో నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్ఎస్ఎస్ఓ) బయటపెట్టే సమాచారాన్ని కూడా కమిటీ ఆశ్రయించింది. అయితే 2011-12 ఏడాది తర్వాత నుంచి కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ఓ సమాచారం లేదు. ప్రతి ఐదేండ్లకోసారి నిర్వహించే ఎన్ఎస్ఎస్ఓ సర్వేను గతేడాది చివరనాటికి విడుదల చేస్తామని కేంద్రం తెలిపినప్పటికీ అది కూడా ఆలస్యమైంది. అలాగే ఆలిండియా యాన్యువల్ లేబర్ బ్యూరో సర్వేలను కూడా కేంద్రం అధికారికంగా విడుదల చేయలేదు. అయితే గతేడాది మీడియాకు లీక్ చేసిన ఈసర్వే సమాచారం మేరకు 2016-17లో నిరుద్యోగం నాలుగేండ్ల గరిష్టానికి చేరింది.

ఈ సర్వే సమాచారాన్ని మోడీ ప్రభుత్వం, కార్మిక శాఖలు సమాచారాన్ని పార్లమెంటరీ కమిటీకి అందించలేదు. దీంతో ప్యానెల్ చైర్మెన్ జోషీ.. 2011-12 ఎన్ఎస్ఎస్ఓ సర్వే అనంతరం ఉద్యోగాభివృద్ధిపై కేంద్రం వద్ద ఎలాంటి సమాచారం లేదని ముగింపునకు వచ్చారు. అలాగే ఈపీఎఫ్ఓల కొత్త రిజిస్ట్రేషన్లు పెరిగిపోవడాన్ని వాస్తవ ఉద్యోగాభివృద్ధిగా పరిగణించాలన్న మోడీ ప్రభుత్వ వాదనను ఆమోదించడానికి జోషి వ్యతిరేకించారు. ఇదిలా ఉండగా సార్వత్రిక ఎన్నికలకు ముందు జోషి ప్యానెల్ నివేదిక ద్వారా ఎదురయ్యే నష్టతీవ్రతను తగ్గించేందుకు బీజేపీ, కేంద్రం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

మూతపడిన చక్కెర మిల్లు తెరిపించాలి
మిగులు భూములు పంచాలి

ప్లాసీలో వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రదర్శన



ప్లాసీ(పశ్చిమ బెంగాల్) : ప్లాసీ రైతాంగ డిమాండ్లను తుంగలో తొక్కే రీతిలో పారిశ్రామికవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని, మూత పడిన చక్కెర మిల్లు మిగులు భూములను పంచాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మికుల సంఘం (ఎఐఎడబ్ల్యుయు) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం 15వేల మందికి పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రదర్శనలు, ధర్నా నిర్వహించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని లోక్‌నాథ్‌పూర్, రామ్‌నగర్ ఘాట్ నుండి నాడియా-ముర్షిదాబాద్ జిల్లా సరిహద్దులోని ప్లాసీకి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 34వ నెంబరు జాతీయ రహదారికి పక్కనే గల ప్లాసీ అలెయా హై మద్రసా గ్రౌండ్‌లో పెద్ద బహిరంగ సభ జరి గింది. ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నృపేన్ చౌదరి ఈ సభకు అధ్యక్షత వహించారు. ఎఐకెఎస్ జాయింట్ సెక్రటరీ బిజూ కృష్ణన్, మరో నేత అమల్ హల్దార్, ఎఐఎడబ్ల్యుయు అధ్య క్షుడు తుషార్ ఘోష్, కార్యదర్శి అమియో పాత్రా ప్రసంగిం చారు. 34వ నెంబరు జాతీయ రహదారిపై 5కిలోమీటర్ల పొడవునా సాగిన లాంగ్‌మార్చ్ మొత్తంగా అరుణారుణ మైంది. దారి పొడవునా నృత్యాలు, పాటలతో ప్రదర్శకులు అలరించారు. ఈ ప్రదర్శన కారణంగా దాదాపు గంట పాటు అక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు, ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలను ధిక్కరించి మరీ ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఆందోళనకారులు తమ నిరసనను తీవ్ర స్థాయిలో వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేబూని, సాంప్రదాయ గిరిజన నృత్యాలతో ఆద్యంతం ప్రదర్శన సాగింది. మూతపడిన చక్కెర మిల్లుకు చెందిన దాదాపు 7వేల ఎకరాల మిగులు భూములను రైతాంగానికి పంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మూత పడిన మిల్లును వెంటనే తెరవాలని, తమ 12 డిమాండ్లను వెంటనే అమోదించకపోతే ఆ మిగులు భూముల్లో అరుణ పతాకాలు ఎగురవేస్తామని ఎఐకెఎస్ అధ్యక్షుడు అమల్ హల్దార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గళం విప్పితే దేశద్రోహమా?

జెఎన్‌యులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా గళం విప్పితే దేశద్రోహం కేసులు బనాయిస్తున్న భయంకర పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల సమయంలో మోడీ దేశ ప్రజానీకానికి ఇచ్చిన హామీల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే... నిర్బంధాలరు గురిచేయడం నియంతృత్వ వైఖరికి నిదర్శనమని గురువారం జెఎన్‌యులో విద్యార్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో బృందాకరత్ వ్యాఖ్యానించారు. మోడీ పాలనలో రోజురోజుకీ నిర్బంధం పెరిగిపోతోం దని పేర్కొంటూ, జెఎన్‌యులో మూడేళ్ల క్రితం జరిగిన ఘటనపై ఇప్పుడు అభియోగ పత్రం నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని మోడీ సర్కార్, దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ చర్యకు ఒడిగట్టిందని, జాతీయతను మరొకసారి చర్చనీయాంశం చేసి ఓట్లు దండుకునేందుకు యత్నిస్తోందని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత ఎవరూ సంతోషంగా లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలన్నింటినీ ప్రణాళిక ప్రకారమే ధ్వంసం చేస్తున్నారని, అప్రజాస్వామిక నిర్ణయాలకు మోడీ తగిన మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తున్న జెఎన్‌యు విద్యార్థులకు తమ పార్టీ తరపున సంఘీభావం ఉంటుందని హామీనిచ్చారు. సిపిఐ(ఎంఎల్) పొలిట్‌బ్యూరో సభ్యురాలు కవితా కృష్ణన్ మాట్లాడుతూ జెఎన్‌యు విద్యార్థులు కన్నయ్య, ఉమర్, అనిర్బన్‌లపై దేశద్రోహం కింద ఛార్జిషీట్ దాఖలు చేయడం హేయమైన చర్యని ఖండించారు. కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానంలో వాస్తవాలు బహిర్గతంకాక తప్ప దని, మోడీ సర్కార్‌ను సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

డ్యాన్సింగ్ బార్లపై ఆంక్షలు సడలించిన సుప్రీం



ముంబయి : డ్యాన్సింగ్ బార్‌లపై మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయనవసరంలేదని, అలాగే మద్యంను అనుమతించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. నిబంధనలు ఉండవచ్చు కాని పూర్తిస్థాయిలో నిషేధం విధించ కూడదని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. మహిళల భద్రత చట్టం 2016 ప్రకారం సిసిటివి కెమెరాల ఏర్పాటు, డాన్స్ ఫోర్లను, బార్ రూమ్స్‌లను వేర్వేరుగా నిర్వహించాలంటూ గతంలో దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆంక్షలను వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎకె.సిక్రీతో కూడిన ధర్మాసనం డ్యాన్స్ బార్‌లను సాయంత్రం ఆరుగంటల నుండి 11 .30 గంటల వరకు అనుమతించవచ్చని, అలాగే మద్యాన్ని కూడా సరఫరా చేయవచ్చని పేర్కొంది. డ్యాన్సింగ్ ఫోర్లు, బార్ రూమ్స్ వేర్వేరుగా ఉండాల్సిన అవసరంలేదని ఆదేశించింది. డాన్సింగ్ బార్‌లలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయడం వారి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని, అలాగే డాన్స్ చేసేవారికి టిప్‌లు ఇవ్వవచ్చని ఆదేశించింది. అయితే నోట్లను వారిపైకి విసరడం వంటివి చేయకూడదని సూచించింది. కాగా , డ్యాన్సింగ్ బార్‌లు రాష్ట్ర సంస్కృతికి వ్యతిరేకమని, సామాజిక ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని, అలాగే యువతపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతాయని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

'కతువా ఘటన'కు ఏడాది..

బాధిత కుటుంబం సామాజిక వెలివేత

శ్రీనగర్ : దేశాన్ని ఒక కుదుపు కుదిపిన కతువా లైంగికదాడి ఘటనకు ఏడాది నిండింది. జమ్మూకాశ్మీర్‌లోని కతువాలో లైంగికదాడి, హత్యకు గురైన ఎనిమిదేండ్ల బాలిక మృతదేహం గతేడాది జనవరి 17న లభించింది. అనంతరం దేశంలోని అన్నివర్గాల నుంచి పెద్దఎత్తున ప్రజలు ఏకమై బాలిక కుంటుంబానికి న్యాయం జరగాలని రోడ్లనెక్కారు. జాతీయ, అంతర్జాతీయ సమాజం ఈ ఘటనను ఖండించింది. అయితే ఈ ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా.. ఆ చిన్నారి కుంటుంబం ఇప్పటికీ భయాందోళనల్లోనే ఉన్నది. కతువాలోని రసాన గ్రామంలో నివసిస్తున్న బకర్వాల్ తెగకు చెందిన ఆ కుటుంబం ఒంటరితనాన్ని, ఒకరకమైన సామాజిక వెలివేతను అనుభవిస్తున్నది. ఇరుగు పొరుగు తమతో మాట్లాడటం కాదు కదా.. కనీసం కన్నెత్తి కూడా చూడట్లేదని వివరిస్తున్నారు.

మీకు నచ్చకుంటే వెళ్లిపోండి

శత్రుఘ్న సిన్హాకు తేల్చి చెప్పిన బిజెపి



పాట్నా : బిజెపి ఎంపిగా ఉండి మోడీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్న వెటరన్ నటుడు, పాట్నా ఎంపీ శత్రుఘ్న సిన్హాపై వేటు వేసేందుకు ఆ పార్టీ రంగం సిద్ధం చేసింది. ఆయనకు నచ్చ కుంటే బిజెపి నుంచి వెళ్లిపోవాలని సూచిం చింది. ఈ మేరకు బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం పాట్నాలోని ఓ కార్యక్రమానికి హాజరైన సుశీల్ మాట్లాడుతూ.. 'కొన్ని రోజులుగా ఆయన తీరేం బాగాలేదు. పదే పదే బిజెపిని టార్గెట్ చేస్తున్నారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. బీజేపీ ఆయనకు చాలా గౌరవమిచ్చింది. ఆయ నకు నచ్చకుంటే పార్టీ నుంచి వెళ్లిపోవచ్చు' అని శత్రుఘ్న సిన్హాను ఉద్దేశించి అన్నారు.

పంజాబ్‌లో మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేస్తా : జెజె సింగ్

చండీగర్ : రాష్ట్ర రాజకీయాలను ప్రభా వితం చేసేలా నిర్ణయాత్మక శక్తిగా-'పంజాబ్ డెమొక్రటిక్ అలయన్స్' పేరుతో మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ జెజె సింగ్ గురువారం తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్‌పై పోటీ చేసిన ఆయన మరోసారి రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నానని, ఇది చారిత్రాత్మక మౌతుందని సింగ్ పేర్కొన్నారు. తాను కూడా ఇదే ఫ్రంట్‌లో కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల శిరోమణి అకాలీ దళ్‌కు సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

కర్ణాటకలో కుమారస్వామి ప్రభుత్వానికి ముప్పులేదు

బిజెపి యత్నాలు ఫలించవు : వేణుగోపాల్

హైదరాబాద్ : కర్నాటకలోని కాంగ్రెస్, జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమి లేదని, ఐదేళ్ల పాలనను పూర్తి చేస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్ గురువారం స్పష్టం చేశారు. 'ఆపరేషన్ కమల్' బిజెపికి పీడకల గానే మిగులుతుందని ఆయన వ్యాఖ్యానించారు. జెడిఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభు త్వాన్ని కూలదోసేందుకు 'ఆపరేషన్ కమల్' పేరుతో బిజెపి కుట్రలు పన్నుతున్న సంగతి తెలిసిందే.కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టేందుకు బిజెపి మరోసారి కుటిల యత్నాలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. కాగా, కుమార స్వామి ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు తమ పార్టీ సభ్యులెవరూ యత్నించలేదని రాష్ట్ర బిజెపిఅధ్యక్షుడు బిఎస్.యడ్యూరప్ప వ్యాఖ్యానించడం గమనార్హం. రాష్ట్రంలో తమ పార్టీ శాసనసభ్యులు కొందరు అసంతృప్తితో ఉన్నారన్న వార్తలను వేణు గోపాల్ ఖండిస్తూ ఈ వార్తలు అవాస్తవమని, తమ ఎమ్మెల్యేలు ఎవరూ కూడా పార్టీని వీడలేదని అన్నారు. తమ ఎమ్మెల్యేలను తమవైపుకు తిప్పుకునేందుకు బిజెపి యత్నిస్తోందని, వారికి కోట్లాది రూపాయలను ఎరవేస్తోందని అన్నారు. తమ పార్టీకి చెందిన 104మంది ఎమ్మెల్యేలను బిజెపి హర్యానా రిసార్టుకు ఎందుకు తరలించిందని ప్రశ్నిస్తూ వారితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యం కాదన్న విషయం తెలిసిన విషయమేనని వేణుగోపాల్ అన్నారు. కాగా, హర్యానా రిసార్ట్‌కు తరలించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు శుక్రవారం జరిగే పార్టీ శాసనసభ్యుల సమావేశానికి హాజరవుతారని సమాచారం.

జైట్లీ పరోక్షంలో చివరి బడ్జెట్ సమావేశాలు?

క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లిన ఆర్థికమంత్రి

న్యూఢిల్లీ : సంప్రదాయకంగా ఆర్థిక మంత్రి చేతుల మీదుగా పార్లమెంట్ ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్ లేదా తాత్కాలిక బడ్జెట్ ఈ సారి ఆయన పరోక్షంలో పార్లమెంట్ ముంగిట్లోకి వస్తోంది.. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స కోసం న్యూయార్క్ లో వున్న ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 1 నుండి ప్రారంభమయ్యే ప్రస్తుత లోక్‌సభ చివరి బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు లేకపోవటమే ఇందుకు కారణమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న జైట్లీకి ఇప్పుడు కీమో థెరపీతో పాటు ఏదైనా సర్జరీ కూడా జరిగితే కిడ్నీలపై తీవ్ర భారం పడే అవకాశం వుందని, దీనితో ఆయన కోలు కోవటం మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని ఈ వర్గాలు చెబుతున్నాయి. అయితే తాను రెండు వారాల వ్యక్తిగత సెలవుపై న్యూయార్క్‌కు వెళ్తున్నట్లు ఆర్థిక మంత్రి అధికారికంగా ప్రకటించారు. క్యాన్సర్ చికిత్సలో భాగంగా ఏదైనా సర్జరీ జరిగి, దానితో పాటు కీమో థెరపీ అవసరమైతే ఆయన్ను త్వరగా ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసే అవకాశాలు కనుచూపుమేరలో లేవని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

కోటా పెంపు సరే.. విద్యార్థుల ఫీజుల కట్టేదెవరు..?

న్యూఢిల్లీ : గత నెలలో ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోడీ సర్కారు పదిరోజుల క్రితం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును తీసుకొచ్చింది. ఇందులో భాగంగా వారికి విద్య, ఉద్యోగాలలో పదిశాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంది. అయితే దీనికి ఎలాంటి చట్టబద్ధత లేకున్నా పార్లమెంట్‌లో తనకున్న సంఖ్యాబలంతో ఆగమేఘాల మీద మోడీ సర్కారు ఈ బిల్లును ఆమోదింపజేసుకుంది. ఇప్పటివరకూ బాగానే ఉంది. అయితే వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రయివేటు వర్సిటీల లోనూ ఈ రిజర్వేషన్లను వర్తింపజేస్తామని, దీనికోసం ఈ బడ్జెట్ సమావేశాలలోనే బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మూడు రోజుల క్రితం వెల్లడించారు.

బెస్ట్ కార్మికుల సమ్మె విరమణ

మధ్యవర్తి నియామకానికి అంగీకారం

ముంబయి : వేతనాల పెంపుకై గత ఎనిమిది రోజులుగా బృహన్ ముంబయి ఎలక్ట్రికల్ సప్లై అండ్ ట్రాన్‌పోర్ట్(బెస్ట్) వర్కర్ల యూనియన్ చేస్తున్న సమ్మె బుధవారం ముగిసింది. పది దశలలో వేతనాలను పెంచేందుకు పౌర రవాణా సంస్థ యాజమాన్యం ఆమోదం తెలపడంతో సమ్మెను విరమించుకునేందుకు బెస్ట్ కార్మికులు అంగీకరించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు బెస్ట్ వర్కర్లు, యాజమాన్యం మధ్యవర్తి నియామకానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. తమకు జీతాలను పెంచాలని, బృహన్ ముంబయి కార్పొరేషన్‌తో తమ బడ్జెట్‌ను విలీనం చేయాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలంటూ బెస్ట్‌కు చెందిన 32 వేల మంది కార్మికులు ఈ నెల 8 నుండి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలిక ఒప్పందం మేరకు మధ్యంతర పరిష్కారంగా 10 దశలలో ఉద్యోగుల వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యున్నత కమిటీ సూచించింది. ఇది ఉద్యోగులకు సమ్మతమేనని, కానీ సమస్యల పరిష్కారానికి మధ్యవర్తి అవసరమని బెస్ట్ కార్మిక యూనియన్ తరుపు వాదిస్తున్న న్యాయవాది నీతా కర్ణిక్ బొంబే హైకోర్టుకు తెలిపారు. తాము యాజమాన్యంతో నేరుగా చర్చించ లేమని, ఇందుకు కార్మిక చట్టాల పట్ల అవగాహన ఉన్న మధ్యవర్తి అవసరమని, దీని నిమిత్తం రిటైర్డ్ హైకోర్టు జడ్జికి ఈ భాధ్యత అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు. జస్టిస్ నరేష్ పాటిల్, జస్టిస్ ఎన్ఎం జామ్‌దార్‌లతో కూడిన డివిజనల్ బెంచ్ ఇందుకు అంగీకరించింది. మూడు నెలల్లోగా డిమాండ్ల పరిష్కారంపై చర్చించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ సమస్యల పరిష్కారానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎఫ్ఐ రెబెల్లో మధ్యవర్తిత్వానికి బెస్ట్ వర్కర్స్ యూనియన్, యాజమాన్యం అంగీకరించాయి. కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఈ సమ్మె విరమిస్తున్నట్లు న్యాయవాది నీతా కర్ణిక్ తెలిపారు.

ప్రత్యేకం

దేశ ద్రోహ చట్టాన్ని రద్దు చేయాలి

పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయం

న్యూఢిల్లీ : అసమ్మతి, రాజకీయ వ్యతిరేకతను అణచివేసేందుకు ఉపయోగిస్తున్న దేశ ద్రోహ చట్టాన్ని ఇకపై దుర్వినియోగపరచకుండా తక్షణమే రద్దు చేయాలని పీపుల్స్ డెమొక్రసీ డిమాండ్ చేసింది. దేశద్రోహం అభియోగాలపై జెఎన్‌యు విద్యార్థి సంఘ అధ్యక్షుడు కన్నయ్య కుమార్, మరో 9మందిపై ఢిల్లీ పోలీసులు చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన నేపథ్యంలో పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయం ఈ వ్యాఖ్య చేసింది. జెఎన్‌యు ఆవరణలో ప్రదర్శన సందర్భంగా జాతి వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపిస్తూ వారిపై కేసు నమోదు చేసిన మూడేళ్ల తర్వాత ఈ చార్జిషీట్ దాఖలైందని సంపాదకీయం పేర్కొంది. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వ కక్షపూరిత వైఖరిలో భాగమే ఈ దేశద్రోహం (ఐపిసిలోని సెక్షన్ 124ఎ) అభియోగమని విమర్శించింది. ఆనాడు స్వాతంత్ర సమరయోధులపై ఒక ఆయుధంగా ఉపయో గించేందుకు బ్రిటీష్ పాలకులు ఈ చట్టాన్ని తీసు కువచ్చారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ క్లాజు ఇంకా కొనసాగడం సిగ్గు చేటైన విషయమని సంపాదకీయం పేర్కొంది. తమ వర్గ ప్రయోజనాలు కాపాడుకునేందుకు ఆనాటి కాంగ్రెస్ పాలకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, అప్పటి నుండి పోలీసులు, వివిధ ప్రభు త్వాలు తమ రాజకీయ ప్రత్యర్థులను, ప్రజా పోరా టాలకు నాయకత్వం వహించిన వారిని లక్ష్యంగా చేసుకోవడానికి విచక్షణారహితంగా ఈ దేశద్రోహ నిబంధనను ఉపయోగిస్తూ వస్తున్నాయని సంపా దకీయం విమర్శించింది. వారం రోజుల క్రితం, అస్సాంలో ప్రముఖ మేధావి హిరేన్ గొహైన్, రాజ కీయ కార్యకర్త అఖిల్ గొగోయ్, జర్నలిస్టు మంజిత్ మహంతాలపై దేశద్రోహం కేసు నమోదైంది. పార్లమెంట్‌లో పౌరసత్వ(సవరణ) బిల్లును ప్రవేశ పెట్టడానికి వ్యతిరేకంగా బహిరంగంగా ప్రసం గాలు చేయడమే వారు చేసిన తప్పు. ఐపిసి సెక్షన్ 124లోని దేశద్రోహ నిబంధన నిరంకుశమైనది. 'విద్వేషాన్ని లేదా ధిక్కారాన్ని ప్రదర్శించినా లేదా ప్రదర్శించడానికి ప్రయత్నిం చినా, చట్టబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వం పట్ల అవిధేయతను చూపిం చినా, లేదా చూపించడానికి ప్రయత్నించినా అది దేశద్రోహమే' అని ఈ నిబం ధన నిర్వచిస్తోంది. మోడీ ప్రభుత్వ హయాంలో, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే లేదా ప్రధానిని విమర్శించేవారిని జాతి వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. వారిపై దేశద్రోహం అభియోగాలు మోపుతున్నారు. అయితే, 1962 నాటి కేదార్‌నాథ్ సింగ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో ఈ చట్టం గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానించింది. హింస లేదా హింస ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తేనే ఈ నిబంధనను వర్తింపచేయాలని స్పష్టంగా పేర్కొంది. అయినా ఆ వ్యాఖ్యలతో నిమిత్తం లేకుండా ఈ నిబంధనను విచక్షణారహితంగా ఉపయోగిస్తూనే వున్నారని సంపాదకీయం విమర్శించింది. కొంతకాలం క్రితం, కొంతమంది వ్యక్తులను అరెస్టు చేశారు. ఇంతకీ వారు చేసిన నేరం ఏమిటో తెలుసా? సినిమా హాల్లో జాతీయ గీతం వస్తున్నపుడు నిల బడలేదని వారిపై ఈ కేసు పెట్టారని పిడి సంపాద కీయం పేర్కొంది. రాజ్యాంగంలో దేశద్రోహం నిబంధన కొనసాగినంత కాలమూ, సుప్రీంకోర్టు వివరణతో నిమిత్తం లేకుండా అప్పటికి అధికారం లో వున్న పాలకులు దాన్ని దుర్వినియోగం చేస్తూనే వుంటారని సంపా దకీయం వ్యాఖ్యానించింది. అందువల్ల తక్షణమే భారతీయ శిక్షా స్మృతిలోని ఈ నిబంధనను రద్దు చేయడం తప్పనిసరని పేర్కొంది. అలాగే, ముందస్తుగా జాగ్రత్తగా నిర్బం ధంలోకి తీసుకోవడం, బెయిల్ నిరాకరించడం వంటి వాటికి సంబంధిం చిన చట్టాలు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ), చట్ట వ్యతిరేక కార్యకలా పాల (నిరోధక) చట్టం (యుఎపిఎ) దుర్వినియోగ మవుతున్నాయని సంపా దకీయం పేర్కొంది. ఇటీవలే, బులంద్‌షార్‌లో గోవధ కేసులో ముగ్గురు నిందితులపై ఎన్ఎస్ఎ కింద కేసు నమోదైంది. అదే సమయంలో, అదే సంఘటనలో ఇన్‌స్పెక్టర్ సుబోధ్ సింగ్ హత్యకు సంబంధించిన నిందితులపై ఎన్ఎస్ఎ కింద కేసు నమోదు చేయలేదు. ఎలాగర్ పరిషద్ కుట్ర కేసులో అరెస్టయిన ఎనిమిది మంది పౌర హక్కుల కార్యకర్తలు ఇప్పటికీ జైల్లోనే మగ్గుతున్నారు. వారిపై యుఎపిఎ నిబంధనల కింద కేసు నమోదైంది.

ఈ నేపథ్యంలో, అసమ్మతి, రాజకీయ వ్యతిరేకతలను అణచివేసేందుకు ఇటువంటి నిరంకుశ చట్టాలను ఉపయోగించడం తక్షణమే నిలుపుచేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. ఈ దిశగా ముందు తీసుకోవాల్సిన చర్య దేశద్రోహం నిబంధనను రద్దు చేయడమేనని పేర్కొంది.

పాత్రికేయుని హత్య కేసులో 'డేరా బాబా'కు యావజ్జీవం

ముగ్గురు అనుచరులకు కూడా...

పంచకుల : 2002లో జరిగిన రామచంద్ర చత్రపతి అనే పాత్రికేయుని హత్యకేసులో ప్రధాన నిందితుడు, స్వయం ప్రకటిత బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్(డేరా బాబా)కు హర్యానాలోని ప్రత్యేక కోర్టు జీవిత ఖైదును విధించింది. గత శుక్రవారం ఈ కేసు విచారణ చేపట్టిన కోర్టు డేరా బాబాతో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులైన కుల్‌దీప్ సింగ్, నిర్మల్ సింగ్, కృష్ణన్ లాల్‌లను దోషు లుగా ప్రకటిం చగా...గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన విచారణలో ఈ ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్షకు గురైన డేరా బాబా ప్రస్తుతం రోహ్‌తక్‌లోని జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఈ హత్య కేసులో 2017 ఆగస్టులో ఆయనను దోషిగా కోర్టు నిర్ధారించిన అనంతరం పంచకులలో చెలరేగిన అల్లర్లలో 30 మంది మరణించిన సంగతి తెలిసిందే. విచారణ నేపథ్యంలో పంచకులతో పాటు సిర్సాలోని డేరా బాబా ప్రధాన కార్యాలయం వద్ద భారీగా భద్రతా దళాలను నియమించినట్లు అధికారులు తెలిపారు. పంచకుల లోని కోర్టు కాంప్లెక్స్ వెలుపల ఉన్న రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. భద్రతల నడుమ ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని హర్యానా ప్రభుత్వం విజ్ఞప్తిని బుధవారం ప్రత్యేక కోర్టు అంగీకరించింది.

ట్రంప్ ప్రసంగాన్ని వాయిదా వేసుకోమన్న పెలోసీ

వాషింగ్టన్ : సరిహద్దు గోడ కోసం లక్షలాది మంది ఉద్యోగుల ఉసురు తీస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 29న అమెరికన్ కాంగ్రెస్‌లో చేయాల్సి వున్న వార్షిక ప్రసంగాన్ని వాయిదా వేసుకోవాలని ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సి పెలోసి ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుండడం వల్ల భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆమె అన్నారు. తాను, ట్రంప్ కలసి మాట్లాడుకుని కొత్త తేదీని నిర్ణయిస్తామని ఆమె చెప్పారు. ట్రంప్ తన ప్రసంగాన్ని వాయిదా వేసుకునేందుకు అంగీకరించని పక్షంలో దానిని లిఖిత పూర్వకంగా సమర్పించ వచ్చుని పెలోసి సూచించారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీ మంత్రి కిరస్టీన్ నీల్సన్ మాత్రం అధ్యక్షుని యూనియన్ ఆఫ్ స్టేట్ ప్రసంగానికి తాము అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

షట్‌డౌన్‌పై రగులుతున్న ఆగ్రహం

అమెరికాలో గత నాలుగు వారాలుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్ వల్ల పని, వేతనాలు లేక ఇబ్బంది పడుతున్న ఫెడరల్ ఉద్యోగులు గురువారం నాడు వాషింగ్టన్ వీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం.



కెన్యా హోటల్‌పై దాడిలో 21కి పెరిగిన మృతులు

- ట్రంప్ నిర్ణయానికి నిరసనగానే ఈ దాడి అని ప్రకటన
- ఖండించిన ఇజ్రాయిల్ ఎంబసీ

నైరోబి : కెన్యా రాజధాని నైరోబిలో హోటల్‌పై జరిగిన దాడిలో మృతుల సంఖ్య 21కి పెరిగింది. మృతుల్లో అమెరికా, బ్రిటన్ పౌరులు కూడా వున్నారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న చర్యకు ప్రతీకారంగా ఈ దాడికి పాల్పడినట్లు అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్ షాబాబ్ ప్రకటించింది. ఫైవ్‌స్టార్ డ్యూసిట్ డి2 హోటల్, నైరోబిలోని వాణిజ్య సముదాయంపై రాళ్ళు, గ్రెనెడ్లు విసిరింది తామేనని సోమాలికి చెందిన అల్ షాబాబ్ పేర్కొంది. దాదాపు 20గంటల పాటు హోటల్‌ను మొత్తంగా తన అధీనంలోకి తీసుకుని మారణకాండ సృష్టించారు. ఈ దాడిలో మరణించిన వారిలో అమెరికన్ సిఇఓ జాసన్ స్పిండ్లర్ (40) వున్నారు. న్యూయార్క్‌లో 9/11 దాడుల్లో బతికి బయటపడ్డ స్పిండ్లర్ ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

కాగా వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు ఉగ్రవాదులను ఏరిపారేశాయి. కాగా బుధవారం ఉగ్ర వాదులు ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ తీసుకున్న తెలివితక్కువ నిర్ణయానికి మూల్యం చెలించినట్లు చెప్పారు. కాగా, కెన్యాలోని ఇజ్రాయిల్ ఎంబసీ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. అమాయకులపై జరిపిన మరో దాడిగా అభివర్ణించింది. రెండు దేశాలు కలిసి ఉగ్రవాదంపై పోరు సల్పుతాయని ప్రకటించింది.

అమెరికన్ కాంగ్రెస్ ఇంటెలిజెన్స్ కమిటీ సభ్యుడిగా ఇండియన్ అమెరికన్ రాజా కృష్ణమూర్తి

వాషింగ్టన్ : ఇంటెలిజెన్స్‌పై కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా ఇండియన్ అమెరికన్ రాజా కృష్ణమూర్తి (45) నియమితులయ్యారు. అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాలను బలోపేతం చేసే శక్తివంతమైన ఈ కమిటీలో నియమితుడైన మొదటి దక్షిణాసియా జాతీయుడు ఈయనే. అమెరికన్ కాంగ్రెస్‌లో ఇల్లినాయిస్ 8వ జిల్లాకు డెమోక్రటిక్ పార్టీ తరపున ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అమెరికాకు సంబంధించి 17 ఇంటెలిజెన్స్ సంస్థల బడ్జెట్ వ్యవహారాలు, కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత హెచ్‌పిఎస్‌సిఐ (నిఘాపై కాంగ్రెస్ శాశ్వత సెలక్ట్ కమిటీ)దే. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ బుధవారం కృష్ణమూర్తి నియామకాన్ని ప్రకటించారు. కీలకమైన ఈ కమిటీ దీర్ఘకాల సాంప్రదాయమైన ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా, సమగ్రతను పరిరక్షించేలా వ్యవహరించగలదన్న ఆశాభావాన్ని పెలోసి వ్యక్తం చేశారు. అమెరికా జాతీయ భద్రతను పటిష్టపరిచేందుకు డెమోక్రాట్లు చేస్తున్న కృషికి దోహదపడేలా ఈ కమిటీ కొత్త సభ్యులు చర్యలు తీసుకోగలరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

థెరిసాపై వీగిన అవిశ్వాసం

29న బ్రెగ్జిట్ ప్లాన్ బి పూర్తి స్థాయి చర్చ, ఓటింగ్

- ప్రతిష్టంభనను తొలగించేందుకు పార్టీల నేతలతో, ఎంపీలతో చర్చలు
- బ్రెగ్జిట్ ప్లాన్ బికి సహకరించండి : ప్రధాని
- బ్రెగ్జిట్ డీల్‌లో భారీ మార్పులు అవసరమన్న ప్రతిపక్షాలు



లండన్ : బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే అవిశ్వాస తీర్మానం నుంచి అతి కష్టం మీద బయటపడ్డారు. పార్లమెంటు దిగువ సభ హౌస్‌ఆఫ్ కామన్స్‌లో థెరిసా బ్రెగ్జిట్ డీల్ వీగిపోయిన 24 గంటల్లోపే ఆమె ఈ అవిశ్వాస పరీక్షను ఎదుర్కొన్నారు. .ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెరిమి కార్బిన్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ అనంతరం బుధవారం రాత్రి జరిగిన ఓటింగ్‌లో మొత్తం 650 ఎంపీలకు గాను 631 మంది పాల్గొనగా 325 మంది అవిశ్వాసానికి వ్యతిరేకంగాను, 306 మంది అనుకూలం గాను ఓటు చేశారు. అవిశ్వాస గండం నుంచి తప్పించుకున్న థెరిసా బ్రెగ్జిట్‌పై ప్రతిష్టంభనను తొలగించేందుకు ఈ నెల 29న హౌస్ ఆఫ్ కామన్స్‌కు బ్రెగ్జిట్ ప్లాన్ బితో ముందుకు రానున్నారు. దీనిపై తన బ్రెగ్జిట్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న టోరీ పార్టీలోని ఎంపీలతోబాటు డియుపికి చెందినవారితో థెరిసా బృందం ముమ్మర చర్చలు ప్రారంభించింది. ప్రతిపక్ష పార్టీల నేతలతో, ఎంపీలతో చర్చించి దీనిపై ఏకాభి ప్రాయాన్ని సాధించేందుకు కృషి చేస్తానని ఆమె చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రం థెరిసా బ్రెగ్జిట్ డీల్‌లో భారీ మార్పులు తెస్తే తప్ప ప్లాన్ బిని కూడా అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి. నోడీల్ బ్రెగ్జిట్‌ను అడ్డుకోవాలని ఫిలిప్ హామండ్ ఎంపీలను కోరారు. నోడీల్‌కు, రెండవ రిఫరెండమ్‌కు ఇది సమయం కాదని థెరిసా మే చెప్పారు. బ్రెగ్జిట్ ప్రక్రియకు గడువు మార్చి 29 దగ్గర పడుతున్నందున దీనికి ఏదో ఒక పరిష్కారం కనుగొనాలని ఎంపీలకు ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రమాదకరమైన ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న సిప్రాస్ ప్రభుత్వం

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ విమర్శ

ఏథెన్స్ : గ్రీస్‌లో సిప్రాస్ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఓటు వేసింది. గత ప్రభుత్వాలు కొనసాగించిన ప్రమాదకరమైన, ప్రజా వ్యతిరేక విధానాలనే ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శించింది. అమెరికా, నాటో, జర్మనీలకు, యురోపియన్ యూనియన్‌లోని దేశీయ శక్తులకు నిర్దిష్టమైన హామీలను ఈ ప్రభుత్వం ఇచ్చిందని కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) ఒక ప్రకటనలో విమర్శించింది. ఈ హామీలన్నీ కూడా కేవలం ఎన్నికల వల్లనే పూర్తవుతాయి, అందుకే గతంలో ట్రంప్, ఇప్పుడు జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్ చేసినట్లుగా సిరిజా ప్రభుత్వం పట్ల పూర్తి స్థాయి విశ్వసనీయతను ప్రకటించడానికి ఈ విశ్వాస పరీక్ష అవశ్యమైందని కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ప్రెస్పెస్ ఒప్పందాన్ని ఎంతో పురోగతితో కూడినదిగా ప్రభుత్వం అభివర్ణిస్తున్నప్పటికీ వాస్తవానికి అది పూర్తి భిన్నమైనదని వ్యాఖ్యానించింది. పశ్చిమ బాల్కన్ ప్రాంతంలో యూరో-అట్లాంటిక్ ప్రాంతాల మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు, రష్యా వంటి ఇతర కేంద్రాల ప్రాబల్యాన్ని బలహీనపరిచేందుకు అవసరమైన పద్ధతిలో ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని అమెరికా, నాటో, ఇయులు భావిస్తున్నాయి. ఈ శక్తులేవీ కూడా శాంతి భద్రతలకు హామీ కల్పించలేవని కెకెఇ పేర్కొంది. ఈ కారణాలన్నింటి వల్లనే సిప్రా-జేవ్ ఒప్పందానికి వ్యతిరేకంగా కెకెఇ ఓటు వేసిందని పేర్కొంది. అమెరికా, నాటో నీచపూరితమైన ఎత్తుగడలకు వ్యతిరేకంగా, ఉమ్మడి పోరాటాలను, సంఘీభావాన్ని పరిరక్షిస్తూ ఓటు వేసినట్లు కెకెఇ ఆ ప్రకటనలో పేర్కొంది.

విశ్వాస పరీక్షలో నెగ్గిన గ్రీస్ ప్రభుత్వం : త్వరలో మరో కీలక ఓటింగ్

గ్రీక్ ప్రధాని అలెక్సిస్ సిప్రాస్ బుధవారం గ్రీక్ పార్లమెంట్‌లో విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. మెసిడోనియా పేరు మార్పుకు సంబంధించిన ఒప్పందాన్ని ధృవీకరించేందుకు అవసరమైన కీలకమైన ఓటింగ్ త్వరలో జరగనుంది. మొత్తంగా 300మంది సభ్యులు గల పార్లమెంట్‌లో 151మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేయగా, 148మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఒకరు గైర్హాజరయ్యారు. పొరుగున గల పూర్వపు యుగోస్లావ్ రిపబ్లిక్ మెసిడోనియా పేరుకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకు గతేడాది కుదిరిన ఈ ఒప్పందాన్ని పాలక సంకీర్ణంలోని జూనియర్ భాగస్వామి తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. దాంతో సిప్రాస్ ఆదివారం విశ్వాస పరీక్ష నిర్వహణకు పిలుపిచ్చారు. దేశ సుస్థిరత, విశ్వసనీయత పునరుద్ధరణకు ఈ విశ్వాస ఓటు ఎంతో కీలకమని ఓటింగ్ జరగడానికి ముందుగా చేసిన ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. మైనారిటీలో పడినందున వెంటనే పదవి నుండి వైదొలగి, సత్వర ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వెలువడుతున్న నేపథ్యంలో సిప్రాస్ మాట్లాడుతూ, మొత్తంగా యూరప్ వ్యాప్తంగా 13 మైనారిటీ ప్రభుత్వాలు వున్నాయని చెప్పారు.



అమెరికాతో చర్చలకు ఉ.కొరియా ప్రతినిధి బృందం

విదేశాంగ మంత్రితో భేటీ

వాషింగ్టన్ : ఉ.కొరియా నేత కిమ్‌యోంగ్ చోల్ నేతృత్వంలోని అణుచర్చల ప్రతినిధి బృందం అమెరికాతో చర్చల నిమిత్తం గురువారం ఇక్కడికి చేరుకున్నది. చోల్ ఇక్కడ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, ఉ.కొరియాకు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ బిగన్‌తో శుక్రవారం భేటీ అవుతారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికన్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. అయితే ఆయన వైట్‌హౌస్‌ను సందర్శించేదీ లేనిదీ వెల్లడించలేదు. ఉ.కొరియా ప్రతినిధి బృందం అమెరికా అధికారులతో ఈ వారాంతంలో భేటీ అవుతుందని అమెరికా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇందుకు సంబంధించిన వివరాలేవీ ప్రకటించకపోవటం విశేషం. 'అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధ్యక్షుడు ట్రంప్, ఉ.కొరియా ఛైర్మన్ కిమ్‌జోంగ్ ఉన్‌ల మధ్య సత్సంబంధాలు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య తరచు చర్చలు కొనసాగుతాయి' అని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు వివరించారు. నిర్దేశిత లక్ష్య సాధనలో ముందుకు సాగుతున్నామని, కొరియా ద్వీపకల్పంలో పూర్తి స్థాయి అణు నిరాయుధీకరణను సాధిస్తామని ఆయన చెప్పారు.

కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ 20 వార్షికోత్సవం సందర్భంగా భారతీయం కళార్చన-2019 ఉత్సాహంగా సాగుతోంది. 20వ జాతీయ నాటకోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటలకు చిమటకు చెందిన ఈశ్వర సాయి కృష్ణ నాద స్వర బృందం ప్రదర్శించిన నాద స్వర ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం గుంటూరు జిల్లా దొండపాడుకి చెందిన శ్రీ వెంకట వీర బ్రహ్మేంద స్వామి మురళీ కోలాట సమాజం ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆహూతులను విశేషంగా అలరించింది. నాటకోత్సవాలలో భాగంగా ఒంగోలు నందమూరి తారక రామారావు కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన 'లవకుశ' పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. రాముడు, సీత, లక్ష్మణులు, లవకుశల పాత్రధారులు సహజ నట ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ పౌరాణిక నాటకం నాటకీకరణ, దర్శకత్వం సూదన గుంట వెంకటేశ్వర్లు వ్యవహరించారు. నాటకోత్సవాలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు, జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు, భారతీయ ఉద్యమం కన్వీనర్ ఈదర భరత్ కళా పరిషత్ కోఆర్డినేటర్ అన్నమనేని ప్రసాద్, భుజంగరావు, యువి బ్రహ్మయ్య, జుజ్జురి వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు.

మొదటి పేజీ తరువాయి

దాడుల నుండి రక్షణ కల్పించండి

సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదించిన అనంతరం సుప్రీం ధర్మాసనం దీనిపై సత్వర విచారణకు అంగీకరించింది. వయసుతో నిమిత్తం లేకుండా మహిళలు ఆలయంలో ప్రవేశానికి ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని, ప్రతి మహిళ శబరిమల ఆలయంలోకి స్వేచ్ఛగా ప్రవేశించేందుకు 24 గంటలూ భద్రత కట్టుదిట్టం చేయాలని ఆ ఇద్దరు మహిళలు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దేవాలయాన్ని శుద్ధి చేయడం, మూసివేయడం వంటి చర్యలకు పాల్పడరాదని, అలా చేయడం వల్ల మహిళల గౌరవాన్ని, మత స్వేచ్ఛకు భంగం కలిగిందని, ప్రాథమిక హక్కులను ఆలయ నిర్వాహకులు ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్ దారులైన ఇద్దరు మహిళల్లో ఒకరిపై సొంత ఇంటివారే దాడి చేయగా.. మరొకరు తన జీవితం ప్రమాదంలో ఉందని భయపడుతున్నారని న్యాయవాది జైసింగ్ అన్నారు.

40కి పైగా పిటిషన్‌లపై విచారణ

మహిళలందరికీ శబరిమల ఆలయ ప్రవేశాన్ని కల్పిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు 40 పిటిషన్‌లు దాఖలు కాగా, ఈ నెల 22న ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉంది.

అయితే మహిళలు దాఖలు చేసిన పిటిషన్‌ను రంజన్‌గోగోయ్ విచారించనున్న నేపథ్యంలో..అఫిడవిట్ల విచారణలో ఆయన పాల్గొనకపోవచ్చు, కాగా మరో న్యాయమూర్తి ఇందు మల్హోత్ర సెలవులో ఉన్నారు. అదేవిధంగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును హిందూత్వ సంస్థలు ఉల్లంఘిస్తూ, దర్శనార్థం వస్తున్న మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయని, భయాందోళనలకు గురిచేస్తున్నాయని కేరళ ప్రభుత్వం కూడా గత డిసెంబర్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుమారు 1000 మంది మహిళలు శబరిమల సందర్శనకు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని, ఇటీవల నిరసన కారులు, రాజకీయ నేతల మధ్య చోటుచేసుకుంటున్న దాడుల్లో వారికి రక్షణ కల్పించలేమని పేర్కొంటూ ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు కూడా సుప్రీంను ఆశ్రయించింది. ఈ తీర్పు అమలుకు కొంత సమయం కావాలని కోరింది.

బొగ్గు గనిలో ఒకరి మృత దేహం లభ్యం

కూడా వుండడం వల్ల మృతదేహాలు తొందరగా కుళ్లిపోయాయి. వెలికితీసిన మృత దేహం గుర్తించడానికి వీలు లేకుండా అస్తిపంజరంగానే మిగిలింది. ఈ మృతదేహం ఎవరిదో గుర్తించేందుకు డిఎన్ఏ పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ లేబరోటరీకి నమూనాలు సేకరించి పంపారు.15 మంది కార్మికులు గనిలోకి ప్రవేశించాక గల్లంతయిన సంఘటన డిసెంబరు 13న చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.160 నుండి 210 అడుగుల లోతులో ఉన్న గనుల నుండి నీటి అడుగున ఉపయోగించే రిమోట్ కంట్రోల్ వాహనం సహాయంతో ఒకరి మృతదేహాన్ని తమ డైవర్లు వెలికితీశారని నావికాదళ అధికార ప్రతినిధి తెలిపారు. గత నెలలో బొగ్గు మైనింగ్ నిమిత్తం గనుల్లోకి వెళ్లిన కార్మికులు ఆ గనికి సమీపాన ఉన్న లైటిన్ నది పొంగిపొర్లడంతో అదులో చిక్కుకున్నారు.

అమరావతికి మరో మణిహారం

- ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ క్యాంపస్‌కు సిఎం శంఖుస్థాపన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో టాప్ 20 విద్యాసంస్థల్లో పదింటిని అమరావతికి రప్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీంతో రాష్ట్రం నాలెడ్జ్‌కి చిరునామాగా మారనుందన్నారు. అమరావతిలో ఐనవోలు వద్ద జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ - ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ క్యాంపస్ నిర్మాణానికి ఆయన గురువారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ దక్షిణ భారత దేశంలో మొదటి క్యాంపస్‌ను అరమరావతిలో నెలకొల్పుతుందన్నారు. ఈ సంస్థకు 50 ఎకరాల భూమి కేటాయించడం జరిగిందని, రూ.235 కోట్లతో క్యాంపస్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. సంస్థ ఎనిమిది నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయనుందన్నారు. ఈ సంస్థ నిర్మించబోయే అంతర్జాతీయ పాఠశాలకు 8 ఎకరాల భూమి ఇస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఇప్పటికే అమృత, ఎస్ఆర్ఎం, విట్ వంటి సంస్థలు అమరావతిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాలెడ్జ్‌పై పెట్టుబడులు పెడితే భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజధాని అమరావతి నాలెడ్జి ఎకానమికి కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రం ఐఐటి, ఐఐఎం, వ్యవసాయ విశ్వవిద్యాయలం, ఎఐఎంఎస్ వంటి 11 విద్యాసంస్థలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వీటి కోసం 2,912 ఎకరాల భూమి, ప్రహరీల నిర్మాణానికి రూ.132 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. దేశంలోని వంద టాప్ విశ్వవిద్యాలయాల్లో ఆరు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు చెప్పారు. ఎవరు అడ్డుకున్నా రాష్ట్రాభివృద్ధి ఆగదని అనుకున్న లక్ష్యానికి అన్ని పూర్తి చేస్తామని కేంద్రాన్ని ఉద్దేశించి సిఎం అన్నారు. శంఖుస్థాపన చేసిన రోజే ప్రారంభోత్సవ తేదీని నిర్ణయిస్తున్నట్లు చెప్పారు. కియా కార్లు ఈ నెల 29వ తేదీన రోడెక్కనున్నాయన్నారు. అమరావతిలో అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా డక్ట్ విధానంలో గ్యాస్, మంచినీరు, సమాచార కేబుల్స్, మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాజధాని మొత్తానికి ఒకేచోట ఎసి యూనిట్ ఏర్పాటు చేసి కావాల్సిన ఇంటికి, కార్యాలయాలకు అనుసంధానం చేసే వ్యవస్థ గురించి పరిశీలించమని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రకృతి సేద్యంతో ఆహారం, కృష్ణా నది నీరు అందిస్తే వందేళ్లకుపైగా బతకడానికి అవకాశం ఉందన్నారు. ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐకు ప్రభుత్వం, సిఆర్‌డిఎ సంపూర్ణ సహకారం అందిస్తాయని, ప్రముఖ నిర్మాణ సంస్థలన్ని రాష్ట్రంలో అందుబాటులో ఉండటంతో నిర్మాణాలు వేగంగా పూర్తివుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్స్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జానీమూన్, కలెక్టర్ కోన శశిధర్, సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఆంధ్రా జోసూట్ ప్రావిన్స్, ప్రావిన్సియల్ ఫాదర్ పిఎస్ అమల్‌రాజు, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జంషెడ్‌పూర్ డైరెక్టర్ ఫాదర్ ఇ.అబ్రహం, అడ్మినిస్ట్రేటివ్ అండ్ ఫైనాన్స్ డీన్ ఫాదర్ జెరోమ్ కుటిన్హా, అకడమిక్ డీన్ డాక్టర్ ఆశీష్ కె పాణి, అమరావతి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఫాదర్ కె.ఎస్ కాసిమర్ తదితరులు పాల్గొన్నారు.

27న రాజమహేంద్రవరంలో జయహో బిసి సదస్సు

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు రాష్ట్రస్థాయి జయహో బిసి సదస్సును నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో గురువారం పార్టీ ప్రముఖులతో జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో సదస్సు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదస్సుకు మూడు లక్షల మంది బిసిలు హాజరవుతారని చెప్పారు. సదస్సు విజయవంతానికి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యాన ఓ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిసి సంక్షేమ ప్రణాళికను ప్రకటిస్తారన్నారు. భవిష్యత్‌లో బిసిల అభివృద్ధికి చేపట్టనున్న పథకాలను తెలియజేస్తారని చెప్పారు. బిసిల్లోని కుల, ఉద్యోగ, వ్యాపార సంఘాలన్నీ హాజరవుతాయన్నారు. హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ గతంలో ఎన్‌టిఆర్ రాజమహేంద్రవరం నుంచి ఎన్నికల శంఖారావం పూరించారని, 27న జరగనున్న బిసి సదస్సు 2019 ఎన్నికల శంఖారావం పూరించనుందని చెప్పారు. సమావేశంలో ఎంఎల్ఎలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తోట త్రిమూర్తులు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌సిలు ఆదిరెడ్డి అప్పారావు, చిక్కాల రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రయివేటు బీమా కంపెనీలకు లాభాలు 3000 కోట్లు..

- ప్రభుత్వరంగబీమా కంపెనీలకు నష్టం 4000కోట్లు .ఐఆర్‌డీఏఐ
- మోడీ పాలనలో అన్నదాత సొమ్ము కార్పొరేట్ల పాలు..

న్యూఢిల్లీ: పంటల బీమా పథకం అమలులో ఓవైపు ప్రభుత్వరంగ బీమా కంపెనీలు నష్టపోతుండగా, ప్రయివేట్‌ంగ సంస్థలు వేల కోట్ల లాభాలను ఆర్జించినట్లు భారత బీమా నియంత్రణ,అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 11 ప్రయివేట్ కంపెనీలు రైతుల పంట పొలాలకు ప్రీమియం కింద రూ.11,905 కోట్ల 89 లక్షలు సేకరించగా, నష్టపోయిన రైతులకు క్లెయిమ్‌ల కింద ఇచ్చింది రూ.8,831 కోట్ల 78 లక్షలు మాత్రమే. అంటే ప్రయివేట్ కంపెనీలకు చేకూరిన లబ్ధి రూ.3000 కోట్లు. మరోవైపు అదే ఆర్థిక సంవత్సరం ప్రభుత్వరంగ(పీఎస్‌యూ) బీమా సంస్థలు రూ.4085 కోట్లమేర నష్టపోయాయి. పీఎస్‌యూలు ప్రీమియం కింద వసూలు చేసింది రూ.13,411 కోట్ల 10 లక్షలు కాగా, రైతులు క్లెయిమ్ చేసింది రూ.17,496 కోట్ల 64 లక్షలు. అంటే పీఎస్‌యూలు ప్రీమియం కింద వసూలు చేసినదానికన్నా రైతులకు నష్టపరిహారంగా చెల్లించిందే అధికమని అర్థం. ప్రధానమంత్రి పంటల బీమా పథకం(పీఎంఎఫ్‌బీవై)లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం కింద 98 శాతం చెల్లిస్తాయి. రైతులు చెల్లించాల్సింది 2 శాతం మాత్రమే. అల్ప వర్షపాతం, వరదలు, తుఫాన్ల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ఈ పథకం కింద బీమా కంపెనీల నుంచి నష్టపరిహారం పొందే వీలున్నది.

అయితే, ప్రభుత్వ బీమా కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో ముందుండగా, ప్రయివేట్ సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఈ లెక్కల్ని చూస్తే ఎవరికైనా అర్థమవుతోంది.

నేడు పవన్‌కు పార్లమెంట్ స్థాయి కమిటీల జాబితా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీ పార్లమెంట్ స్థాయి కమిటీల జాబితా శుక్రవారం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు చేరనుంది. ఇందు కోసం నియమించిన ఎంపిక కమిటీ జాబితాలకు తుదిమెరుగులు దిద్దుతున్నట్లు పార్టీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. పవన్ తుది పరిశీలన అనంతరం వివరాలు వెల్లడిస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కలిసి పని చేసే విధంగా ఈ కమిటీలను నియమించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకూ విజయవాడలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశాల్లో కమిటీల ఎంపిక కార్యక్రమం ప్రారంభమయ్యిందన్నారు.

ఆర్టీసి బస్సులకూ పన్ను మినహాయింపునివ్వాలి

ఆర్టీసి ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆటోలకు పన్ను రాయితీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, నష్టాల్లో నడస్తున్న ఆర్టీసి బస్సులకు కూడా మోటార్ వెహికల్(ఎంవి) పన్ను మినహాయింపునివ్వాలని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసిలో ఉన్న 12వేల బస్సుల్లో 300 ఎసి బస్సుల మినహా మిగిలినవన్నీ నష్టాల్లో నడుసుస్తున్నాయని, గ్రామీణుల కోసం పల్లెలకు నడుపుతున్న తెలుగువెలుగు బస్సులకు కిలోమీటరుకు రూ.7 పైబడి నష్టం వస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కూడా చేయాలని కోరారు.

నేడు వేతన సవరణ కమిటీ భేటీ

ఆర్టీసి ఉద్యోగుల వేతన సవరణ కోసం ఆర్టీసి ఎమ్‌డి నేతృత్వంలో నియమించిన కమిటీ శుక్రవారం ఆర్టీసి హౌస్‌లో సమావేశం కానున్నట్లు ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవి రావు, పలిశెట్టి దామోదరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాల సవరణపై ఇయు సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత ఇది రెండో సమావేశమని పేర్కొన్నారు.

ఉద్యోగమిస్తామని వివాహితపై లైంగికదాడి

న్యూఢిల్లీ: భర్తతో కలహాలేర్పడి ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ఓ మహిళపై.. ఆమె అవసరాన్నే అదునుగా చేసుకుని ఇద్దరు దుండగులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఉద్యోగం పెట్టిస్తానని నమ్మించి తన మిత్రుడి ఫ్యాక్టరీకి రమ్మని సదరు వివాహితపై ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటన తూర్పు ఢిల్లీలోని ఫ్రెష్ బజార్ ఏరియాలో ఈ నెల 10న జరిగింది. కాగా, నిందితులు ఫ్యాక్టరీ ఓనర్ నజకత్ అలీ, ఆయన మిత్రుడు షకీల్ అహ్మద్‌లను మంగళవారం అరెస్టు చేశారు.


అఖిల్

'మిస్టర్ మజ్ను' ప్రీ రిలీజ్‌కు
ఎన్టీఆర్ అతిథి

అఖిల్ అక్కినేని నటించిన 'మిస్టర్ మజ్ను' ప్రీరిలీజ్ వేడుక శనివారం సాయంత్రం జరగనుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ గురువారం వెల్లడించింది. ఈ వేడుకకు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హైదరాబాద్‌లోని జె.ఆర్.సి. కన్వెన్షన్ సెంటర్‌లో ప్రీ రిలీజ్‌ను గ్రాండ్‌గా నిర్వహించబోతున్నారు. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. థమన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియో ఇటీవల విడుదలై సూపర్‌హిట్ అయ్యిందని చిత్రబృందం చెప్పింది. చిత్రంలోని అన్ని పాటలకూ శ్రోతల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొంది. ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే సందర్భంగా ఒకరోజు ముందు ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అఖిల్ గత చిత్రాలను దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రంపై మరింత శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. నాగార్జున కథపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. ఇందులో నిధి అగర్వాల్ హీరోయిన్ నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.


ఎన్టీఆర్



బ్రహ్మానందం ఆరోగ్యంపై ఆందోళన వద్దు

హాస్య నటుడు బ్రహ్మానందం ఆస్పత్రిలో ఉన్నారనే విషయం తెలిసి ఆయన అభిమానులు, సన్నిహితులు కలవరపడ్డారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని ఆయన తనయుడు హీరో గౌతమ్ తెలిపారు. కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని డాక్టర్‌ని సంప్రదించారు. వారి సలహా మేరకు శస్త్ర చికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ముంబైలోని ఈనెల 14న గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ప్రముఖ హదయ చికిత్స నిపుణులు రమాకాంత్ పాండా శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. 'నాన్నగారికి శస్త్ర చికిత్స జరిగిందని తెలిసి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమలోని ప్రముఖులు అందరూ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేయటం మొదలు పెట్టారు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు వల్ల నాన్నగారి ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉందని, వారందరికీ కతజ్ఞతలు' తెలిపారు ఆయన కుటుంబ సభ్యులు.

ఎల్వీ ప్రసాద్ ఎందరికో స్ఫూర్తి


బాలకృష్ణ

అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ ఎంతోమందికి స్ఫూర్తి అని, భావి తరాలకు ఆయన గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలకృష్ణ అన్నారు. ఎల్వీ 111వ జయంతిని హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గురువారం నిర్వహించారు. ప్రసాద్ క్రియేటివ్ మెంటార్స్ ఫిలిం అండ్ మీడియా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం బాలకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి అనంతరం మాట్లాడారు. 'భారత సినీ రంగంలో ఎల్వీ ప్రసాద్ గురించి చెప్పడం అంటే సూరీడికి వెలుగు చూపించడమే. ఆయన ఒక వ్యవస్థ. నటుడు కావాలనుకున్నారు. అలాగే నటించారు. దర్శకుడిగా మారారు. ఆయన సినిమా రంగంలో తనకు ఇష్టమైన అన్ని శాఖల్లోనూ కృషి చేశారు. ప్రసాద్ ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. సర్వేంద్రియానాం నయనం ప్రదానం అంటారు. అందుకే ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి. మద్రాసులో ఎదురెదురిళ్లల్లో ఉండేవాళ్లం. గతాన్ని ఎవరూ మర్చిపోకూడదు. భావి తరాలకు చెప్పాలి. ఎల్వీ ప్రసాద్‌గారి కలల్ని ఆయన తనయుడు సాకారం చేయడం ఆనందంగా ఉంద'ని అన్నారు.

దర్శకుడు వైవీయస్ చౌదరి మాట్లాడుతూ 'ఎల్వీ ప్రసాద్, ఎన్టీఆర్ ఇద్దరూ మహావృక్షాలు. సినిమా రంగం పట్ల వ్యామోహాన్ని పెంచుకున్నారు. సినిమా రంగంలోనే తాము సంపాదించినదాన్ని పెట్టుబడిగా పెట్టారు. వారి వారసత్వాన్ని వారి పిల్లలు కొనసాగిస్తున్నారు. నా 'లాహిరిలాహిరి లాహిరిలో' సినిమా సమయంలో నేను ప్రసాద్ ల్యాబ్స్‌కు 8.75లక్షలు కట్టాల్సి ఉన్నా రమేష్ ప్రసాద్‌గారు సాయం చేశారు. అలాగే 'రేయ్' సినిమా కూడా ఆయన ఆశీసులతోనే విడుదలైంది. ఇక.. నందమూరి బాలకృష్ణ తండ్రి మీద బయోపిక్ తీసి అందరి మెప్పు పొందారు. ఆ మహానుభావుని చరిత్ర ముందుతరాలకు అందించాలని ఎంతో కష్టపడి అతితక్కువ కాలంలో ఇంత పెద్ద సినిమా తీసి ఆ మహానటున్ని ప్రత్యక్షంగా చూసేలా చేసారు. అదేవిధంగా ఎల్వీ ప్రసాద్‌గారి మీద ఆయన తనయుడు ఓ మంచి బయోపిక్ తీయాలి' అని అన్నారు.

గీతాంజలి మాట్లాడుతూ 'నన్ను అందరూ చూడగానే సీతమ్మ అని పిలుస్తున్నారంటే అందుకు కారణం పెద్దాయన ఎన్టీఆర్ గారే. 'సీతారామ కల్యాణం' తర్వాత నేను చేసిన సినిమా 'ఇల్లాలు'. అప్పట్లో ఎల్వీ ప్రసాద్‌గారి మెప్పు పొందాను. మా అబ్బాయిని కూడా సినిమాల్లోకి తీసుకునిరావాలని అనుకుంటున్నాన'ని చెప్పారు.

ప్రసాద్ క్రియేటివ్ మెంటార్స్ ఫిలిం అండ్ మీడియా స్కూల్ ప్రతినిధి సురేష్ కొవ్వూరి మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎల్వీ ప్రసాద్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ రన్ చేస్తున్నాం. త్వరలోనే ప్రొడక్షన్‌లోకి రావాలనుకుంటున్నాం. ఎల్వీ ప్రసాద్‌గారి జీవితంలోని విషయాలను ప్రతి ఒక్కరూ తలా రెండు పేజీలు చదివి ఆచరించాలి'అని పేర్కొన్నారు.

రమేష్ ప్రసాద్ తనయ రాధాప్రసాద్ మాట్లాడుతూ 'మా తాతగారి గురించి ఏవీ చూసి థ్రిల్ అయ్యాను. మా పూర్వీకుల విలువలని, వాళ్ల ఆలోచనలని గౌరవించి, కొనసాగిస్తాం. మా నాన్నగారు ముందుండి తాతగారి బయోపిక్ తీయాలని ఆలోచిస్తున్నామ'ని తెలిపారు.

రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ 'మా నాన్న సినిమా వ్యక్తి. ఆయనకు సినిమా తప్ప మరేమీ తెలియదు. ఇంట్లో వాళ్లని కూడా ఎక్కువగా కలిసేవారు కాదు. ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకి వెళ్లే దారిలో ఆయన రెస్ట్ తీసుకునేవారు. నేను ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఈ రంగంలోకి వచ్చాను. అంతకు ముందే నన్ను నటుడిని చేయాలన్నది మా నాన్నగారి కోరిక. అయితే ఓ సారి 'సంసారం' సినిమా షూటింగ్‌లో నేను అంతంత సేపు స్టూడియోలో కూర్చోవడం ఇష్టం లేక ఆయన్ని విసిగించాను. అప్పటి నుంచి నాకు యాక్టింగ్ మీద పెద్దగా ఆసక్తిలేదు. మా ప్రసాద్ ప్రాసెసింగ్ ల్యాబ్‌కి 17 సార్లు జాతీయ పురస్కారం దక్కింది. మా నాన్నకు పృథ్వీరాజ్‌కపూర్ ఫ్యామిలీ అంటే చాలా ఇష్టం' అని తెలిపారు.

'స్పైడర్ మ్యాన్ ఫార్ ఫ్రమ్ హోమ్'లో
ఐరన్ మ్యాన్ ఉన్నాడా? లేడా?



హాలీవుడ్‌కు చెందిన 'స్పైడర్ మ్యాన్' సిరీస్‌లకు అంతా అభిమానులే. మార్వెల్ కామిక్స్ నుంచి పుట్టిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా మరో స్పైడర్ మ్యాన్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. 'స్పైడర్ మ్యాన్: ఫార్ ఫ్రమ్ హోం' పేరుతో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించి రెండు వేర్వేరు ట్రైలర్లు ఇటీవలే విడుదలయ్యాయి. ఈ సిరీస్.. 'అవేంజర్స్ – ఎండ్‌గేమ్'తో ముడిపడి ఉంటుంది. అందులో ప్రతినాయకుడు థానోస్‌ను అంతం చేయడానికి ఐరన్‌మ్యాన్‌తో పాటు స్పైడర్ మ్యాన్ కూడా సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. అతన్ని అంతం తర్వాత పీటర్ పార్కర్ (స్పైడర్ మ్యాన్) తన స్నేహితులతో కలిసి యూరప్ హాలీడే ట్రిప్‌కు బయల్దేరుతాడు. అక్కడ కూడా ఓ ప్రతికూల శక్తిని అతను ఎదుర్కోవలసి వస్తుంది. ఈ చిత్రంలో ఐరన్ మ్యాన్ పాత్ర కనిపించలేదు. ఈ సిరీస్‌కు ముందు విడుదలైన 'స్పైడర్ మ్యాన్: హోం కమింగ్' సినిమాలో ఐరన్ మ్యాన్‌తో కలిసి స్పైడర్ మ్యాన్ సాహసాలు చేస్తాడు. అంతేకాదు, స్పైడర్ మ్యాన్‌కు ఐరన్‌మ్యాన్ సరికొత్త సూట్ కూడా ఇస్తాడు. తాజా ట్రైలర్‌లో ఐరన్ మ్యాన్ కనిపించకపోవడం, స్పైడర్ మ్యాన్ సూట్‌లోనూ మార్పులేవీ లేకపోవడంతో 'ఐరన్ మ్యాన్' ఉన్నాడా? చనిపోయాడా? అనే అనుమానాలను హాలీవుడ్ ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. పైగా టోనీకి చెందిన సంస్థ చెక్‌పై అతని ప్రేమికురాలు పెప్పర్ పాట్స్ సంతకం ఉండటంతో అంతా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'అవేంజర్స్' సినిమాలో ఐరన్‌మ్యాన్ అంతరిక్షంలో తప్పుకుపోయినట్లు చూపించిన సంగతి తెలిసిందే. అందులో స్పేస్ షిప్‌లో ఆక్సిజన్ అడుగంటడంతో బతికే అవకాశాలే లేవని టోనీ చెప్పడం అతని అభిమానుల్లో ఆందోళన రేకెత్తించింది. 'స్పైడర్ మ్యాన్ – ఫర్ ఫ్రం హోం' సినిమా కూడా 'అవేంజర్స్– ఎండ్‌గేమ్' విడుదలైన ఐదు నెలలు తర్వాత.. జులై 5న విడుదల కానుంది. జాన్ వాట్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో టామ్ హాలాండ్, శామ్యూల్ జాక్సన్, జెండయా, స్లమ్‌డర్స్, జాన్ ఫెవరివ్, స్మూమీ, జాకబ్ బాట్లన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోనీ పిక్చర్స్ విడుదల చేస్తున్న ఈ చిత్రాన్ని కెవిన్ ఫిగ్, అమీ పాస్కల్‌లు నిర్మిస్తున్నారు.

'సరిహద్దు' సైనికుడు

మనిషికి, మనిషికీ.. దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంత వరకూ అవి సరిగానే ఉంటాయి. కానీ ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారి తీయొచ్చు.. ఒక్కోసారి అది జాతీయ సమస్యగానూ మారొచ్చు.. అలా మారకుండా చూసే శక్తి ఆర్మీ. సైనికుడు సరిహద్దుకు కాదు దేశానికే రక్షకుడు. ఇదే కాన్సెప్ట్‌తో తనీష్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. 'రంగు' ఫేమ్ కార్తికేయ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రం 'సరిహద్దు' అనే టైటిల్ రూపొందిస్తున్నారు. తెలుగు హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. మార్చి 16 నుంచి ప్రారంభం కాబోతోంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉండబోతోంది. తెలుగు, హిందీ భాషా నటులు నటిస్తారు.


తనీష్

యువత ఆలోచనలకు తగ్గట్టు...

'ఆర్ ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిలిమ్స్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మాతలు. అర్జున్ జంధ్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి ఒంగోలులో ప్రారంభమైంది. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడుతూ 'మా 'ఆర్ ఎక్స్ 100' విడుదలైన తర్వాత చాలా కథలు విన్నాను. వాటిలో నాకు అర్జున్ జంధ్యాల చెప్పిన కథ బాగా నచ్చింది. ఉత్తమ కథ అని అనిపించింది. వెంటనే ఓకే చెప్పేశాను. మంచి రోజు చూసి ముహూర్తం షాట్ తీశాం. నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుతున్నాం. యువత ఆలోచనలకు తగ్గట్లుగా ఉంటూనే అందరినీ అలరించే అంశాలతో ఈ చిత్రముంటుంద'ని అన్నారు.

దర్శకుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ 'బోయపాటి శ్రీను దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. కార్తికేయ కథను నమ్మి చేయడానికి ముందుకొచ్చారు. ఆయన వల్లనే ఈ చిత్రం ఇంత త్వరగా పట్టాలెక్కింది. కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం. కొన్ని యాక్షన్ సన్నివేశాలు కూడా తీయనున్నామ'ని చెప్పారు. నిర్మాతలు అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ 'నేటి నుంచి ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరిస్తాం. ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను తెరకెక్కిస్తాం. సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తామ'ని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: చైతన్య భరద్వాజ్, కెమెరామెన్: 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ రామ్, ఆర్ట్ డైరెక్టర్ : జీయమ్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శివ మల్లాల.


కార్తికేయ


నితిన్

భీష్మ

'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా 'భీష్మ' అనే చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'సింగిల్ ఫర్ ఎవర్' అనేది ఉపశీర్షిక. 'ఛలో' మాదిరిగాగే ఈ చిత్రాన్ని కూడా వెంకీ వినోదాత్మకంగా మలచనున్నారు. ఈ సినిమాకి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి అయింది. ఈ నెలాఖర్లోనే ఈ సినిమా షూట్‌కి వెళ్ళబోతున్నట్లు తెలుస్తోంది. నితిన్ లాస్ట్ సినిమా 'శ్రీనివాస కళ్యాణం' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. దాంతో నితిన్ భీష్మ చిత్రంపై మరింత దృష్టి పెట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగ వంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రష్మిక మండన్నా హీరోయిన్‌గా నటిస్తోంది.

ఊరంతా అనుకుంటున్నారు

రోవాస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతోన్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల హీరోలు. మేఘా చౌదరి, సోఫియా సింగ్ నాయికలు. బాలాజీ సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగో, ఫస్ట్ లుక్‌లను కృష్ణ విజయనిర్మల విడుదల చేశారు.

కృష్ణ మాట్లాడుతూ 'టైటిల్ బావుంటే సగం సినిమా సక్సెస్ అయినట్టే. అందులోనూ ఈ సినిమాకు 'ఊరంతా అనుకుంటున్నారు' అనే నేటివ్ టైటిల్ దొరికింది. ఇంగ్లిష్ పదాలతో ఎక్కువ టైటిల్స్ వస్తున్న ఈ సమయంలో ఇలాంటి టైటిల్ రావడం బావుంది. చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలో పెరిగాడు మా నవీన్. తనలో ఈజ్ ఉంది. పాటలు, ఫైట్లు అన్నీ బాగా చేయగలుగుతున్నాడు. ఆర్టిస్ట్‌గా మంచి భవిష్యత్తు ఉంటుంది. మా నరేష్ జడ్జిమెంట్ బావుంటుంది. నరేష్ కథ విన్నానని.. బావుందని చెబుతున్నాడంటే సినిమాలో విషయం ఉన్నట్టే. నవీన్‌కి ఈ సినిమాతో ఫ్యాన్ ఫాలోయింగ్ రావాలి' అని అన్నారు.



ఆఖరి నిమిషంలో తప్పించేశారు

తాప్సీని ఫైనల్ చేయలేదు : 'పతి పత్నీ ఔర్ వో' చిత్ర నిర్మాతలు

'పతి పత్నీ ఔర్ వో' చిత్రం 1970లో వచ్చింది. ఈ సినిమాని ఇప్పుడు రీమేక్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, జునో చోప్రా నిర్మిస్తున్నారు. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో తెరకెక్కించనున్నారు. ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ మొదలుకానుంది. ఇందులో తాప్సీ పన్ను నటించాల్సి ఉంది. కానీ తనను తప్పించారని, ఈ విషయంపై ముందుగా సమాచారం కూడా ఇవ్వలేదని తాప్సీ పేర్కొంది. ఈ విషయం గురించి తాప్సీ మీడియాతో మాట్లాడుతూ తన బాధను వ్యక్తం చేసింది. 'ఈ సినిమా రీమేక్‌కు దర్శకుడు తొలుత నన్నే ఎంపిక చేసుకున్నారని ఎంతో సంతోషించా. కథ నచ్చి ఓకే చెప్పాను. కానీ ప్రస్తుతం నేను చేస్తున్న సినిమాలన్నీ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. అన్నట్టుగానే పూర్తి చేశాను. తీరా చూస్తే ఆఖరి నిమిషంలో నన్ను సినిమా నుంచి తప్పించారు. నేను నటించిన గత నాలుగు చిత్రాలు మంచి విజయం అందుకున్నాయి. నటిగా ఎంతో పరిణతి చెందాను. అలాంటప్పుడు నన్ను సినిమా నుంచి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో నాకు సమాధానం కావాలి. ఇది నన్ను ఎంతో బాధిస్తోంది. ఇందులో దర్శకుడి తప్పేంలేదు. ఎందుకంటే వేరే నటిని ఎంపికచేసుకోవాలని ఆయనకు ఎవరో సూచించారు. దాంతో ఆయన ఒప్పుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటనను కనువిప్పుగా భావిస్తున్నాను. మున్ముందు జాగ్రత్తగా సినిమాలను ఎంచుకుంటాను. నాకు జరిగినది మరే ఆర్టిస్ట్‌కు జరగకూడదు' అని వెల్లడించింది తాప్సీ.

తాప్సీని ఎంపిక చేయలేదు

తాప్సీ చేసిన వ్యాఖ్యలపై నిర్మాతలు భూషణ్ కుమార్, జునో చోప్రా స్పందించారు." ఎప్పుడైనా సినిమా స్క్రిప్ట్ అంతా పూర్తయ్యాక దర్శకులు, నిర్మాతలు ఆ చిత్రానికి కావాల్సిన నటీనటులను సంప్రదిస్తారు. ఎవరైనా చేసేది ఇదే. ఆ విధంగానే మేమూ చేశాం. మేము చేయబోయే 'పతి పత్నీ ఔర్ వో' చిత్రబృందం ఈ సినిమా కోసం చాలా మంది నటులను సంప్రదించింది. తాము అనుకున్న పాత్రకు ఎవరైతే సరిపోతారో అటువంటివారితో మాట్లాడాం. అందులో తాప్సీ పన్ను కూడా ఉన్నారు. ఇందులో లీడింగ్ పాత్ర చేయించడం కోసం ఆమెను కలిశాం. అయితే మేము ఈమెతో ఎటువంటి ఒప్పందాలు చేసుకోలేదు. త్వరలో ఈ చిత్రానికి ఎవరైతే సరిపోతారని అనుకుంటామో వారి వివరాలను తెలియజేస్తాం. తాప్సీ అద్భుతమైన నటన కనబరిచే నటి. భవిష్యత్తులో ఆమెతో పని చేయడానికి ఆసక్తిగా ఉన్నాం' అని తెలిపారు.


తాప్సీ



అగ్రి ప్లస్



చిరుధాన్యాలు ఎక్కువ ఉష్ణోగ్రతలను, బెట్టను తట్టుకొనే పంటలు కనుక కరువు పీడిత ప్రాంతాలలో కూడా పండించటానికి వీలుంటుంది. చిరుధాన్యాలలో పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల ఇవి ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. గడిచిన మూడు నాలుగు దశాబ్దాల కాలంలో జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్ల మన ఆహార విధానంలోనూ మార్పులు వచ్చాయి. తద్వారా ప్రబలుతున్న దీర్ఘకాలిక వ్యాధుల దృష్ట్యా తిరిగి చిరుధాన్యాల వాడకంపై ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడే గృహవిజ్ఞాన విభాగం నుంచి చిరుధాన్యాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించే ప్రచారం పెరిగింది. ఇందులో భాగంగా గృహవిజ్ఞానంలో పరిశోధకురాలిగా ఉన్న డాక్టర్ కీర్తి చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటితో చేసుకోదగిన వంటల గురించి వివరిస్తున్నారు.

రైతుకు లాభం
చిరుధాన్యాల వాడకం

చిరుధాన్యాలను ప్రతిరోజు తీసుకోవడం వల్ల చిరుధాన్యాల వాడకం పెరుగుతుంది. తద్వారా రైతులు అధికంగా చిరుధాన్యాలను పండించడానికి మొగ్గు చూపుతారు. దీనితో పాటు రైతులకు అధిక ఆదాయం పెరిగే చిన్న కుటీర పరిశ్రమలనూ అభివృద్ధి చేసుకోవచ్చు. అయితే ప్రస్తుత ఆధునిక యుగంలో ఫాస్ట్‌ఫుడ్స్ వాడకం మూలంగా మార్కెట్‌లో చిరుధాన్యాలు లభించినప్పటికి చాలా మందికి వాటిని ఎలా వినియోగించాలో తెలియక చిరుధాన్యాల వాడకాన్ని తగ్గించారు. చిరుధాన్యాల పోషక విలువలను, చిరుధాన్యాలతో వివిధ ఆహార పదార్థాలను త్వరితగతిని చేసుకునే పద్ధతులపై అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నారు గృహ విజ్ఞాన పరిశోధకులు. ఈ ప్రయత్నంలో భాగంగా చిరుధాన్యాలతో పౌష్టిక విలువలతో కూడిన సంప్రదాయ వంటలు ఎలా చేసుకోవాలో తెలియజేస్తున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

మనం రోజూ తీసుకునే వరి అన్నం, గోధుమల కంటే చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను కూడా చేర్చడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు. చిరుధాన్యాల సాగుతో వీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి వీలుకలుగుతుంది. చిరుధాన్యాలలో కాల్షియం ఎక్కువగా ఉండటం వల్ల పిల్లల్లో, మహిళల్లో ఎముకల పుష్టికి అవకాశం ఏర్పడుతుంది. చిరుధాన్యాలలో పీచు పదార్థం, మాసంకృత్తులు, అమైనోయాసిడ్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉంటాయి కనుక సులభంగా, నెమ్మదిగా జీర్ణం అవుతాయి. అంతేకాదు చిరుధాన్యాలను రోజువారి ఆహారంలో చేర్చడం ద్వారా గుండె సమస్యలు, మధుమేహం, ఉబకాయం వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు.

రాగులు - ఆరోగ్య లాభాలు : రాగులు వాడితే ఎముకల పెరుగుదల, దృఢత్వం మెరుగవుతుంది. ఇవి అధిక బరువు నియంత్రణ, మధుమేహ వ్యాధి నియంత్రణ, రక్తహీనత నివారిస్తాయి. గ్లూటెన్ ఎలర్జీ, సీలియాక్ వ్యాధిగ్రస్తులకు రాగులు అనువైన ఆహారం. రాగి చేదు, కారం, వగరు, తీపి రుచులు కలిగి ఉంటుంది. రాగుల్లో ప్రోటీన్లు, అమినో యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. లేలైన్, థియోనైన్, ఐసోల్యూసిన్, మిథియోనైన్, థైమీన్, ట్రిఫ్టోఫైన్ వంటి ముఖ్య అమినో యాసిడ్లు ఉండటం వల్ల కండరాలు పనిచేయటానికి, రక్తం ఏర్పడటానికి, డిప్రెషన్‌లపై పోరాటానికి, శరీర పెరుగుదల హార్మోన్లు విడుదల అవ్వడానికి, మల బద్ధకం, ఊబకాయం, వ్రణాలకి మంచి ఆహారం. ఇది జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. బాలింత స్త్రీలలో పాల ఉత్పత్తిని పెంచుతుంది. చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. పేగు క్యాన్సర్ బారిన పడకుండా ఉండటానికి ఇది చక్కని ఆహారం. రాగికి చలవ చేసే గుణం ఉండటం వల్ల వేసవి కాలంలో ఎండతాపాన్ని తట్టుకోవడానికి రాగి జావ, అంబరిని ఎక్కువగా తీసుకుంటారు. విటమిన్-ఎ, బి-1, బి-2, ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలు అధికంగా ఉండటం వల్ల రాగులను 'పోషక ధాన్యంగా' పిలుస్తారు. ఈ రాగులతో రాగిజావ, సేమ్యా, ఇడ్లి, వడ, పుల్లటి పునుగులు, చెక్క పకోడి, పూరి , బూంది, మురుకులు, పొగడాలు, మిక్స్‌డ్ అటుకులు, లడ్డు, సంకటి, బొబ్బట్లు వంటి సంప్రదాయ వంటకాలు చేసుకోవచ్చు.

జొన్నలు - ఆరోగ్య లాభాలు : జొన్నలతో అధిక శక్తి, పెరుగుదల సాధ్యమవుతుంది. అంతేకాక మలబద్ధకం నియంత్రణ, మధుమేహ వ్యాధి నియంత్రణ, కొలెస్ట్రాల్ నియంత్రణతో పాటు గ్లూటెన్ ఎలర్జీ, సీలియాక్ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారం. జొన్నలు ఆరోగ్యవంతమైన జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఇది రక్తహీనతకు, మలబద్ధకానికి చక్కని ఆహారం. కండపుష్ఠికి, ఎముకల పటుత్వాన్ని పెంచుతుంది. కాల్షియం స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పెంపొందిస్తుంది. ఇందులో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. క్యాన్సర్ బారినపడకుండా కాపాడుతుంది. ఇది గ్లూటెన్ లేని ఆహారం. థయామిన్, రైబోఫ్లేరిన్ పుష్కలంగా ఉండటంతో నరాల బలహీనతలు, మానసిక రుగ్మతలు, కాళ్లు చేతులు మంటలు, నోటి పుండ్లు, వార్ధక్య రుగ్మతల నుంచి కాపాడతాయి. ఇలాంటి జొన్నలతో స్వీట్ దోశ, హాట్ బాల్స్, జొన్న పాయసం, జొన్న బజ్జీ, జొన్న సేమ్యా, పాల తాలికలు, ఉప్మా, పొంగలి, జొన్న రవ్వ బిర్యాని, జొన్న రవ్వ, కిచిడి, బూంది, జొన్న వడ, అరటికాయ బజ్జీ, చెక్కలు, జంతికలు, చెక్క



పకోడి, జొన్న అటుకులతో చుడువా, మురిపి, గవ్వలు, లడ్డు, బర్ఫీ, అటుకుల పాయసం, వడియాలు మొదలైన వంటకాలు చేసుకోవచ్చు.

సజ్జలు - ఆరోగ్య లాభాలు : సజ్జలు అధిక శక్తి, శరీర పెరుగుదలకు తోడ్పడతాయి. ఇవి మల బద్ధకాన్ని నియంత్రిస్తాయి. రక్తహీనత నివారణ, కడుపులో పుళ్లను (అల్సర్) తగ్గించడం, గ్లూటెన్ ఎలర్జీ, సిలియాక్ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారం. సజ్జలు వగరు, తీపి రుచులు కలిగి ఉంటాయి. సజ్జలలో పిండి పదార్థం అధికం, వీటిలో ప్రోటీన్లు, పీచు పదార్థం అధికంగా ఉంటాయి. సజ్జలలో ఉండే అమినోయాసిడ్లు గోధుమలో ఉండే అమినో యాసిడ్లు కంటే తేలికగా జీర్ణమవుతాయి. బి-కాంప్లెక్స్ మిటమిన్లు (నియాసిన్, మిథియోనైన్, థయామిన్, రైబోఫ్లైవిన్, ఫోలిక్ యాసిడ్, లెసిథిన్) పోటాషియం, మాంగనీస్, జింక్ వంటి అవసరమైన అనేక పాత్రలను సమర్థవంతంగా నిర్వర్తిస్తుంది. నియాసిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. సజ్జలలో అధికంగా ఉండే భాస్వరం శరీర కణ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. జెనిటిక్ కోడ్ నిర్మాణంలో ముఖ్యమైన న్యూక్లిక్ యాసిడ్స్‌లో ఫాస్పరస్ ముఖ్యభాగం. కణాల పొరలు, నరాల నిర్మాణంలో పాత్ర పోషించే లిపిడ్స్‌లో కూడా భాస్వరం ఒక భాగం. సజ్జలతో తయారుచేసిన ఆహారాన్ని ప్రతిరోజు తీసుకుంటే స్త్రీలకు మూత్రపిండాలలో ఏర్పడే రాళ్ల సమస్య ఉండదు. శరీరంలో ట్రైగ్లీసరైడ్స్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. ప్రతిరోజు సజ్జ ఆహారాన్ని తీసుకోవటం వల్ల స్త్రీలలో రొమ్ము క్యాన్సర్, పిల్లలో ఆస్తమా సమస్యలు తగ్గుతాయి. సజ్జలలో ఉండే అవసరమైన పోషకం లగ్నిన్ శరీరానికి చాలా ప్రయోజనకారి. ఇది క్యాన్సర్, గుండె ఆగిపోవటం వంటి ప్రమాదాలను అరికడుతుంది. సజ్జల ఆహారం డయోబెటిక్ టైపు-2ను కూడా తగ్గిస్తుంది. సజ్జలతో మసాలా రొట్టె, అప్పాలు, స్వీట్ పూరి, సేమ్యా, బిర్యాని, బూంది, వాంగీబాత్, నమక్ ఏరా, సజ్జ పకోడి, చెక్క పకోడి, మంచూరియా, బూంది లడ్డు, బొబ్బట్లు, మిఠాయి, బాదుషా, లడ్డు.

కొర్రలు - ఆరోగ్య లాభాలు : శరీర పెరుగుదల, శరీర నిర్మాణంలో కొర్రలు తోడ్పడతాయి. సిలియాక్ జబ్బుకు అనువైన ఆహారమిది. కొర్రలు తీపి, వగరు రుచులు కలిగి ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, రక్త హీనత నివారణలో ఇది మంచి ఆహారం. శరీరంలో కొలస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. వీటిలో యాంటి ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కొర్రలలో అధిక పీచుపదార్థం, మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఫాస్పరస్, విటమిన్లు అధిక పాళ్లలో ఉంటాయి. కనుక చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు మంచి ఆహారం. ఇవి ఉదర సంబంధ వ్యాధులకు మంచి ఉపశమనం కలిగిస్తాయి. కడుపు నొప్పి, మూత్రం పోసేటప్పుడు మంటగా ఉండటం, ఆకలిమాంద్యం, అతిసారం మొదలగు వ్యాధులకు ఔషధాహారం. మాంసకృత్తులు, ఇనుము అధికంగా ఉండటం వల్ల రక్తహీనత నివారణకు చక్కటి ఔషదం. పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల మలబద్ధకాన్ని అరికడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం వచ్చినప్పుడు కొర్ర గంజి తాగి దుప్పటి కప్పుకుని పడుకుంటే జ్వరం తగ్గిపోతుందని పెద్దల అనుభవం చెబుతుంది. గుండె జబ్బులు, రక్తహీనత, ఊబకాయం, కీళ్లవాతం, రక్తస్రావం, కాలిన గాయాలు త్వరగా తగ్గుటకు కొర్రలు తినడం మంచిది. కొర్రలతో కొర్ర పాయసం, కొర్ర లడ్డు చేసుకోవచ్చు.

సామాలు - ఆరోగ్య సూత్రాలు : సామాలతో అధిక శక్తి, శరీర పెరుగుదల ఉంటుంది. రక్తహీనత నివారణ, మలబద్ధకం నియంత్రణలో సహకరిస్తుంది. గ్లూటెన్ ఎలర్జీ వారికి, సీలియాక్ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారం.

వరి గడలు - ఆరోగ్య సూత్రాలు : వీటితో మధుమేహ వ్యాధి, కొలెస్ట్రాల్, మలబద్ధకం నియంత్రణలో ఉంటాయి. గ్లూటెన్ ఎలర్జీ వారికి, సిలియాక్ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారం.

అరికలు - ఆరోగ్య సూత్రాలు : అరికలు అధిక శక్తి, శరీర పెరుగుదలను ఇస్తాయి. వీటితో మధుమేహ వ్యాధి, మలబద్ధకం నియంత్రణలో ఉంటాయి. ఇవి అధిక బరువును నియంత్రిస్తాయి.

- డాక్టర్ కె.కీర్తి
రిసెర్చ్ అసోసియేట్
గృహ విజ్ఞాన విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం
గరికపాడు, కృష్ణాజిల్లా.





దాళ్వా వరి యాజమాన్యం

దాళ్వా వరి సాగులో ఎరువుల యాజమాన్యంతో పాటు కలుపు నివారణ, జింకు లోప నివారణల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు అందిస్తున్న సూచనలు తెలుసుకోవడం వల్ల రైతులకు మంచి ఫలితాలు అందుతాయి.

ఎరువుల యాజమాన్యం :

- మొదటి దఫా సిఫారసు చేసిన భాస్వరం ఎరువును విధిగా నాట్లుకు ముందుగా వేసుకోవడం వల్ల త్వరగా మూస తిరిగి ఎక్కువ దుబ్బు చేస్తుంది. ఏ వరి సాగు పద్ధతికైనా భాస్వరం ఎరువును దమ్ములోనే వేసుకోవాలి.
- దమ్ములో భాస్వరం ఎరువును వేయని నేపథ్యంలో ఊడ్చిన వెంటనే (5 రోజులలోపు) డి.ఎ.పి. రూపంలో గాని లేదా కాంప్లెక్స్ ఎరువుల రూపంలో అందించవచ్చు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా పిలకల దశలో అంకురం ఏర్పడే దశలో వేయరాదు.
- నాటు పద్ధతిలో సిఫారసు చేసిన నత్రజని మూడు సమభాగాలుగా మొదటిసారి నాటడానికి ముందు, రెండవసారి పిలక దశలో, మూడవ సారి అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. పొటాష్ ఎరువును సగం మొదటి దఫాలో, మిగతా సగం అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.
- వెదజల్లు పద్ధతిలో మొదటి దఫా నత్రజని ఎరువును విత్తిన 15 రోజులకు, రెండవ సారి విత్తిన 40 రోజులకు, ఆఖరిసారి విత్తిన 60 రోజులకు పొటాష్ ఎరువుతో కలిపి వేసుకోవాలి.
- మిషన్‌తో ఊడ్పులో నత్రజని ఎరువును మొదటి సారి ఊడ్చిన వెంటనే, రెండవ దఫా ఊడ్చిన 20 రోజులకు, మూడవ దఫా ఊడ్చిన 40 రోజులకు వేసుకోవాలి.

వరి నాటిన పొలంలో కలుపు యాజమాన్యం : ప్రధాన పొలంలో కలుపు నివారణకు నాట్లు వేసిన 3-5 రోజుల లోపు పల్చగా నీరు పెట్టి 25 కిలోల పొడి ఇసుకలో ఎకరానికి 1.5 లీటర్లు బుటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా ఆక్సాడయర్జిల్ 35-50 గ్రా. లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ ప్రిటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడేలా చల్లాలి. కలుపు మందు వేసినపుడు పలచగా నీరు ఉండేటట్లు నీరు నిలబెట్టాలి.

వెదజల్లు పద్ధతిలో కలుపు యాజమాన్యం : వెదజల్లు పద్ధతిలో కలుపు నివారణకు విత్తిన 3-5 రోజుల మధ్య ఎకరానికి ఆక్సాడయర్జిల్ 35 గ్రా. 25 కిలోల పొడి ఇసుకతో కలిపి సమానంగా పడేలా చల్లాలి. విత్తిన 8-10 రోజుల మధ్య ఎకరానికి పైరాజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రా. లేదా ఇథాక్సిసల్ఫ్యూరాన్ 40 గ్రా. 200 లీటర్ల నీటితో కలిపి పొలంలో పిచికారి చేయాలి.

జింకు లోప నివారణ :

- దాళ్వాలో చలి ఎక్కువగా ఉండటం వల్ల జింకు మొక్కకు అందుబాటులో ఉండదు. నారుమడిలో ఆకులు మీద తుప్పు మచ్చలు కనిపిస్తే జింకు లోపంగా గుర్తించి లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.
- ప్రధాన పొలంలో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ఆఖరి దమ్ములో వేసుకోవాలి. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, జింక్ సల్ఫేట కలిపి వేయరాదు. ఈ రెండిటికి మధ్య కనీసం 24 గంటల వ్యవధి ఉండాలి.
- ప్రధాన పొలంలో ఆకు ఈనెల మీద తుప్పు మచ్చలు ఉండి మొక్క గిడసబారిపోయి ఎరువులు వేసినా కూడా ఎదగక పోయినపుడు జింకు లోపంగా నిర్ధారించుకుని 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలుచు పురుగు నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ. పిచికారి చేసుకోవాలి. చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు 10 కిలోలు వేసుకోవాలి.

డా. పి. రాంబాబు,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.





చిన్నారి

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కన ఉన్న చిత్రంలో చుక్కలను కలిపి, ఆ బొమ్మేంటో కనుక్కోండి!

పొడుపు కథలు

నిలుచుండే నిద్రిస్తాయి, వేగంగా పరుగెడుతాయి, మన జాతీయ ముద్రలో స్థానం సంపాదించాయి..?

జవాబు : గుర్రాలు

జోక్:

రాము : శ్రీనూ! చాలా ఎక్కువ బాదం తింటే ఏమవుతుందిరా?
శ్రీను : ఏమవుతుంది.. ఇంట్లో ఉన్న బాదంపప్పులన్నీ అయిపోతాయి..

దారి చూపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని బిట్టూ.. ఐస్‌క్రీం దగ్గరకు ఎలా వెళ్ళాలో దారినిచూపండి.

చిలుకమ్మ రావే !!



చిలుకమ్మ రావే!
దోర పండు తేవే !
చిన్నారికియ్యవే!
చిరునవ్వు చూడవే !

చెలిమిని పంచవే !
ఆటలెన్నో ఆడవే!
మాటలెన్ని చెప్పవే !
హాయిగా గడపవే !!

ఈ. రోజా
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల మెయిన్,
హెచ్.మురవణి, కర్నూలు జిల్లా



నేను గీసిన బొమ్మ





దార్ల రమేష్,
7వ తరగతి, జెడ్‌పి హైస్కూల్,
పెనుమాక, తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

మరో రికార్డుపై కోహ్లీసేన గురి



నేడు ఆస్ట్రేలియాతో చివరి వన్డే
ఉదయం 7.50 ని.ల నుంచి స్టార్ సిక్స్‌లో ప్రసారం

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ 2-1తో చేజిక్కించుకొని నయా చరిత్ర సృష్టించిన టీమిండియా ఇప్పుడు మరో రికార్డుపై కన్నేసింది. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి వన్డేలో టీమిండియా గెలిస్తే కొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. ఇప్పటివరకూ ఆస్ట్రేలియా గడ్డపై ఒక్క ద్వైపాక్షిక వన్డే సిరీస్‌నూ టీమిండియా గెలిచిన సందర్భం లేదు. గతంలో రెండుసార్లు ఆస్ట్రేలియాపై వన్డే ఫార్మాట్‌లో సిరీస్‌లు సాధించినప్పటికీ అవి ద్వై పాక్షిక వన్డే సిరీస్‌లు కావు. ఒకటి 1985లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్ ఆఫ్ క్రికెట్ టైటిల్ కాగా, రెండోది మూడు దేశాలు పాల్గొన్న సీబీ సిరీస్.

దాంతో ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో తొలిసారి ఆసీస్‌ను వారి దేశంలో ఓడించే అవకాశం టీమిండియా ముంగిట ఉంది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న కోహ్లీ సేన ఆసీస్ పర్యటనకు ఘనమైన ముగింపు ఇచ్చే యోచనలో ఉంది. శుక్రవారం మెల్‌బోర్న్ వేదికగా ఇరుజట్ల మధ్య సిరీస్ నిర్ణయాత్మక ఆఖరివన్డే జరుగనుంది. భారత్-ఆసీస్‌లు తలో వన్డే గెలిచి సమంగా నిలవడంతో మూడో వన్డేకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొలి వన్డేలో ఆసీస్ 34 పరుగుల తేడాతో గెలవగా, రెండో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. నేటిమ్యాచ్‌లో భారత్ గెలిచిన పక్షంలో ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్‌ను కోల్పోకుండా ముగించినట్లు అవుతుంది. మూడు టీ20ల సిరీస్ 1-1తో సమం కాగా, నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో టీమిండియా గెలుచుకున్న విషయం తెలిసిందే.

ఆస్ట్రేలియా జట్టులో రెండు మార్పులు

భారత్‌తో తలపడే ఆఖరి వన్డేలో ఆసీస్‌జట్టులో రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. ఆసీస్ బోర్డు ప్రకటించిన తుది జాబితాలో లియాన్ స్థానంలో జంపాను, పేస్ బౌలర్ బెహ్రెన్‌డోర్ఫ్ స్థానంలో స్టాన్‌లేక్ చోటు దక్కింది.

తుదిజట్టు : అరోన్ ఫించ్(కెప్టెన్), క్యారీ(వికెట్‌కీపర్), ఉస్మాన్ ఖావాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టోనిస్, మ్యాక్స్‌వేల్, రిచర్డ్సన్, సిడెల్, ఆడమ్ జంపా, స్టాన్‌లేక్.

వరల్డ్‌కప్‌కు రిషభ్ ఎంపిక భారమే : సచిన్

వచ్చే వరల్డ్‌కప్‌లో భారత క్రికెట్ జట్టులో యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు అవకాశం దక్కే అవకాశాలు సంక్లిష్టమని సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ రిషభ్ పంత్ తమ వరల్డ్ కప్ ప్రణాళికల్లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చాడు. ధోని, దినేశ్ కార్తీక్‌లు వన్డే జట్టులో ఉండగా, మరొక స్పెషలిస్టు వికెట్ కీపరైన పంత్‌కు చోటు కల్పించడం జట్టుకు భారంగా మారుతుం దన్నాడు. ధోనీ గాడిలోపడితే అతను ఏమి చేయాలను కున్నాడో అది ఖచ్చితంగా చేసి చూపెడతాడన్నాడు. కార్తీక్‌కు మంచి అనుభవం ఉంది. ఈ తరుణంలో రిషభ్ వరల్డ్‌కప్ ఎంపిక అనేది సరైనది కాకపోవచ్చని' సచిన్ పేర్కొన్నాడు.

భారతజట్టు(అంచనా) : కోహ్లీ(కెప్టెన్), రోహిత్, ధావన్, రాయుడు, కార్తీక్, ధోనీ(వికెట్ కీపర్), కుల్దీప్, జడేజా, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, షమి, సిరాజ్/విజయ్ శంకర్.

సాయ్ డైరెక్టర్ సహా ఆరుగురి అరెస్టు

అవినీతి ఆరోపణలతో సాయ్ కేంద్రంపై సిబిఐ దాడులు

న్యూఢిల్లీ : అవినీతి ఆరోపణలతో ఇక్కడి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) డైరెక్టర్‌తో సహ ఆరుగుర్ని సిబిఐ గురువారం అదుపులోకి తీసుకుంది. దేశరాజధాని లోధి రోడ్‌లో ఉన్న సాయ్ కేంద్రంలోని స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ కార్యలయంలో సిబిఐ అధికారులు సోదాలు నిర్వహించారు. 19 లక్షల రూపాయిలు బిల్లులు చెల్లింపులకు సాయ్ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలతో సిబిఐ అధికారులు ఈ సోదాలు జరిపారు. సాయంత్రం 5 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వద్ద ఉన్న సాయ్ ప్రాంగణానికి చేరుకున్నారు. రాత్రి వరకూ సోదాలు నిర్వహించారు. డైరక్టర్ ఎస్‌కె శర్మ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ హరీందర్ ప్రసాద్, సూపర్‌వైజర్ లలిత్ జోలీ, యుడిసి వికె శర్మతో పాటు ప్రైవేటు కాంట్రాక్టర్ మాన్‌దీప్ అహుజ, అతని ఉద్యోగి యునుస్‌ను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ అవినీతి విషయాన్ని సాయ్ డైరెక్టర్ జనరల్ నీలమ్ కపూర్ సిబిఐ దృష్టికి తీసుకుని వచ్చారు. 6 నెలల క్రితమే ఈ విషయాన్ని క్రీడా మంత్రి దృష్టికి కూడా ఆమె తీసుకునివెళ్లారు. అక్కడ స్పందన లేకపోవడంతో సిబిఐకి ఆమె లేఖ రాసారు. బిల్లుల చెల్లింపులకు లంచం డిమాండ్ చేయడంతో పాటు విద్యుత్ పరికరాలు, ఇతర సామాగ్రి కొనుగోలకు బిల్లులు చెల్లించాలన్నా సాయ్ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు సంవత్సరం నుంచి ఈ సాయ్ కేంద్రంలో అవినీతి కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం.

'సుప్రీం'కు పాండ్యా, రాహుల్ వ్యవహారం

అంబుడ్స్‌మన్ నియామకానికి ఆదేశించాలని సీఓఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: బిసిసిఐ వెంటనే అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు అనుమతి ఇవ్వాలని క్రికెట్ పాలకుల కమిటీ సుప్రీం కోర్టును కోరింది. యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ భవితవ్యం తేల్చేందుకు అంబుడ్స్‌మన్ నియామకం అవసరమని పేర్కొంది. జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఏఎం సప్రే నేతృత్వంలోని ధర్మాసనం సీనియర్ న్యాయవాది పీఎస్ నరసింహను బిసిసిఐ కేసులో గురువారం న్యాయ సహాయకుడు (అమికస్ క్యూరీ)గా నియ మించింది. గతంలో పనిచేసిన సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం సహాయకుడిగా ఉండేందుకు అంగీకరిం చకపోవడంతో నరసింహను ఎంపిక చేసింది. పాండ్య, రాహుల్ భవిష్యత్తును అత్యవసరంగా నిర్ణయించేందుకు అంబుడ్స్‌మన్ నియామకానికి ఆదేశించాలని సీఓఏ న్యాయవాది పరాగ్ త్రిపాఠి కోర్టును కోరారు. కాగా వారం తర్వాత బిసిసిఐ కేసులో అన్ని అంశాలు విచారిస్తామని సుప్రీం తెలిపింది.

18 నుంచి నన్నయలో కుస్తీ పోటీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం కార్పొరేషన్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 18 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్టు ఎపి కుస్తీ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి వివరాలను గురువారం ఆయన విడుదల చేశారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ పోటీలను నన్నయ విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య సుంకరి రామకృష్ణారావు, రెక్టార్ ఆచార్య పి.సురేష్ వర్మ, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.టేకి ప్రారంభిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. 16 ఏళ్లలోపు వయసు కలిగిన బాలబాలికలు సబ్ జూనియర్ కేటగిరీలోనూ, 19 ఏళ్లలోపు బాలబాలికలు జూనియర్ కేటగిరీలోనూ పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులంతా పాల్గొని పోటీలను జయప్రదం చేయాలని కోరారు.

రంజీ సెమీఫైనల్లో కేరళ

కేరళ : రంజీట్రోఫీ సెమీఫైనల్లోకి కేరళ జట్టు ప్రవేశించింది. ఓవర్‌నైట్ స్కోర్ 9 వికెట్ల నష్టానికి 185 పరుగుల వద్ద కేరళ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. దీంతో 194 పరుగుల లక్ష్యంతో మూడోరోజు బరిలోకి దిగిన గుజరాత్ థంపి (5/27), వారియర్ (4/30) దెబ్బకు 81 పరుగులకే కుప్పకూలింది. దీంతో కేరళజట్టు గుజరాత్‌పై 113 పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. కేరళబౌలర్ బసిల్ థంపికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో విదర్భజట్టు ఉత్తరాఖండ్‌పై, కర్ణాటక జట్టు రాజస్తాన్‌పై, ఉత్తరప్రదేశ్ జట్టు సౌరాష్ట్రపై మూడోరోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సంపాదించగలిగాయి.



క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్

కౌలాలంపూర్ (మలేసియా): భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండోరౌండ్ మ్యాచ్‌లో కిదాంబి 23-21, 8-21, 21-18 పాయింట్ల తేడాతో వింగ్-కి-విన్సెంట్(హాంకాంగ్)పై, మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ 21-14, 21-16 తేడాతో యిప్ పుయ్ యిన్(హాంకాంగ్)పై గెలిచి క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. పారుపల్లి కశ్యప్ 17-21, 23-25 పాయింట్ల తేడాతో విక్టర్ అక్సెల్సన్ చేతిలో వరుససెట్లలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 18-21, 17-21 పాయింట్ల తేడాతో ఇండోనేషియా జోడీ చేతిలో ఓడింది. కెంటో మొమోటోపై గెల్చిన నిషిమోటో రెండోరౌండ్‌లో 15-21, 17-21 పాయింట్ల తేడాతో లీ-జి(మలేషియా) చేతిలో ఓడాడు. శుక్రవారం శ్రీకాంత్ మాజీ ఛాంపియన్ హో-సన్ (కొరియా)తోనూ, సైనా నెహ్వాల్ ఒకుహారా (జపాన్)తోనూ క్వార్టర్‌ఫైనల్లో తలపడనున్నారు.

మూడోరౌండ్‌కు సెరెనా, వీనస్

● జకోవిచ్, జ్వెరేవ్ గెలుపు - ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ మూడోరౌండ్‌కు అమెరికా నల్ల కలువ, బిడ్డతల్లి సెరెనా విలియమ్స్ దూసుకెళ్లింది. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో 16వ సీడ్ సెరెనా 6-2, 6-2 సెట్ల తేడాతో బౌచర్డ్(కెనడా)ను చిత్తుచేసింది. ఇతర పోటీల్లో వీనస్ 6-3, 4-6, 6-0తో కార్నెట్(ఫ్రాన్స్)ను, 4వ సీడ్ ఒసాకా 6-2, 6-4తో జిడన్‌సెక్(స్లొవేనియా)పై గెలుపొందారు. అమెరికాకు చెందిన కెయాస్, చైనాకు చెందిన వాంగ్, 13వ సీడ్ సెవస్టోవా, ఆరోసీడ్ స్విటొలినా రెండోరౌండ్ పోటీల్లో ప్రత్యర్థులపై గెలిచారు. ఇక పురుషుల సింగిల్స్‌లో నాల్గోసీడ్ జ్వెరేవ్(జర్మనీ) 7-6(7-5), 6-4, 5-7, 6-7(6-8), 6-1తో క్యార్డీ(ఫ్రాన్స్)పై చెమటోడ్చి నెగ్గగా, టాప్‌సీడ్ జకోవిచ్ 6-3, 7-5, 6-4తో సొంగా(ఫ్రాన్స్)ను, 8వ సీడ్ నిషికోరి(కొరియా) 6-3, 7-6(8-6), 5-7, 5-7, 7-6(10-7)తో క్రొయేషియాకు చెందిన కర్లోవిక్‌లను ఓడించి మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు.

నేటినుంచి సెమీ ఫైనల్ పోటీలు

● ఉత్కంఠగా భరితంగా సాగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం (తూర్పుగోదావరి)



తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా 13వ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ఈనెల 15 నుంచి 18 వరకూ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలి రెండు రోజులు లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. ఓపెన్ కేటగిరీలో జరుగుతున్న ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 31 జట్లు, మహిళా విభాగంలో 14 జట్లు తలపడ్డాయి. లీగ్ మ్యాచ్‌లు పూర్తిచేసుకుని పురుషుల విభాగంలో రామచంద్రపురం ఎ, సెంట్రల్ ఎక్సైజ్ హైదరాబాద్ ఎ, ఓసి సికింద్రాబాద్, ఇఎంఇ భూపాల్, ఎపి పోలీస్, ఎస్‌బి హైదరాబాద్, విశాఖపట్నం ఎపి యూత్ జట్లు, మహిళల విభాగంలో రామచంద్రపురం ఎ, రామచంద్రపురం బి, జిఎస్ఇ గుంటూరు, ఆప్స్ ఫోర్స్ హైదరాబాద్, విఎన్ఆర్ఐ హైదరాబాద్, చిత్తూరు, అనంతపురం, నరసారావుపేట జట్లు గురువారం క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. శుక్రవారం సెమీ ఫైనల్ పోటీలు జరుగనున్నాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉపాధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

కేటీఆర్‌తో జగన్ భేటీ వైసిపికి భంగపాటు

ఎపిసిసి ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

కెటిఆర్‌తో జగన్ భేటీ వైసిపికి భంగపాటు తప్ప మరొకటి కాదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాజశేఖరరెడ్డిపై కెసిఆర్ చేసిన విమర్శలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నాయకునికి వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. ఆయన ఎంఎల్‌ఏ టికెట్టుకు ముప్పైకోట్లు, ఎంపీ టికెట్టుకు వందకోట్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు కోసం సీమాంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన టిఆర్‌ఎస్‌తో వైసిపి కలుస్తోందని, జగన్ చెప్పే ప్రత్యేకహోదాలో నిజం లేదని, టిఆర్‌ఎస్, వైసిపి కలవటంతో జగన్‌కు రూ.500 కోట్లు, చంద్రబాబుకు సిఎం పదవి గిఫ్ట్‌గా రాబోతున్నాయని చెప్పారు.

20న అన్ని నియోజకవర్గాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశాలు

వైసిపి నేత అడపాశేషు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 20న అన్ని నియోజకవర్గాల్లో అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు వైసిపి అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ విజయవాడ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు అడపాశేషు వెల్లడించారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల వివరాల సేకరణ, ఆస్తుల వివరాల సేకరణ చేపడతామన్నారు. బాధితుల వివరాలు ఆన్‌లైన్ ఉంచాలని ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టలేదన్నారు. కోర్టుకు చూపిన ఆస్తులు, కోర్టుకు చూపని ఆస్తులంటూ వేర్వేరుగా ప్రకటన చేశారని, టిడిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను కొట్టేయాలనే కుట్ర ఇక్కడ బయటపడిందని ఆరోపించారు. ఈ నెలాఖరు లోపు బాధితులకు రూ.300 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదన్నారు. ఈ నెల 8న కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి ఆ విధంగా చేయకుండా మోసం చేశారన్నారు.

ప్రజానాట్య మండలి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజానాట్య మండలి ఆంధ్రప్రదేశ్ కమిటీ క్యాలెండర్‌ను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి సాంబశివరావు గురువారం ఆవిష్కరించారు. తన బాల్య వయసులో కళారంగంతో తనకున్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రజలను కళల ద్వారా చైతన్య పరుస్తున్న ప్రజానాట్య మండలి వివిధ కళారూపాలతో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మొదటి క్యాలెండర్‌ను మిమిక్రీ కళాకారుడు సిల్విస్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావుకు ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్ జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు గుండు నారాయణ, డివి రాజు, వేంపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ వ్యాఖ్యలపై నిషేధం

దుర్గగుడి ఇఒ నిర్ణయం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి



ఇంద్రకీలాద్రిపై రాజకీయ నేతలు, వ్యాపార, వ్యక్తిగత బ్యానర్లు, ఫ్లెక్సీలను నిషేధిస్తూ ఇఒ వి.కోటేశ్వరమ్మ నిర్ణయం తీసుకున్నారు. మీడియాపైనా ఆంక్షలు విధించారు. దీంతో దుర్గగుడి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దుర్గమ్మ దర్శనం కోసం వచ్చే రాజకీయ నాయకులు ఇంద్రకీలాద్రిపై రాజకీయ వ్యాఖ్యానాలు చేస్తున్నారని, దీంతో ఆలయ ప్రతిష్ట దిగజారుతోందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. ఈనెల 14న తెలంగాణా రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ దుర్గమ్మ దర్శనానికి వచ్చి ఇంద్రకీలాద్రిపై మీడియాతో మాట్లాడారు. ఎపి ప్రభుత్వంపైనా, టిడిపి నేతలపైనా ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. అలాగే ఇటీవల భారత మహిళా క్రికెటర్లు దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సమయంలో సరైన దుస్తులు వేసుకురాలేదన్న పేరుతో జనవరి ఒకటో తేదీ నుండి తప్పని సరిగా సంప్రదాయ దుస్తులతో రావాలని ఆంక్షలు కూడా విధించారు. తాజాగా తలసాని వ్యాఖ్యల నేపథ్యంలో ఆలయ ఇఒ ఈ నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు రాజకీయ నాయకులు, మీడియా సహకరించాలని కోరారు. గతంలో అధికార టిడిపికి చెందిన జిల్లా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌సి బుద్దా వెంకన్న, ఇంకా పలువురు ఎంఎల్‌ఎలు దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సమయాల్లో అనేకసార్లు ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ రాజకీయ వ్యాఖ్యలు చేశారు. కానీ అప్పట్లో ఆలయ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. దుర్గగుడి ఆధ్వర్యాన ప్రతిఏటా జరిగే దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల విరమణ తదితర సందర్భాల్లో ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఆలయ పరిసరాల్లో భారీ కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనికితోడు టిడిపి, వైసిపి నేతలు తమ అధినేతలు ముఖ్యమంత్రులు కావాలని, మంత్రులు కావాలని కోరుకుంటూ మొక్కుల చెల్లింపుల పేరుతో పార్టీ జెండాలు, కండువాలు పట్టుకుని ఆలయ ఆవరణలో తిరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. టిడిపి నేతలైతే ఏకంగా పసుపు రంగు చొక్కాలు, కండువాలు వేసుకుని దుర్గమ్మ దర్శనం చేసుకునే పరిస్థితి ఉంది.

కొలువుదీరిన తెలంగాణ నూతన శాసనసభ

● స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ కొలువు దీరింది. గురువారం ఉదయం 11.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ముందస్తు ఎన్నికల అనంతరం 36 రోజుల తరువాత మొదలైన సమావేశాల్లో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎమ్మెల్యేల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రొటోకాల్ ప్రకారం తొలుత ముఖ్యమంత్రి కేసీఆర్.. శాసనసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం తెలుగు అక్షరమాల క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మొత్తం 115 మంది సభ్యులు ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. అయితే ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యే జాఫర్ అహ్మద్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, టిడిపి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాలతో ప్రమాణస్వీకారానికి గైర్హాజరైనట్లు తెలిసింది. ప్రమాణం చేసిన ఎమ్మెల్యేల్లో 103 మంది తెలుగులోనూ, 08 మంది ఇంగ్లీషులోనూ, ముగ్గురు ఉర్దూలోనూ ప్రమాణం చేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యాహ్నం 1.45 గంటల వరకూ కొనసాగిన సభ సభ్యుల ప్రమాణ స్వీకారం తరువాత శుక్రవారానికి వాయిదా పడింది. టీఆర్ఎస్ తరుపున 88, కాంగ్రెస్ 19, ఎంఐఎం 7, టీడీపీ 2, బీజేపీ 1, ఇద్దరు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన సంగతి తెలిసిందే. శాసనసభలో అందరికంటే సీనియర్ కేసీఆర్ కావడం విశేషం. ఆయన 1985 నుంచి ఇప్పటివరకు 8 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్, స్పీకర్‌గా ఎన్నిక కానున్న పోచారం శ్రీనివాసరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, రెడ్యా నాయక్ ఆరుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వయసురీత్యా చూస్తే సభలో అందరికంటే పెద్దవారు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు. ఆయన వయసు 73 సంవత్సరాలు. అందరిలో అతి పిన్న వయసు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్. ఆమె వయసు 29 ఏళ్లు. ప్రజాతీర్పుతో ఎమ్మెల్యేలుగా గెలిచిన 119 మంది సభ్యుల్లో 23 మంది తొలిసారిగా ఎన్నికయ్యారు. చట్టసభలకు రావడం ఇదే మొదటి సారి. ఇక ఇద్దరు ఎంపీలు మల్లారెడ్డి, బాల్క సుమన్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. మరో ముగ్గురు ఎమ్మెల్సీలు కూడా శాసనసభ్యులుగా విజయం సాధించారు. మొత్తం సభ్యుల్లో మహిళా ఎమ్మెల్యేలు ఆరుగురు, ముస్లిం మైనార్టీ సభ్యులు 8 మంది ఉన్నారు. వీరితో పాటు గత అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ఉన్న 76 మంది మరోసారి శాసనసభలో అడుగుపెట్టారు.



స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక లాంఛనం కానుంది. అధికార టీఆర్ఎస్ నుంచి పోచారం ఒకరే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక దాదాపు ఖాయం అయ్యింది. కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ పార్టీలు ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలంతా కలిసి అసెంబ్లీ కార్యదర్శి నరసింహచార్యులుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. మొత్తం ఆరు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కతోపాటు ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేఖా నాయక్, అబ్రహం, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదతరులు పోచారం అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించారు.

రోహిత్ చట్టం తీసుకురావాలి

● కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశ్వవిద్యాలయాల్లో కుల వివక్ష నిర్మూలనకు రోహిత్ చట్టం తీసుకురావాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. విజయవాడ సున్నపుబట్టీల సెంటర్‌లోని కెవిపిఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం రోహిత్ వేముల వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో ఉన్న కుల రక్కసికి రోహిత్ బలైపోయారని, ఇంత వరకూ రోహిత్ కుటుంబానికి న్యాయం జరగలేదని, మనువాద మతోన్మాద శక్తులు, ఇందుకు కారణమని అన్నారు. మతోన్మాదాన్ని అంతమొందించాలని, రోహిత్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి నటరాజ్, జి.క్రాంతి కుమార్, ఎం కుటుంబరావు, నగర నాయకులు సిహెచ్ శ్రీనివాసులు, జి నాగరాజు, కె వరప్రసాద్, బాబురావు, మోహనరావు, జి నరసింహరావు, ఎ ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ తెల్ తుంబ్డేపై తప్పుడు కేసులకు నిరసనగా సంతకాల సేకరణ

ప్రొఫెసర్ ఆనంద్ తెల్ తుంబ్డేపై పూణే పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు ఆంద్ర మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తప్పుడు కేసులను ఖండిస్తున్నామని, ఇది ప్రజాతంత్ర హక్కులను అణచివేసే చర్య తప్ప మరొకటి కాదని పేర్కొన్నిరు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న దళిత మేధావులు, ప్రజాతంత్రవాదులు, ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ చేసి ప్రధానమంత్రి, రాష్ట్రపతి, మహారాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర శక్తులు, దళిత, గిరిజన, బహుజన, ప్రజా సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

● ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు మండలం నందరం వద్ద గురువారం రెండు కార్లు ఒక ట్రాక్టరు ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెడుతున్న కారు కట్టెల లోడుతో ఉన్న ట్రాక్టరును ఓవర్‌టేక్‌కు ప్రయత్నిస్తూ ఎదురుగా వస్తున్న మరో కారునూ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4, Akulavari Street, Governerpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68